శుక్రవారం
23-5-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 241
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

అమెరికాలో ఇజ్రాయిల్ దౌత్య ఉద్యోగుల హత్య

వాషింగ్టన్: ఇజ్రాయిల్ దౌత్య కార్యాలయానికి చెందిన ఇద్దరు ఉద్యోగులు అమెరికాలో హత్యకు గురయ్యారు. వాషింగ్టన్ డీసీలోని యూదు మ్యూజియంలో జరిగిన కార్యక్రమంలో వీరిపై దుండగులు దగ్గర నుంచి కాల్పులు జరిపారు. ఈ విషయాన్ని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ సెక్రటరీ క్రిస్టి నోయెమ్ 'ఎక్స్'లో వెల్లడించారు. ఈ ఘటనపై ముమ్మర దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నిందితులను చట్టం ముందు నిలబెడతామన్నారు. మృతుల వివరాలను వెల్లడించలేదు. కాల్పులు జరిగినప్పుడు ఇజ్రాయిల్ రాయబారి అక్కడ లేరని తెలుస్తోంది. యూదులపై హింస వెంటనే ఆగిపోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఇజ్రాయిల్‌కు చెందిన ఇద్దరు ఉద్యోగులు హత్యకు గురికావడంపై సామాజిక మాధ్యమంలో ట్రంప్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు.

సత్యపాల్ మాలిక్‌పై సీబీఐ చార్జిషీట్

న్యూదిల్లీ: కిరూ జలవిద్యుత్ ప్రాజెక్టు పనుల్లో రూ.2,200 కోట్ల కుంభకోణం కేసులో జమ్మూకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ సహా ఐదుగురిపై సీబీఐ చార్జిషీటు దాఖలైంది. ఈ మేరకు దర్యాప్తు సంస్థ అధికారులు గురువారం వెల్లడించారు. మూడేళ్ల విచారణ అనంతరం నివేదికను ప్రత్యేక కోర్టుకు సీబీఐ సమర్పించింది. ఈ పరిణామాల క్రమంలో తాను ఆసుపత్రిలో చేరారని, ఎవరితో మాట్లాడే పరిస్థితిలో లేనంటూ సత్యపాల్ మాలిక్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. శ్రేయోభిలాషుల నుంచి చాలా ఫోన్‌కాల్స్ వస్తున్నాయని,

- మిగతా 2 లో

త్వరలో లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకం

విశాలాంధ్ర - హైదరాబాద్: రాష్ట్రంలో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకం చేపడుతున్నట్టు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. తొలివిడతలో ఐదువేల మంది తీసుకోబోతున్నామని చెప్పారు. సర్వేయర్ల శిక్షణపై గురువారం అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈనెల 26 నుంచి ఆయా జిల్లా కేంద్రాల్లోనే రెండు మూడు నెలలు శిక్షణ ఇస్తామని తెలిపారు. దరఖాస్తుదారులు ఆయా జిల్లా సర్వే అధికారులను

- మిగతా 2 లో

తాగునీటికి సాగర్ జలాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వేసవి నీటి అవసరాల దృష్ట్యా శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నుంచి ఏపీకి నాలుగు టీఎంసీలు, తెలంగాణకు 10.26 టీఎంసీల నీటిని విడుదల చేశారు. ఈ మేరకు కృష్ణానదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీలో చెరువులు నింపుకోవడానికి నాగార్జునసాగర్ కుడి కాలువ నుండి గురువారం మధ్యాహ్నం నీటిని విడుదల చేసినట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. సాగర్ కుడి కాలువ కింద ఉన్న పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లోని 447 మంచి నీటి చెరువులను ఈ నీటితో

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఈడీకి సుప్రీం చీవాట్లు

- అన్ని పరిమితులు దాటారంటూ హెచ్చరిక
- టాస్మాక్‌పై మనీలాండరింగ్ దర్యాప్తు నిలిపివేత

న్యూదిల్లీ: కేంద్రప్రభుత్వ చెప్పుచేతల్లో ఉండే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)పై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈడీ అన్ని హద్దులూ దాటుతోందని వ్యాఖ్యానించింది. సమాఖ్య పాలన భావనను ఈడీ ఉల్లంఘిస్తోందని ఆక్షేపించింది. టాస్మాక్ (టీఏఎస్ఎంఏసీ)పై జరుగుతున్న మనీలాండరింగ్ దర్యాప్తును వెంటనే నిలిపివేయాలని ఆదేశించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవై, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం మనీలాండరింగ్ నిరోధక దర్యాప్తు సంస్థ తరపున కోర్టుకు హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజుకు "మీ ఈడీ అన్ని పరిమితులను దాటుతోంది" అని తెలిపింది. తమిళనాడు ప్రభుత్వం అధ్వర్యంలో నడిచే మద్యం రిటైలర్ టాస్మాక్‌లో రూ.వెయ్యి కోట్ల మేర అవకతవకలు జరిగాయని ఈడీ ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టాస్మాక్‌పై ఈడీ అధికారులు ఇటీవల దాడులు జరిపారు. ఆ సంస్థ ప్రధాన కార్యాలయం, టాస్మాక్ అధికారుల ఇళ్లల్లో ఈ ఏడాది మార్చి, మే నెలల్లో తనిఖీలు చేపట్టింది. దీంతో ఈ సోదాలపై తమిళనాడు సర్కార్ హైకోర్టుకు వెళ్లింది. అక్కడ ఈడీ చర్యలను మద్రాస్ హైకోర్టు సమర్థించింది. విచారణ పేరిట టాస్మాక్ అధికారులను ఈడీ వేధిస్తోందంటూ ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టివేస్తూ... ఈడీ దర్యాప్తునకు అనుమతించింది. దీనిపై స్టాలిన్ ప్రభుత్వం, టాస్మాక్ సుప్రీంకోర్టులో సవాల్ చేయగా... ఈ పిటిషన్లపై తాజాగా విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈడీ తీరును తీవ్రంగా తప్పుబట్టింది. ఈడీ 'అన్ని హద్దులూ మీరుతోంది' అంటూ ఆగ్రహం

- మిగతా 2 లో

రుణ ప్రణాళిక లక్ష్యాలు చేరుకోవాలి

- సక్రమ బ్యాంకింగ్ వ్యవస్థతోనే సమాజాభివృద్ధి
- 'రాజీవ్ యువ వికాసం' ద్వారా యువతకు ఆర్థికసాయం
- వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం... ఉద్యాన పంటలకు పెద్దపీట
- బ్యాంకర్ల సమావేశంలో భట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్: బ్యాంకర్లు 2025-26 వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలను చేరుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆకాంక్షించారు. బ్యాంకింగ్ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటేనే సమాజం, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. బ్యాంకింగ్ రంగం బాగుండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి సమావేశం గురువారం జరిగింది. భట్టి మాట్లాడుతూ స్వయం ఉపాధి కోసం ఐదు లక్షల మంది యువతకు ఆర్థిక సహకారాన్ని అందించడానికి ప్రభుత్వం రాజీవ్ యువ వికాస పథకం అమలు చేస్తున్నట్టు తెలిపారు. రూ.6,250 కోట్ల సబ్సిడీ రుణాలు ఇస్తున్నట్టు చెప్పారు. జూన్ రెండో తేదీన రుణ మంజూరు పత్రాలు అందజేస్తున్నట్టు చెప్పారు. తగిన తోడ్పాటు అందించాలని బ్యాంకర్లకు సూచించారు. ప్రజా ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని, ఉద్యాన పంటలకు పెద్దపీట వేస్తూ ఆయిల్ పామ్ సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. రూ.21 వేల కోట్లతో రైతు రుణమాఫీ చేశామన్నారు. రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం అందిస్తున్నామని, రైతు బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పారు. అడవి బిడ్డల జీవన ప్రమాణాలు పెంచడానికి ఇందిరా సౌర గిరి జల వికాస పథకం తీసుకొచ్చినట్టు తెలిపారు. రూ.12,600 కోట్లతో ఆరు లక్షల 70 వేల ఎకరాలను సౌర విద్యుత్తు ద్వారా సాగులోకి తీసుకువచ్చే నూతన పథకాన్ని ప్రారంభించినట్టు పేర్కొన్నారు. మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతోఈ ఏడాది మహిళా సంఘాలకు రూ.20 వేల కోట్ల పైగా వడ్డీ లేని రుణాలు ఇచ్చామన్నారు. రానున్న ఐదు

- మిగతా 2 లో

నాంపల్లి కోర్టుకు రేవంత్

ఎన్నికల కోడ్ ఉల్లంఘించారంటూ కేసు

విశాలాంధ్ర - హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం నాంపల్లి మనోరంజన్ కోర్టుకు హాజరయ్యారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని ఆయనపై గతంలో కేసు నమోదైంది. అప్పట్లో బేగంబజార్‌తో పాటు నల్గొండ, మెదక్‌లో పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. నాడు తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రిజర్వేషన్లపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించి కేసును ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే కోర్టుకు హాజరయ్యారు. సీఎం హోదాలో రేవంత్ కోర్టుకు హాజరు కావడం ఇది రెండోసారి. మూడు కేసుల్లో వ్యక్తిగతంగా ఆయన హాజరుకావాల్సి ఉన్న నేపథ్యంలో కోర్టు వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కోర్టు హాల్ వద్దకు ఇతరులకు అనుమతి ఇవ్వలేదు. తనపై నమోదైనవన్నీ తప్పుడు కేసులని కోర్టుకు చెప్పారు. తాను ఎక్కడా నిబంధనలు ఉల్లంఘించలేదని అన్నారు. స్టేట్‌మెంట్ నమోదు చేసుకున్న కోర్టు జూన్ 12న తీర్పు ఇవ్వనుంది.

'నంబాల' మృతిపై సుప్రీం సిట్టింగ్ జడ్జితో విచారణ

కూనంనేని డిమాండ్

విశాలాంధ్ర - హైదరాబాద్: మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు... మరికొందరిని ఎదురుకాల్పుల్లో హతమార్చడంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకవేళ కేంద్ర ప్రభుత్వం ముందుకు రాకపోతే సుప్రీంకోర్టు ఈ కేసును సుమోటోగా స్వీకరించి న్యాయ విచారణకు ఆదేశించాలన్నారు. నంబాల మృతిపై అనేక సందేహాలు వ్యక్తం అవుతున్నాయని, ఈ వయసులో అడివిలో ఉన్నారా... తీసుకెళ్లి అక్కడ మట్టుపెట్టారా అనే కథనాలు వస్తున్నాయన్నారు. దీంతోపాటు గత కొంతకాలంగా జరుగుతున్న మావోయిస్టులు, ఆదివాసీలపై జరిగిన ఎదురుకాల్పులను సైతం విచారణలో చేర్చాలని, ఆపరేషన్ కగార్ మొదలైన నాటి నుంచి ఇప్పటివరకు జరిగిన విచారణ అంశంలో చేర్చాలని కోరారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ... శత్రుదేశంపై విజయం సాధించిన రీతిలో స్పందించడం విచారకరమని పేర్కొన్నారు. స్థానిక ప్రజల హక్కులు, వనరుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుతున్న వారిని ఏకపక్షంగా కాల్చి చంపడం సమంజసం కాదని అన్నారు. ఇది శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యగా చూడాలని చెప్పారు. 2026 మార్చి 31 వరకు నక్సలైట్లను అంతముందిస్తామని లక్ష్యంగా పెట్టుకునిమరీ కాల్పులు జరపడం, తాము శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ప్రకటిస్తున్నప్పటికీ పట్టించుకోకపోవడం ద్వారా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే కాల్పులకు పాల్పడుతున్న విషయం స్పష్టమవుతుందన్నారు. ఇది ప్రజాస్వామిక హక్కులకు విఘాతం కలిగించే అంశమని, వీటన్నింటినీ పరిగణలోకి తీసుకొని సుప్రీంకోర్టు న్యాయ విచారణ చేపట్టవలసిన అవసరం ఉందని సాంబశివరావు పేర్కొన్నారు.

ధిక్కార స్వరమేనా!

తండ్రి కేసీఆర్‌ను ప్రశ్నిస్తూ కవిత సంచలన లేఖ

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో సంచలన పరిణామం చోటు చేసుకుంది. బీఆర్ఎస్ అధినేత, తన తండ్రి కేసీఆర్ తీరుపై ఎమ్మెల్సీ కవిత ధిక్కార స్వరం వినిపించారు. కేసీఆర్‌ను ప్రశ్నిస్తూ గురువారం ఆమె రాసిన లేఖ హాట్ టాపిక్‌గా మారింది. కొన్ని అనుకూల విషయాలు చెబుతూనే వివిధ ప్రతికూల అంశాలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. పార్టీ నాయకులకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని పేర్కొన్న కవిత... వరంగల్ సభ ప్రసంగంలో మరింత ఘాటు ఉండాల్సిందని లేఖలో ప్రస్తావించారు. తెలంగాణ

- మిగతా 2 లో

శిల్పారామంలో సుందరీమణుల సందడి

విశాలాంధ్ర - హైదరాబాద్: ప్రపంచ అందాల పోటీల్లో పాల్గొంటున్న సుందరిమణులు గురువారం ఉదయం మాదాపూర్‌లోని శిల్పారామంలో సందడి చేశారు. తొలుత కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ... అందాల భామలకు ప్రధాన ద్వారం వద్ద బంజారా నృత్యాలు, మొక్కలతో స్వాగతం పలికారు. అనంతరం మహిళలతో అందగత్తెలు బతుకమ్మ ఆడారు. స్టాల్స్‌ను తిలకించి వస్తువుల గురించి అడిగి తెలుసుకున్నారు. మహిళా శక్తి బజారులో మంత్రి సీతక్కతో కలిసి అన్ని స్టాల్స్‌ను పరిశీలించారు. మహిళా శక్తి ... మహిళ గ్రూప్‌లు... వారు సాధిస్తున్న విజయాలను సెర్ప్ సీఈవో దివ్య ... సుందరీమణులకు వివరించారు. శిల్పారామంలో కుండలు తయారు చేయు విధానాన్ని నిర్వాహకులు వివరించారు. శిల్పారామం ఇంచార్జ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మరో ఎన్‌కౌంటర్

ఐదుగురు మావోయిస్టుల మృతి

విశాలాంధ్ర-చింతూరు: కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టులు ఒక్కొక్కరుగా కనుమరుగవుతున్నారు. కొందరు లొంగిపోతున్నారు. వేలాది మంది భద్రతా బలగాలు కర్రెగుట్టలను చుట్టుముట్టి మావోయిస్టులను హతమారుస్తున్నారు. ప్రధాన నాయకులను మట్టుబెడుతున్నారు.

తాజాగా చత్తీస్‌గఢ్ అడవుల్లో మరోసారి పెద్దఎత్తున ఎదురుకాల్పులు జరిగాయి. బీజాపూర్ జిల్లా పిడియా అటవీ ప్రాంతంలో గురువారం ఉదయం భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మరణించారు. ఆ ప్రాంతాన్ని పూర్తిగా తమ అధీనంలోకి తీసుకున్న భద్రతా దళాలు... గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. కాగా, బుధవారం జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రధాన కార్యదర్శి, పొలిట్ బ్యూరో సభ్యుడు, కేంద్ర మిలిటరీ కమిషన్ సభ్యుడు నంబాల కేశవరావు సహా 27 మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన నారాయణ్‌పూర్-దంతేవాడ-బీజాపూర్ జిల్లాల సరిహద్దుల్లో చోటుచేసుకుంది.

సీఎం రేవంత్‌కు మానసిక వ్యాధి

అందాల భామలకు టూర్ గైడ్లుగా మంత్రులు: కేటీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి మానసిక వ్యాధితో బాధపడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆయన 'మల్టిపుల్ పర్సనాలిటీ డిజార్డర్' అనే మానసిక రుగ్మతతో ఉన్నాడని వ్యాఖ్యానించారు. అందుకే ఒకే అంశంపై రోజుకోలా మాట్లాడుతుంటారని చెప్పారు. మీడియాతో

- మిగతా 2 లో

22 నిమిషాల్లో మట్టుబెట్టాం

- ఉగ్రవాదులను వదిలిపెట్టం: మోదీ
- 103 అమృత్‌భారత్ స్టేషన్లు ప్రారంభం

జైపూర్: ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదులను తుదముట్టించినట్లు ప్రధాని నరేంద్రమోదీ తెలిపారు. తమ ప్రభుత్వం త్రివిధ దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. మన మహిళల సిందూరాన్ని చెరిపేసిన వాళ్లను మట్టిలో కలిపేసినట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాల్లో అత్యాధునికంగా తీర్చిదిద్దిన 103 అమృత్ భారత్ రైల్వేస్టేషన్లను రాజస్థాన్‌లోని బికనీర్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్న ప్రధాని మోదీ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'ఆపరేషన్ సిందూర్ పట్ల దేశ ప్రజలంతా గర్వపడుతున్నారు. త్రివిధ దళాలు చక్రవ్యూహాలు పన్ని శత్రువులను ఉక్కిరిబిక్కిరి చేశాయి. మన మహిళల సిందూరం చెరిపేసిన వాళ్లను మట్టిలో కలిపేశాం. పహల్గాం ఘటనకు జవాబుగా 22 నిమిషాల్లోనే ఉగ్రవాదులను మట్టుబెట్టాం. మన సాయుధ దళాలు పాక్‌ను మోకాళ్ల మీద

- మిగతా 2 లో

వక్ఫ్ కేసులో వాదనలు పూర్తి

సుప్రీం తీర్పు రిజర్వు



న్యూదిల్లీ: వక్ఫ్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు రిజర్వు చేసింది. వక్ఫ్ సవరణ చట్టం-2025 చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు... "కోర్టుల ద్వారా వక్ఫ్, వినియోగదారుని ద్వారా వక్ఫ్ లేదా డీడ్ ద్వారా వక్ఫ్"గా ప్రకటించిన ఆస్తులను డీనోటిఫై చేసే అధికారం సహా మూడు అంశాలపై మధ్యంతర ఉత్తర్వులను తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది. సంబంధిత పిటిషన్లపై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్ ధర్మాసనం... కేంద్రప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, పిటిషనర్ల తరపున న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వి, రాజీవ్ ధావన్ వాదనలను మూడురోజుల పాటు విన్నది. అనంతరం తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు గురువారం వెల్లడించింది. అయితే వాదనల సమయంలో కేంద్రప్రభుత్వం

- మిగతా 2 లో

విశాలాంధ్ర శుక్రవారం 23, మే 2025

శక్తిమంతమైన ఖండాతర అణు క్షిపణి

మినిట్‌మ్యాన్-3 పరీక్ష విజయవంతం

కాలిఫోర్నియా: అత్యంత శక్తిమంతమైన ఖండాంతర అణు క్షిపణి 'మినిట్ మ్యాన్-3' పరీక్ష విజయవంతం అయినట్లు అమెరికా ప్రకటించింది. కాలిఫోర్నియాలోని వాన్డెన్‌బెర్గ్ అంతరిక్ష కేంద్రం నుంచి ఈ పరీక్ష జరిగింది. మినిట్ మ్యాన్-3 క్షిపణి గంటకు 15,000 మైళ్ల వేగంతో 4,200 కిలోమీటర్లు ప్రయాణించింది. మార్షల్ ఐల్యాండ్స్‌లోని అమెరికా స్పేస్ అండ్ మిసైల్ డిఫెన్స్ కమాండ్‌కు చెందిన బాలిస్టిక్ డిఫెన్స్ టెస్ట్ ప్రదేశానికి విజయవంతంగా చేరుకుంది. ఈ పరీక్ష అమెరికా సన్నద్ధతకు, శక్తికి చిహ్నమని గ్లోబల్ స్ట్రైక్ కమాండ్ జనరల్ థామస్ బుస్సెరీ వెల్లడించారు. తాజా అంతర్జాతీయ పరిణామాలతో ఈ పరీక్షకు ఎలాంటి సంబంధం లేదని ఒక ప్రకటనలో స్పష్టంచేశారు. సాధారణ కార్యాచరణలో భాగంగానే పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. మినిట్ మ్యాన్-3లో అత్యంత శక్తిమంతమైన మార్క్-21 రీఎంట్రీ వెహికల్. ఇందులో న్యూక్లియర్ పేలోడ్ ఉంది. గతంలో దీని శక్తి సామర్థ్యాలను అమెరికా పరీక్షించింది. మినిట్‌మ్యాన్ క్షిపణి 1970ల నాటిది. దీనిని సెంటినెల్ సిస్టమ్‌తో భర్తీ చేయాలని అమెరికా భావిస్తోంది. మినిట్ మ్యాన్-3 అత్యంత నమ్మకమైన క్షిపణి అని వాయుసేన భావిస్తోంది. గోల్డెన్ డోమ్ నిర్మిస్తున్నట్లు ప్రకటించిన వేళ ఈ పరిణామం చర్చనీయాంశంగా మారింది.

అంతర్జాతీయ సైబర్ నేరగాళ్ల ముఠా అరెస్టు

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: జిల్లాలోని యలమంచిలి నియోజకవర్గ పరిధిలో అచ్యుతాపురం కేంద్రంగా అమెరికా పౌరులే లక్ష్యంగా అమెజాన్ కస్టమర్ సపోర్ట్ ద్వారా సైబర్ నేరాలకు పాల్పడుతున్న అంతర్జాతీయ సైబర్ నేరగాళ్ల ముఠాను అరెస్టు చేసినట్లు అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఆయన వెల్లడించారు. గ్రామ రెవెన్యూ అధికారి నివేదిక ఆధారంగా, నిఘా సమాచారం ఆధారంగా దర్యాప్తు చేయగా... ఈ ముఠా నూతన సాంకేతికతను ఉపయోగించి మానసిక వంచనకు పాల్పడుతూ భారీగా నగదు దోచుకుంటోందని తెలిపారు.అచ్యుతాపురంలోని మూడు ముఖ్య కేంద్రాల్లో ఒకేసారి ఆకస్మిక దాడులు చేసి 33 మందిని అరెస్టు చేశామని తెలిపారు. అనేక కంప్యూటర్లు, నెట్‌వర్క్ పరికరాలు, డిజిటల్ సదుపాయాలు, రూ.3 లక్షల నగదు కూడా స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఈ ముఠా వివో ఐపీ కాల్స్ ద్వారా అమెరికా పౌరులకు అమెజాన్ మోసాల విభాగం నుండి వచ్చినట్లుగా పరిచయం చేసుకొని అమెరికా బ్యాంకులు లేదా ఎఫ్‌టీసీ అధికారులుగా నటించి వ్యక్తిగత, ఆర్థిక సమాచారం పొందుతున్నారని తెలిపారు. అసోం, నాగాలాండ్, మేఘాలయ, గుజరాత్ రాష్ట్రాల నుండి ఉద్యోగులను నియమించి... మోసపు పద్ధతుల్లో శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. నెలకు రూ.కోట్లలో మోసాలకు పాల్పడినట్లు తెలిపారు. ఈ మోసాలకు ముఖ్య సూత్రధారులు పునీత్ గోస్వామి (మహారాష్ట్ర), అవిహాంత్ దాగా (రాజస్థాన్) ఇద్దరినీ అరెస్ట్ చేశామని ముఠాకు మద్దతిచ్చే ఉన్నతస్థాయి వ్యక్తులను గుర్తించేందుకు విచారణ కొనసాగుతోందని చెప్పారు. తమ తనిఖీల్లో అనుభవం తక్కువ ఉన్నవారు, శిక్షణలో ఉన్న కొత్త ఉద్యోగులూ ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ఈ ముఠా పనిచేస్తోందన్న ఆధారాలు లభ్యమయ్యాయని తెలిపారు. మీడియా సమావేశంలో అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్, పరవాడ డీఎస్పీ వీ విష్ణు స్వరూప్, అచ్యుతాపురం ఎస్‌హెచ్‌ఓ ఎన్.గణేష్, ఐటీ కోర్ ఎస్సై సురేష్ బాబు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పు రిజర్వు

(మొదటిపేజీ తరువాయి)

వక్ఫ్ చట్టాన్ని గట్టిగా సమర్థించింది. ఆ చట్టాన్ని నిలిపివేయలేమని కోర్టుకు తెలిపింది. వక్ఫ్ అనేది లౌకిక భావన అని, ఇస్లాంలో భాగం కాదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు వివరించారు. ప్రభుత్వ భూమిపై ఎవరికీ హక్కు ఉండదని అన్నారు. ప్రభుత్వానికి చెందిన ఆస్తిని వక్ఫ్‌గా ప్రకటిస్తే ప్రభుత్వం ఆ ఆస్తిని కాపాడుకోగలదని గతంలో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు చెబుతోందని గుర్తు చేశారు.కాగా చట్టపరమైన, రాజ్యాంగ సూత్రాల నుంచి పూర్తిగా నిష్క్రమించిన చట్టంగా వక్ఫ్ చట్టాన్ని పిటిషనర్ల తరపు న్యాయవాదులు అభివర్ణించారు. న్యాయరహిత ప్రక్రియ ద్వారా వక్ఫ్‌ను స్వాధీనం చేసుకునేందుకు ఇదొక మార్గమని అన్నారు. వక్ఫ్ ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికే సవరణ చట్టంలో వివిధ నిబంధనలను రూపొందించారని కోర్టుకు తెలిపారు. ప్రస్తుత దశలో మూడు కీలక అంశాలపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఆ మూడు అంశాలు ఏవంటే... 1) న్యాయస్థానాలు వక్ఫ్ ఆస్తులుగా ప్రకటించిన వాటిని డీనోటిఫై చేసే అధికారం, 2) కేంద్ర వక్ఫ్ కౌన్సిల్, రాష్ట్ర వక్ఫ్ మండళ్ల కూర్పు 3) ప్రభుత్వ భూమిని వక్ఫ్ ఆస్తిగా పేర్కొనడంపై తలెత్తిన వివాదంలో కలెక్టర్ విచారణ జరిపితే దానిని వక్ఫ్ ఆస్తిగా పరిగణించకపోవడం. కాగా ప్రతిపక్షాల తీవ్ర నిరసనల నడుమ పార్లమెంటు ఉభయ సభల ఆమోదం తర్వాత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సమ్మతితో వక్ఫ్ సవరణ చట్టం-2025 ఇటీవల అమల్లోకి వచ్చింది. వక్ఫ్ బిల్లుపై లోక్‌సభలో 14 గంటలకు పైగా చర్చ జరిగింది. అనంతరం సవరణల వారీగా ఓటింగ్ ప్రక్రియ నిర్వహించగా బిల్లుకు అనుకూలంగా 288 మంది, వ్యతిరేకంగా 232 మంది సభ్యులు ఓటేశారు. రాజ్యసభలో బిల్లుకు అనుకూలంగా 128 మంది, వ్యతిరేకంగా 95 మంది సభ్యులు ఓటేశారు.

ధిక్కార స్వరం...

(మొదటిపేజీ తరువాయి)

తల్లి విగ్రహం, గీతం గురించి మాట్లాడతారని అంతా అనుకున్నారని... కానీ అలా జరగలేదన్నారు. ఉర్దూలో ఎందుకు మాట్లాడలేదని... వక్ఫ్ సవరణ చట్టంపై కేసీఆర్ మాట్లాడతారని జనం భావించారని లేఖలో పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశాన్ని విస్మరించారని... ఎస్సీ వర్గీకరణ అంశాన్ని సభలో ప్రస్తావించలేదని కవిత వివరించారు. వరంగల్ సభ ఏర్పాట్ల బాధ్యతలను పాత ఇంచార్జిలకే అప్పగించారని... స్థానిక సంస్థల బీ ఫామ్‌లు మళ్లీ మా దగ్గరకే వస్తాయని పాత ఇంచార్జులు చెప్పుకుంటున్నారని కవిత లేఖలో ప్రస్తావించారు. ధూమ్ ధాం కళాకారులు... కార్యకర్తలను ఆకట్టుకోలేకపోయారని తెలిపారు. ఇక వరంగల్ సభలో 2001 నుంచి పార్టీలో ఉన్న వారికి మాట్లాడే అవకాశం ఇస్తే బాగుండేదని కవిత అభిప్రాయపడ్డారు. ఇక బీజేపీపై కేవలం రెండు నిమిషాలు మాత్రమే మాట్లాడటాన్ని కూడా కవిత కీలకంగా ప్రస్తావించారు. వారిని తక్కువగా టార్గెట్ చేయడం వల్ల భవిష్యత్తుల్లో ఆ పార్టీతో బీఆర్ఎస్ పొత్తు పెట్టుకుంటుందేమో అనే ఊహాగానాలు మొదలయ్యాయని అభిప్రాయపడ్డారు. బీజేపీ పెట్టిన కేసులు కారణంగా తాను కూడా బాగా ఇబ్బందిపడ్డానని చెప్పారు. సానుకూల అంశాలపై మాట్లాడుతూ... సభతో క్యాడర్ నైతికంగా బలపడిందని.. ఆపరేషన్ కగార్ పై మాట్లాడడం చాలా నచ్చిందని కవిత పేర్కొన్నారు. కాంగ్రెస్ ఫెయిల్ అని చెప్పిన తీరు సూపర్... పహెల్గాం అమరులకు నివాళి -మౌనం బాగుందని వివరించారు. రేవంత్ రెడ్డి పేరు తీసి తిట్టక పోవడం చాలా మందికి నచ్చిన అంశంగా మారిందన్నారు. సీఎం తిడుతున్నా మీరు హుందాగా ఉన్నారని... పోలీసులకు ఇచ్చిన హెచ్చరిక కూడా బాగుందని లేఖలో వివరించారు.

ఇద్దరు భారత దౌత్య సిబ్బందిపై వేటు

ఇస్లామాబాద్: గూఢచర్యానికి పాల్పడ్డారనే ఆరోపణలతో పాకిస్థాన్ రాయబారి కార్యాలయంలోని ఉద్యోగిని భారత్ బహిష్కరించింది. భారత్ ఈ నిర్ణయం తీసుకున్న కొన్ని గంటలకే పాకిస్థాన్ స్పందించింది. పాక్‌లోని భారతీయ రాయబార కార్యాలయం సిబ్బందిపై గురువారం బహిష్కరణ వేటు వేసింది. 24 గంటల్లో పాక్ విడిచి వెళ్లాలని భారత రాయబార కార్యాలయ సిబ్బందిని ఆదేశించింది. మే 13వ తేదీన గూఢచర్యానికి పాల్పడ్డారనే ఆరోపణలపై భారత్‌లోని పాక్ రాయబార కార్యాలయ అధికారిని దేశం విడిచి వెళ్లాలని కేంద్రం ఆదేశించిన సంగతి తెలిసిందే. తాజాగా బుధవారం మరో పాక్ అధికారిని దేశం విడిచి వెళ్లాలంటూ ఆదేశించడంతో... పాక్ ఈ తరహా చర్యకు దిగింది.

రుణ ప్రణాళిక లక్ష్యాలు చేరుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

సంవత్సరాల్లో లక్ష కోట్లకు పైగా వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. న్యూ ఎనర్జీ పాలసీ తీసుకువచ్చి 2030 నాటికి 20వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తూ ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. స్కిల్ వర్సిటీ ఏర్పాటుతో పాటు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని, పరిశ్రమల్లో పనిచేయడానికి ఇందులో శిక్షణ ఇప్పిస్తున్నట్లు ప్రకటించారు. మూసీ పునరుజ్జీవం కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రచించినట్టు చెప్పారు. ఔటర్... రీజినల్ రింగ్ రోడ్‌ల మధ్య పారిశ్రామిక అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు చెప్పారు.

తాగునీటికి సాగర్ జలాలు

(మొదటిపేజీ తరువాయి)

నింపనున్నామని పేర్కొన్నారు. కేవలం తాగు నీటి అవసరాలకే వినియోగించుకునేలా ఇరిగేషన్, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలు సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. మూడు క్రాప్ హాలిడేల అనంతరం నాగార్జునసాగర్ ఆయకట్టుకు సాగునీరు అందించి పుష్కలంగా పంట పండించామని, ఇప్పుడు తాగునీటి అవసరాలు తీర్చేలా ప్రణాళికాబద్ధంగా నీరందిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. శ్రీశైలంలో 800 అడుగులు, సాగర్‌లో 505 అడుగుల వరకు నీటిని వినియోగించుకోవచ్చని కేఆర్ఎంబీ పేర్కొంది.

గాజాలోని ప్రతి బిడ్డా మాకు శత్రువే

ఇజ్రాయిల్ నేత మోషే ఫైగ్లిన్ అక్కసు

టెల్అవీవ్: గాజా స్ట్రిప్‌లో భీకర దాడులు చేస్తూ పిల్లలు, వృద్ధులు సహా పెద్ద సంఖ్యలో పలస్తీనియన్లను ఇజ్రాయిల్ హతమారుస్తూంది. హమాస్ అంతమే లక్ష్యమంటూ అమాయకులను చంపేస్తోంది. ఆహారం, నీళ్లు అందకుండా చేసి ఆకలి చావులకూ దారితీస్తోంది. ఇంతటి దయనీయ పరిస్థితులపై యావత్ ప్రపంచం ఆవేదన వ్యక్తంచేస్తూ, దురాక్రమణను తక్షణమే ఆపాలని పిలుపునిస్తుంటే... ఇజ్రాయిల్ మాత్రం అమెరికా, నాటో అండతో దూకుడు ప్రదర్శిస్తోంది. ఇటువంటి సున్నిత పరిస్థితుల్లో గాజాలోని ప్రతి బిడ్డా తమకు శత్రువని ఇజ్రాయిల్ నేత మోషే ఫైగ్లిన్ తన ద్వేషాన్ని వ్యక్తంచేశారు. 'మాకు శత్రువు హమాస్. దాని సాయుధ శాఖలే కాదు గాజాలోని ప్రతి బిడ్డా మాకు శత్రువే' అని ఆయన వ్యాఖ్యానించారు. చిన్నారులను చంపడం అలవాటుగా మారిందా అంటూ ఐడీఎఫ్ విశ్రాంత అధికారి యూయిర్ గోలన్‌పై ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో మోషే ఫైగ్లిన్ తాజా వ్యాఖ్యలు వివాదాస్పంగా మారాయి. గాజాలో ఒక్క బిడ్డ కూడా మిగలదని, తాము ఆ భూభాగాన్ని ఆక్రమించుంటామని, అక్కడ స్థిరపడతామని ఫైగ్లిన్ దీమాగా చెప్పుకున్నారు. అది జరిగితే... అంతకు మించి విజయం మరొకటి ఉండదన్నారు. కాగా, 2023 అక్టోబరు నుంచి ఇజ్రాయిల్ దాడుల్లో 53 వేల మంది పలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. మార్చి 2 నుంచి గాజాకు మానవతా సహాయాన్ని ఇజ్రాయిల్ నిలిపివేసింది. 'గిడియన్ చారియట్స్' పేరుతో ఇజ్రాయిల్ గాజాలో దాడులు చేపట్టింది. ఆ ప్రాంతం నియంత్రణలోకి తీసుకునేంత వరకు వెనక్కి తగ్గేదే లేదని నెతన్యాహు గతంలో ప్రకటించడం తెలిసిందే.

మారిషస్‌కు చాగోస్ దీవులు... అడ్డుకున్న బ్రిటన్ కోర్టు

లండన్: హిందూ మహాసముద్రంలో కీలకమైన చాగోస్ ద్వీప సముదాయాన్ని మారిషస్‌కు అప్పగించకుండా బ్రిటన్ కోర్టు అడ్డుకొంది. ఈ ద్వీపాల అప్పగింత ఒప్పందంపై బ్రిటన్ ప్రధాని స్టార్మర్, మారిషస్ ప్రభుత్వం మధ్య సంతకాలు జరగాల్సిన వేళ ఈ పరిణామం చోటుచేసుకుంది. చాగోస్‌కు చెందిన పాంపే అనే మహిళ చివరి నిమిషంలో వేసిన పిటిషన్‌ను హైకోర్టు జడ్జి సర్ జులియన్ గూసే విచారించారు. ఐదు గంటలపాటు వాదనలు విన్న ఆయన ఈ ప్రక్రియ నిలుపుదలకు ఆదేశాలిచ్చారు. రెండు దేశాల మధ్య ఒప్పందాన్ని కోర్టు నిలిపివేయడం బ్రిటన్ న్యాయ చరిత్రలో ఇటీవల జరగడం ఇదే మొదటిసారి. అంతర్జాతీయ న్యాయస్థానం తీర్పు ప్రకారం ఆ దీవులు మారిషస్‌కు చెందుతాయి కాబట్టే అప్పగిస్తున్నట్లు బ్రిటన్ ప్రభుత్వం వాదించింది. ఈ దీవుల్లోని డియేగో గార్సియాను అమెరికాకు 99 ఏళ్ల లీజుకు ఇచ్చిన పత్రాలు ఇంకా ప్రచురించలేదు. హిందూ మహాసముద్రంలో 60 దీవుల సముదాయం చాగోస్. ఒకప్పుడు బ్రిటిష్ సామ్రాజ్యంలో ఉండేవి. ఈ ద్వీప సమూహాన్ని మారిషస్‌కు తిరిగి అప్పగించి, ఆ దీవుల్లో అతిపెద్దదైన డియేగో గార్సియాను లీజుకు తీసుకోవడానికి బ్రిటన్ ఒప్పందం కుదుర్చుకోనుంది. అక్కడ బ్రిటిష్- అమెరికన్ సంయుక్త సైనిక, వైమానిక స్థావరం ఉంది. దీంతో ఒప్పందానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ఆమోదించారు. కాగా, పిటిషనర్ పాంపే... చాగోస్ దీవుల్లోని డియేగో గార్సియాలో జన్మించారు. ఆమెకు ఆరు నెలలప్పుడు సీషెల్స్‌కు తరలిపోయిన క్రమంలో పాంపే అక్కడే పెరిగారు. ప్రస్తుతం లండన్‌లో ఉంటున్నారు. పాంపే లాంటి వేలాది మంది ఇలా జీవిస్తున్నారు. దీవుల అప్పగింత జరిగితే ఇక్కడ పుట్టి వేరే ప్రదేశాల్లో జీవిస్తున్న వారు కొన్ని ప్రయోజనాలను కోల్పోవాల్సి వస్తుంది కాబట్టి కోర్టు తాజా ఆదేశాలకు ప్రాధాన్యత ఏర్పడింది.

రైతుకు మద్దతు ధర దక్కాల్సిందే

పంటలు, గిట్టుబాటు ధరపై మంత్రివర్గ ఉపసంఘంతో చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రైతు పండించిన పంటలకు మద్దతు ధర దక్కేలా చర్యలు తీసుకోవాలని, మార్కెట్ ధర తగ్గితే మనమే కొనుగోలు చేసి ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. పొగాకు, కోకో, మామిడి, ధాన్యం రైతుల సమస్యలపై సీఎం క్యాంపు కార్యాల యంలో గురువారం అధికారులు, మంత్రులతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో పంటల సాగు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ల డిమాండ్‌కు అనుగుణంగా జరగాలని, ఇందుకు సంబంధించి పంటల వారీ సాగు ప్రణాళికపై వ్యవసాయ శాఖ ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సూచించారు. ఏ పంటలు ఎంతమేర విస్తీర్ణంలో సాగు చేయాలో రైతులకు ముందే చెప్పడం వల్ల డిమాండ్-సప్లయ్ మధ్య సమతూకం ఉంటుందన్నారు. కేవలం డిమాండ్ ఉన్న పంటలు మాత్రమే సాగు చేస్తే రైతులు నష్టపోకుండా ఉంటారన్నారు. పంటల ప్రణాళిక శాస్త్రీయంగా జరగాలని, జాతీయ, అంతర్జాతీయ పరిణామాలు, మార్కెట్లు, దిగుబడులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆర్టీజీఎస్, వ్యవసాయశాఖ అధికారులకు మార్గనిర్దేశం చేశారు. వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న స్వల్పకాలిక, దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం మంత్రివర్గ ఉపసంఘం దృష్టిపెట్టాలన్నారు. కమిటీలోకి కొత్తగా మంత్రులు గొట్టిపాటి రవికుమార్, రామానాయుడును సభ్యులుగా తీసుకున్నారు. రైతుల దగ్గర ఉన్న కోకో పంట నిల్వలను కేజీ రూ.500కు కంపెనీల ద్వారా కొనుగోలు చేసేలా చూడాలని, సుమారు 20 వేల మిలియన్ కేజీల మేర రాష్ట్రంలో రైతుల దగ్గరున్న హెచ్డీ బర్లీ పొగాకు నిల్వలను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. డిమాండ్ లేనందున రైతులు నష్టపోకుండా ఉండడానికి ఈ ఏడాది హెచ్డీ బర్లీ పొగాకు రకానికి క్రాప్ హాలిడే ప్రకటిస్తున్నట్టు అధికారులు చెప్పారు. రైతుల దగ్గర హెచ్డీ బర్లీ రకం పొగాకు నిల్వలు ఎంత ఉన్నాయనే దానిపై యాప్ ద్వారా కచ్చితమైన వివరాలు సేకరించాలని చంద్రబాబు చెప్పారు. టొబాకో బోర్డులో ఇందుకు సంబంధించి సెల్ ఏర్పాటు చేసి రోజువారీ కొనుగోళ్ల వివరాలు నమోదు చేస్తున్నామని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు రాగా... హెచ్డీ బర్లీ, వైట్ బర్లీ రకాలను టొబాకో బోర్డులో చేర్చాల్సిందిగా ఇప్పటికే కేంద్ర వాణిజ్యశాఖ మంత్రికి లేఖ రాసినట్లు సీఎం తెలిపారు. ఈనెల 23, 24 తేదీల్లో తన ఢిల్లీ పర్యటనలో కేంద్ర మంత్రులతో రైతాంగ సమస్యలపై చర్చిస్తానని సీఎం చెప్పారు.

ఈడీకి సుప్రీం చీవాట్లు

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తం చేసింది. టాస్మాక్ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. టాస్మాక్ మద్యం దుకాణాలను ఇచ్చే కార్పొరేషన్ అని తెలిపారు. ఈ దుకాణాలను ఇచ్చిన వారిలో కొందరు నగదు తీసుకుంటున్నట్లు తేలిందని చెప్పారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం 2014-2021 మధ్య 41 ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేసిందన్నారు. 2025లో ఈడీ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంపై దాడులు చేసిందని, అన్ని ఫోన్‌లను తీసుకొని క్లోన్ చేశారని సిబల్ పేర్కొన్నారు.

ఈ క్రమంలో స్పదించిన సీజేఐ, "ఈడీ వ్యక్తులపై కేసు నమోదు చేయొచ్చు. కానీ ఒక కార్పొరేషన్‌పై క్రిమినల్ కేసు ఎందుకు" అని అడిగారు. అనంతరం ఈడీ అన్ని పరిమితులను దాటుతోందన్నారు. రాష్ట్రం ఇప్పటికే అధికారులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసిందని, వారిపై చర్యలు తీసుకుంటున్నారని సీజేఐ అన్నారు. ఈడీ అనవసరంగా ఇలా ఎందుకు చేయాలి, ముందస్తు నేరం ఎక్కడ ఉంది ఇందులో అని సీజేఐ ప్రశ్నించారు. ఈ మేరకు టాస్మాక్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఈడీకి నోటీసులు జారీ చేయాలని ధర్మాసనం నిర్ణయించింది. ఈ విషయంలో ఈడీ సమాధానం దాఖలు చేయాలని చెప్పింది.

ఈ పిటిషన్‌పై విచారణ సెలవుల తర్వాత చేస్తామని ధర్మాసనం పేర్కొంది. ఈడీ తరపున వాదించిన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు, తాము(ఈడీ) ఏ తప్పు చేయలేదని ధర్మాసనానికి చెప్పారు. రూ.1000 కోట్ల కుంభకోణం జరిగిందన్నారు. లెక్కలో లేని నగదు సృష్టించారని చెప్పారు. ఈ సమాచారాన్ని అఫిడవిట్‌లో సమర్పించడానికి కోర్టును రాజు అనుమతి రోరారు. దానికి కోర్టు అనుమతిచ్చింది. కాగా సమాఖ్య పాలన భావనను ఈడీ ఉల్లంఘిస్తోందన్న ధర్మాసనం... టాస్మాక్ పై జరుగుతున్న మనీలాండరింగ్ దర్యాప్తును వెంటనే ఆపేయాలని ఆదేశించింది.

బీజేపీ కుట్రలకు చెంపపెట్టు: డీఎంకే

సుప్రీం తీర్పును డీఎంకే ప్రభుత్వం స్వాగతించింది. తమిళనాడు ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేందుకు బీజేపీ చేస్తున్న కుట్రలకు ఇది చెంపపెట్టు లాంటిదని దుయ్యబట్టింది. ఆ పార్టీ కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని, బీజేపీయేతర ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు ప్రయత్నిస్తోందని డీఎంకే కార్యదర్శి ఆర్ఎస్ భారతి విమర్శించారు.

సీఎం రేవంత్‌కు మానసిక వ్యాధి

(మొదటిపేజీ తరువాయి)

గురువారం ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ రేవంత్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఓవైపు రాష్ట్రంలో 580మంది రైతులు ఆత్మహ్యత చేసుకుంటే సీఎం అందాల పోటీల్లో ఉండడం ఒప్పా అని నిలదీశారు. ధాన్యం వర్షంలో కొట్టుకుపోతుంటే అందాల పోటీలకు ప్రాధాన్యత ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం దగ్గర ఒక రూపాయి కూడా లేదని చెప్పి అందాలపోటీలకు మాత్రం రూ.200కోట్లు ఖర్చు చేయడం ఏమిటన్నారు. మంత్రులంతా అందాలభామలకు టూర్ గైడ్లుగా మారిపోయారని ఎద్దేవా చేశారు. మంత్రులు సొంగకార్చుకుంటూ అందాల పోటీల్లో పాల్గొంటున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారని గుర్తు చేశారు. ప్రజలను పక్కదారి పట్టించేందుకు కాళేశ్వరం మాటున నోటీసులు ఇచ్చారని విమర్శించారు. అందాల భామలకు చూపుతున్నది నిజాం కట్టిన చార్మినార్ ... కేసీఆర్ కట్టిన ప్రాజెక్టులు తప్ప కాంగ్రెస్ పార్టీ కట్టిన ఒక్కదానినైనా చూపించాదా అని నిలదీశారు.

నోటీసులతో నీచ రాజకీయాలు...

నోటీసుల పేరుతో సీఎం నీచ రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పై చేసిన దుష్ప్రచారం తేలిపోయిందని, నిన్న సుప్రీంకోర్టు సాక్షిగా నిజాలు బయటకు వచ్చాయన్నారు. కాంగ్రెస్ , బీజేపీ కలసి కాళేశ్వరంపై చేస్తున్న దుష్ప్రచారం కూడా త్వరలో తేలిపోతుందని అభిప్రాయపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై నికృష్టమైన, నీచమైన రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజాపాలన పర్సంటేజీ పాలనగా మారిందని ఆరోపించారు. కాంగ్రెస్ కమీషన్లు బయటపడుతున్నాయనే ఇప్పుడు నోటీసుల పేరిట తమాషాలు చేస్తున్నారని అన్నారు. జస్టిస్ గోష్ తన విచారణ పూర్తయిందన్నారని అలాంటపుడు మళ్లీ సమయాన్ని ఎందుకు పొడిగించారనే విషయాన్ని చెప్పాలన్నారు. నోటీసులు అందిన తర్వాత ఏం చేయాలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అన్ని బ్యారేజీలను కూలగొట్టి మళ్లీ టెండర్ల పిలిచి, 20 నుంచి 30శాతం కమీషన్లు తీసుకోవాలన్నదే ఈ నోటీసుల అసలు అజెండా అని వ్యాఖ్యానించారు.

త్వరలో లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకం

(మొదటిపేజీ తరువాయి)

సంప్రదించాలని సూచించారు. ఆయా మండలాల్లో భూవిస్తీర్ణం , భూ లావాదేవీలను బట్టి ఆరు నుంచి ఎనిమిది మంది సర్వేయర్లను నియమిస్తామని తెలిపారు. రెవెన్యూ డివిజన్‌లో సర్వేయర్ల ద్వారా శాశ్వత భూ పరిష్కారం చూపుతామని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నిజాం కాలం నుంచి సర్వే జరగని, ఇప్పటివరకు సర్వే రికార్డులు లేని 413 నక్షా గ్రామాలలో రీసర్వే చేపడుతున్నామని, ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సలార్ నగర్, జగిత్యాల్ జిల్లా భీర్పూర్ మండలం కొమ్మనాపల్లి (కొత్తది) గ్రామం, ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమడ, ములుగు జిల్లా వెంకటాపురం మండలం నూగురు, సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం షాహిద్ నగర్ గ్రామాలను ఎంపిక చేసినట్లు వివరించారు. ఆయా గ్రామాల్లో ముందుగా గ్రామసభలు నిర్వహించి సర్వేకు సంబంధించిన అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించినట్టు చెప్పారు. నెలరోజుల్లో సర్వే ప్రక్రియ పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో అధికారులు పనిచేయాలని మంత్రి సూచించారు.

సత్యపాల్ మాలిక్‌పై సీబీఐ చార్జిషీట్

(మొదటిపేజీ తరువాయి)

వాటిని స్వీకరించలేనని ఆయన వెల్లడించారు. కాగా, గతేడాది ఫిబ్రవరిలో సత్యపాల్ మాలిక్ సహా ఇతర నిందితుల ఆస్తులను సీబీఐ సోదా చేసింది. 2022లో ఎఫ్ఐఆర్ నమోదు అనంతర ప్రకటనలో రూ.2,200 కోట్ల అవినీతి జరిగినట్లు ఆరోపించింది. 'కిరూ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ (హెచ్ఈపీ) ప్రాజెక్టును 2019లో ఓ ప్రైవేటు కంపెనీకి అప్పగించారు. ప్రాజెక్టు పనుల్లో అవినీతి జరిగింది' అని వెల్లడించింది. 2018, ఆగస్టు 23 నుంచి 2019, అక్టోబరు 30 వరకు జమ్మూకశ్మీర్ గవర్నర్‌గా సత్యపాల్ మాలిక్ ఉన్నారు. ఈ ప్రాజెక్టు సహా రెండు ఫైళ్లు ఆమోదించేందుకు ఆయనకు రూ.300 కోట్లు ముట్టినట్లు సీబీఐ ఆరోపించింది. ఈ ఆరోపణలను సత్యపాల్ అప్పట్లో తోసిపుచ్చారు. తన ఆస్తులను సీబీఐ సోదా చేసిన సమయంలో సామాజిక మాధ్యమాల్లో ఆగ్రహం వ్యక్తంచేశారు. 'నాలుగు, ఐదు జతల కుర్తా,పైజామాలు మినహా వారికి ఏమీ దొరకవు. ప్రభుత్వ సంస్థల ద్వారా నన్ను భయపెట్టేందుకు నియంత ప్రయత్నిస్తున్నారు. నేను రైతు బిడ్డను. ఎవరికీ భయపడను, తలవంచను' అని సత్యపాల్ మాలిక్ పోస్టు పెట్టారు. ఇదిలావుంటే, చీనాబ్ వ్యాలీ పవర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (సీవీపీపీఎల్)కు నాటి చైర్మన్ నవీన్ కుమార్ చౌదరి, అధికారులు ఎంఎస్ బాబు, ఎంకే మిత్తల్, అరుణ్ కుమార్ మిశ్రా సహా పటేల్ ఇంజినీరింగ్ లిమిటెడ్ అనే నిర్మాణ సంస్థను నిందితులుగా సీబీఐ ఎఫ్ఐఆర్ పేర్కొంది.

22 నిమిషాల్లో మట్టుబెట్టాం

(మొదటిపేజీ తరువాయి)

నిలబెట్టాయి. భారత్‌లో రక్తపుటేర్లు పారించినవాళ్లను ముక్కలు ముక్కలు చేశాం. ఆపరేషన్ సిందూర్ న్యాయానికి కొత్త రూపం. సమర్థ భారత రౌద్ర రూపం. ఉగ్రదాడి జరిగితే, మన సమాధానం ఇలాగే ఉంటుంది. ఉగ్రవాదులకు ఇకపై ఇలాంటి జవాబే దక్కుతుంది' అని ప్రధాని మోదీ తెలిపారు. పాకిస్థాన్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు మన ఎంపీలు విదేశాలకు వెళ్లారని... పాకిస్థాన్ నిజ స్వరూపాన్ని ప్రపంచానికి చాటుతారన్నారు. 'పాక్ ఎప్పుడూ మనతో నేరుగా యుద్ధం చేయలేదు. దొంగదెబ్బ తీయడమే పాకిస్థాన్‌కు తెలుసు. ఇక్కడ మోదీ ఉన్నారనే సంగతి పాకిస్థాన్ మరిచిపోయినట్టుంది. రాజస్థాన్‌లోని ఎయిర్‌బేస్‌ను ధ్వంసం చేయాలని పాక్ ప్రయత్నించింది. కానీ, రాజస్థాన్ ఎయిర్‌బేస్‌ను పాకిస్థాన్ క్షిపణులు తాకలేకపోయాయి. మన వాయుసేన మాత్రం పాక్‌లోని ఎయిర్‌బేస్‌లను ధ్వంసం చేసింది' అని మోదీ అన్నారు.

గత 12 ఏళ్లుగా దేశంలో ఆధునిక మౌలిక సదుపాయాలు కల్పించే మహాయజ్ఞం జరుగుతోందని, గతంలో కంటే ఆరు రెట్లు అధికంగా మౌలిక సదుపాయాలపై ఖర్చు చేస్తున్నామని ప్రధాని తెలిపారు. ' కశ్మీర్ నుంచి అరుణాచల్‌ప్రదేశ్ వరకు మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తున్నాం. గతంలో రైల్వేస్టేషన్లు ఎలా ఉండేవి, ఇప్పుడెలా ఉన్నాయో ఆలోచించండి. అమృత్ భారత్ స్టేషన్లను ఆయా ప్రాంతాల ప్రత్యేకతలతో నిర్మించాం. ఈ రైల్వే స్టేషన్లకు ప్రజలే యజమానులు. శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత కూడా ప్రజలదే' అని మోదీ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాల్లోని 86జిల్లాల్లో అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా ఆధునీకరించిన 103 రైల్వేస్టేషన్లను ప్రధాని రాజస్థాన్‌లోని బీకానేర్‌లో జెండా ఊపి వర్చువల్‌గా ప్రారంభించి జాతికి అంకితమిచ్చారు. వీటిలో తెలంగాణలోని బేగంపేట, కరీంనగర్, వరంగల్, ఏపీలో సూళ్లూరుపేట రైల్వేస్టేషన్లు ఉన్నాయి. యూపీ-19, గుజరాత్-18, మహారాష్ట్ర-15, రాజస్థాన్‌లో 8 అమృత్ భారత్ స్టేషన్లు ఉన్నాయి. ఆ తర్వాత ప్రధాని మోదీ, పాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం రాజస్థాన్‌లో 26వేల కోట్లతో చేపట్టనున్న వేర్వేరు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పూర్తి

మంత్రి దామోదర్ రాజనర్సింహ

విశాలాంధ్ర బ్యూరో - సంగారెడ్డి : ఈనెల 23న సీఎం పర్యటన ఏర్పాట్లు పూర్తి అయినట్లు మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షట్కార్, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, శాసనసభ్యులు సంజీవరెడ్డితో కలిసి ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. హెలిపాడ్‌ను, సీఎం చేతులమీదుగా ప్రారంభించే బసవేశ్వర విగ్రహం, నిమ్జ్ రోడ్, కేంద్రీయ విద్యాలయ భవనం, సభ స్థలంను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హెలిప్యాడ్ పనులు, ప్రజా వేదిక సభ వేదిక, విఐపి గ్యాలరీ, మీడియా గ్యాలరీ, వాహనాల పార్కింగ్ పనులు, రూట్ల వారీగా ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రణాళిక వివరాలు, గ్రీనరీ, స్టేజి ఏర్పాట్లు, స్టేజి అలంకరణ, పరిశుభ్రత, మిషన్ భగీరథ త్రాగునీరు, టాయిలెట్స్ అన్ని పనులు పూర్తి అయ్యాయన్నారు. సభకు హాజరయ్యే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట ఎస్పీ పంకజ్ పరితోష్, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, ఆర్డీవోలు, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్ : కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు తరలించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వీరబ్రహ్మచారి అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లాలోని కల్వల, తాళ్లపూసపల్లి, కేంద్రాలను స్వయంగా అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మండలంలోని కల్వల గ్రామం ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఏలాంటి ఇబ్బందికర పరిస్థితులు లేవని, రైతులు అప్రమత్తంగా ఉన్నారని, ఈ కేంద్రంలో కేవలం 500 మెట్రిక్ టన్నుల దాన్యం మాత్రమే కలదని, ఈరోజు, రేపటిలోగా పూర్తిగా అట్టి ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుంది అన్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక అధికారులను నియమించి రవాణా సంబంధిత విషయాలపై ఎప్పటికప్పుడు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు హమాలీలు రవాణా తదితర సదుపాయాలపై కలెక్టర్ నిరంతరం టెలి కాన్ఫరెన్సులు, సమీక్షలు సమావేశాలు నిర్వహిస్తూ ఉన్నారని తెలిపారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.వీరబ్రహ్మచారి, ఏఎంసి చైర్మన్ సంజీవరెడ్డి, సహకార శాఖ అధికారి వెంకటేశ్వర్లు, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్, డిఎం సివిల్ సప్లై కృష్ణవేణి, స్థానిక తహసీల్దార్, తదితరులు కలిసి రైతులతో మాట్లాడారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం నాలుగు రెట్లు అధికంగా ధాన్యం దిగుబడి అయినా ముందస్తు ప్రణాళికలతో జిల్లాలో ఇప్పటికే 90 శాతం దాన్యం కొనుగోళ్లు పూర్తి చేసినట్లు వారం రోజుల లోపు మిగతా లక్ష్యాలను పూర్తి చేయుటకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో నిమగ్నమై ఉన్నారన్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : భారీ వర్షం కారణంగా ఖానాపూర్ మార్కెట్‌యార్డ్‌లో తడిసిన ధాన్యాన్ని గురువారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వరి రైతులు నష్టపోకుండా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. వర్షంతో ధాన్యం తడవడంతో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని కోరారు. ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు నష్టపోకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ధాన్యం శుభ్రపరిచి, ఎండబెట్టే ఏర్పాట్లు చేయాలని, కొనుగోళ్లను వేగవంతం చేసి వెంటవెంటనే మిల్లులకు తరలించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎంఎల్ఏ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, వర్షాలతో ధాన్యం తడవడం బాధకరమని, కొనుగోళ్లను వేగవంతం చేయాలనీ అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నాకళ్యాణి, సివిల్ సప్లై డిఎం సుధాకర్, తహసీల్దార్ సుజాత, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

అమర జవాన్ల కోసం గ్రానైట్ మార్కర్స్ అసోసియేషన్ వితరణ

విశాలాంధ్ర - ఖమ్మం : ఖమ్మం గ్రానైట్ ట్రేడర్స్ అండ్ మార్కర్ అసోసియేషన్ సభ్యులు, గురువారం ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్ కలిసి ఇటీవల ఆపరేషన్ సింధూర్‌యుద్ధంలో అమరులైన జవాన్లకు తమవంతుగా కొంత విరాళాన్ని అందజేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో రూ. 30,000 చెక్కును కలెక్టర్‌కు అందజేశారు. మొన్న పాకిస్తాన్ భారత్ మధ్య సింధూర్ ఆపరేషన్ పేరుతో యుద్ధంలో వీరమరణం పొందిన సైనికుల సహాయార్థం సంఘం తరపున గౌరవ సలహాదారులు నరేందర్ సలహా మేరకు సభ్యులు దేశం మీద ఉన్న గౌరవంతో కొంతమంది వారి వ్యక్తిగత అమౌంట్ ఇవ్వడం జరిగింది. మరికొంత సంఘం తరపున నువ్వు నావత్ కిషన్, ఎస్‌కే జానీ, వెంపటి వెంకటేశ్వర్లు, నాగ మల్లేశ్వర రెడ్డి, ఉట్ల రఘు, గోవిందు భద్రం, వడ్లకొండ శ్రీనివాస్, సంఘం సభ్యులు కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - పెనుబల్లి : హనుమాన్ జయంతి ఉత్సవాలను పెనుబల్లి మండలంలో అంగరంగ వైభోగంగా భక్తులకు కన్నుల పండుగగా నిర్వహించారు. పెనుబల్లి గ్రామంలోని శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో వీఎం బంజర్ గ్రామంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని తెల్లవారుజాము నుండి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటల నుండి సుప్రభాత సేవ మంగళ తోరణం, విశ్వక్సేన పూజ, వాసుదేవ పుణ్యాహవచనం, హనుమాన్ రక్ష కంకణం, 108 బిందెలతో జలాభిషేకం, హనుమాన్ చాలీసా సహస్రనామార్చణలు, మహా నివేదనలతో మంత్రపుష్ప పూజ తీర్థప్రసాద వితరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం భక్తులకు మహా అన్నదాన ప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేలాదిగా భక్తులు తరలివచ్చి అంజనీ పుత్రుడు, శ్రీరామ బంటు, పవన పుత్రుడు, బజరంగబలి, కేసరి నందనుడు, శ్రీరామదూత, వీర హనుమాన్, అభయ ఆంజనేయ స్వామి దివ్య మంగళ రూపాన్ని కనులారా దర్శించి అర్చనలతో తీర్థప్రసాదాలను స్వీకరించారు.

భూసమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకే భూభారతి

రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర - కారేపల్లి : రైతుల భూ సమస్యలన్నిటిని పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకే సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం భూభారతి చట్టాన్ని అమలు చేస్తుందని రాష్ట్ర రెవిన్యూ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రమైన సింగరేణిలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఇమ్మడి తిరుపతిరావు ఇంట్లో వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్‌తో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రెవిన్యూ మంత్రి పొంగులేటి మాట్లాడుతూ భూభారతి చట్టం రాష్ట్రంలో జూన్ రెండవ తేదీ నుండి పూర్తి స్థాయిలో అమలు చేయనున్నట్లు తెలిపారు.ప్రతి రెవిన్యూ గ్రామంలో మండల రెవిన్యూ అధికారులు సదస్సులు నిర్వహించి భూ సమస్యలు పరిష్కరించి భూభారతి చట్టం ద్వారా భూమికి సంబంధించిన హక్కులు కల్పించడం జరుగుతుందన్నారు. భూభారతి చట్టంతో రైతులకు మేలు జరుగుతుందన్నారు. టీవల కురిసిన వర్షాలకు కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం తడిసిపోయి ఉన్న దానిని రైతులు ఎలాంటి నష్టపోకుండా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బోనస్ పైకాన్ని రైతుల ఖాతాలో త్వరలోనే జమ చేయనున్నట్లు తెలిపారు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి రాబోయే నాలుగేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని మంత్రి తెలిపారు. ఈ సంవత్సరం ప్రతి నియోజకవర్గానికి 3500 మంజూరు చేయడం జరిగిందని పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకున్న గ్రామాలలో ఇప్పటికే ఆ ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాయి అన్నారు. నిర్మాణం పూర్తి చేసుకున్న వెయ్యి ఇళ్లు జూన్ మొదటి తేదీననే గృహప్రవేశాలు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నామమాత్రంగా ఉన్నప్పటికీ రైతుల భూ సమస్యలను సర్వే చేసేందుకు వెయ్యి మంది అనుభవజ్ఞులైన సర్వేయర్లను ప్రభుత్వం నియమిస్తుందన్నారు. ఇప్పటికే ఆరు వేల మంది సర్వేయర్లకు రెండు నెలల శిక్షణ కూడా శిక్షణ కూడా ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బొర్రా రాజశేఖర్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, బానోతు విజయ బాయి, బానోతు దేవుల నాయక్, మల్లెల నాగేశ్వరరావు, ఇమ్మడి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - నేరేడుచర్ల : నేరేడుచర్ల పట్టణంలో హనుమాన్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేరేడుచర్ల పట్టణం పాత నేరేడుచర్ల శ్రీ ఆంజనేయస్వామి ఆలయం, శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర ఆలయం శ్రీ కోదండ రామాలయంలో హనుమాన్ జయంతి వేడుకల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి ఘనంగా నిర్వహించారు. పాత నేరేడుచర్ల శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నేరేడుచర్ల పట్టణ పురవీధులలో బైక్ ర్యాలీ నిర్వహించారు. జైశ్రీరామ్, జై జై శ్రీరామ్, బజరంగ్ బలికి జై నినాదాలతో కాషాయ ధ్వజాలు చేత పట్టి వందలాది బైక్‌లతో హనుమాన్ ర్యాలీ నిర్వహించారు. పాత నేరేడుచర్ల శ్రీ ఆంజనేయస్వామి ఆలయం నుండి ప్రారంభమైన బైక్ ర్యాలీ శ్రీ కోదండ రామాలయం, రామాపురం రామాలయం, నరసయ్యగూడెం శ్రీ ఆంజనేయస్వామి ఆలయం, శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర ఆలయం, హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయం, శ్రీ విజయ దుర్గదేవి అమ్మవారి ఆలయం, పాత రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ ప్రధాన సెంటర్‌కి చేరుకున్నారు. కొనతం చిన్న వెంకటరెడ్డి, చల్లా శ్రీలత రెడ్డి, సరికొప్పుల నాగేశ్వరరావు, యారవ సురేష్, జింకల భాస్కర్, కొనతం నాగిరెడ్డి, కొనతం కృష్ణారెడ్డి, బచ్చలకూరి ప్రకాష్, సంకలమద్ది సత్యనారాయణరెడ్డి, బాల వెంకటేశ్వర్లు, ఆదిరెడ్డి తాటికొండ శ్రీనివాస్ రెడ్డి, చిన్నపల్లి శ్రీనివాస్, కొనతం లచ్చిరెడ్డి, యామిని వీరయ్య, నీలా శ్రీనివాస్, ఇంజమూరి రాములు, గజ్జల కోటేశ్వరరావు, జనార్దన్, మచ్చ శ్రీను, రవీందర్ రెడ్డి, దేవి రెడ్డి, నాగిరెడ్డి రాము, వాసు, గరినే సతీష్, నోముల క్రాంతి, భరత్ గౌడ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలను సందర్శించిన సంజీవరావు

విశాలాంధ్ర - ములుగుజిల్లా బ్యూరో : కెఎన్ బయోసైన్సెస్ కంపని ఆయిల్ పామ్ నర్సరీ జవహర్‌నగర్ లోని తనిఖీ చేయడం జరిగినదని, 2025-26 సంవత్సరానికి జిల్లాకు మూడు వేల ఎకరాల్లో అయిల్ పామ్ మొక్కలను సాగు చెయ్యాలని లక్ష్యం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఉద్యాన, పట్టు పరిశ్రమ ములుగుజిల్లా అధికారి డి.సంజీవ రావు తెలిపారు. కెఎన్ బయోసైన్సెస్ ఆయిల్ పామ్ నర్సరీ వారు అయిల్‌పామ్ మొక్కలను పెంచడం జరుగుతుందని, నాణ్యమైన మొక్కలను రైతులకు సకాలంలో అందించాలని, ఆయిల్ ఆయిల్ పామ్ నర్సరీ మేనెజర్ హేమంత కుమార్ రెడ్డిని ఆదేశించడం జరిగినదని ఉద్యాన, పట్టుపరిశ్రమ ములుగుజిల్లా అధికారి డి. సంజీవరావు తెలిపారు. గురువారం జవహర్‌నగర్‌లో స్ప్రింకలర్స్ యూనిట్ల తనిఖీ, గత 3-4 సంవత్సరాలుగా పెండింగులో ఉన్న స్ప్రింకలర్స్ ఉద్యానశాఖ రైతులకు సరఫరా చేయగా, రైతులకు వాటి నిర్వాహణ గురించి, రైతులు తను పొలాల్లో వాడుతున్నాట్లు తనిఖీలో తెలిందన్నారు. వెంకటాపూర్ గ్రామ శివారులో 1వ, 2వ, 4వ, సంవత్సరం నమస్సు గల అయిల్ పామ్ తోటలను సందర్శించడం జరిగినదని, అయిల్ పామ్తోటల మధ్య అన్ని రకాల కూరగాయలను, పప్పుదినుసులు పంటలను, పశుగ్రాసాలను అంతర పంటలుగా వేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పేదల ముంగిటకు మోకాలు మార్పిడి చికిత్స

విశాలాంధ్ర-ఖమ్మం : పేదల ముంగిటికి మోకాలు మార్పిడి చికిత్సను అందుబాటులోకి తీసుకు వచ్చామని అతి తక్కువ ఖర్చుతో మోకాలు మార్పిడి చికిత్సను అందిస్తున్నామని మమత వైద్య సంస్థల కార్యదర్శి పువ్వాడ జయశ్రీ తెలిపారు. ఇప్పటి వరకు ఆసుపత్రిలో 150 మందికి అత్యంత విజయవంతంగా మోకాలు మార్పిడి శస్త్ర చికిత్స నిర్వహించినట్లు ఆమె తెలిపారు. 150 మోకాలు మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తయిన సందర్భంగా గురు వారం ఆసుపత్రిలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి వైద్య బృందానికి జయశ్రీ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జయశ్రీ మాట్లాడుతూ మమత వైద్య సంస్థల ద్వారా పేదలకు నిరంతరం వైద్య సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ మోకాలు శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వీరగంధం ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటి వరకు నిర్వహించిన 150 ఆపరేషన్లు నూటికి నూరు శాతం విజయవంతమయ్యాయని ఏ ఒక్కరికి ఎటువంటి ఇబ్బందిలేదని ఆయన తెలిపారు. ఇతరత్రా సమస్యలు తలెత్తకుండా శస్త్ర చికిత్స నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మమత వైద్య, విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ నరేన్, డాక్టర్ సాయి శిరణి, మమత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనురాధ, మమత ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామస్వామి, ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ డాక్టర్ వేణుగోపాల్, సర్జన్ డాక్టర్ బాలకృష్ణ, ఆసుపత్రి ఏవో టివి బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్స్‌రే మెషిన్ ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : ఖానాపూర్ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో ఎక్స్రే మిషన్‌ను ప్రారంభించిన ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ తదుపరి మాట్లాడుతూ పాత ఎక్స్రే మిషన్ పాడవడంతో కొత్త డిజిటల్ ఎక్సరే మిషిన్ ప్రారంభించారు. వైద్య సేవలు అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ధ్యేయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపర్డెంట్ వంశీ తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు : కలెక్టర్

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత పదం కింద పంపిణీ చేస్తున్న పెన్షన్లలో ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోకూడదని, ఒకవేళ ఎవరైనా అక్రమాలకు పాల్పడినట్లు దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. గురువారం నల్గొండ జిల్లా, మిర్యాలగూడ కళాభారతిలో చేయూత పథకంపై నిర్వహించిన డివిజన్ స్థాయి సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ రకాల పెన్షన్లకు సంబంధించి ఎంపీడీవోలు, పంచాయతీ సెక్రటరీల లాగిన్లలో ఉన్న వివరాలను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని ఆదేశించారు. అనారోగ్యం కారణంగా మంచానికి పరిమితమైన వారు, వివిధ కారణాలతో బయోమెట్రిక్ పడని వారికి మాత్రమే పంచాయతీ కార్యదర్శులు వారి బయోమెట్రిక్ ద్వారా పెన్షన్లు చెల్లించాలని, శాశ్వతంగా వలస వెళ్లినవారు, ఇతరుల పెన్షన్లను పిఎస్‌ల బయోమెట్రిక్ ద్వారా పెన్షన్లను డ్రా చేసినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మూడు నెలలకు మించి శాశ్వతంగా వలస వెళ్లినవారు, అలాగే చనిపోయిన వారు, ఇతర కేసులకు సంబంధించిన పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆన్లైన్లో అప్డేట్ చేయాలన్నారు. ప్రత్యేకించి వృద్ధాప్య పెన్షన్లలో చనిపోయిన వారి పేర్లను ఒకటికి రెండుసార్లు పరిశీలించి ఆన్లైన్‌లో జాబితా నుండి తొలగించాలని, ఒకవేళ ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినట్లు ఉంటే స్పష్టంగా పేర్కొనాలని ఆదేశించారు. జిల్లాలో సుమారు 29 వేల పెన్షన్లు శాశ్వతంగా వలస వెళ్లిన వారి జాబితాలో ఉన్నాయని, వాటన్నింటిని గత నెల నుండి క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి చనిపోయిన, వలస వెళ్లిన పేర్లను తొలగించడం, చనిపోయిన వారి స్థానంలో వారి భార్య లేదా భర్తకు పెన్షన్ ఇవ్వడం వంటివి చేసిన తర్వాత ఈ సంఖ్య రెండువేలకు వచ్చిందని కలెక్టర్ తెలిపారు.

డిఎస్పీ రెహమాన్‌కు ప్రశంసాపత్రం...

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : పోక్సో కేసులలో త్వరితగతిన దర్యాప్తును పూర్తి చేసి కేసుల పరిష్కారానికి కృషి చేసిన కొత్తగూడెం డిఎస్పి రెహమాన్‌కు రాష్ట్ర డిజిపి జితేందర్ చేతుల మీదుగా ప్రశంస పత్రం అందించారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు గురువారం తన కార్యాలయంలొ రెహమాన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. పోలీస్ శాఖలోని వివిధ విభాగాలలో పనిచేస్తూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి బుధవారం హైదరాబాదులోని డీజీపీ కార్యాలయంలో జితేందర్ ప్రశంసాపత్రాలను అందజేయడం జరిగింది. ఇందులో భాగంగా కొత్తగూడెం డిఎస్పి రెహమాన్ పొక్సో కేసుల్లో వేగవంత దర్యాప్తు, పరిష్కారం చేసినందుకు ఈ గౌరవం లభించింది.

జర్నలిస్ట్ ఫోరం రజతోత్సవాలను విజయవంతం చేద్దాం

విశాలాంధ్ర - ఇల్లందు : తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం ఆవిర్భవించి మే 31నాటికి 25 ఏళ్ళు నిండుతున్న సందర్భంగా హైదరాబాద్ జలవిహార్‌లో నిర్వహిస్తున్న రజతోత్సవ సంబరాలను విజయవంతం నిర్వహిద్దామని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (హెచ్ -143) రాష్ట్ర కౌన్సిల్ మెంబెర్ గుర్రం రాజేష్ పిలుపు నిచ్చారు. గురువారం ఇల్లందు ప్రెస్‌క్లబ్‌లో రజతోత్సవ పోస్టర్ ఆవిష్కరించారు. ఇందులో రాజేష్ తోపాటు పాల్గొన్న జిల్లా అధ్యక్షులు కల్లోజీ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో తాము నిర్వహించిన చారిత్రాత్మక పాత్రను తెలియజేయడం కోసమే టీజేఎఫ్ రజతోత్సవాలను నిర్వహిస్తుందని తెలిపారు. 2001 మే 31న ఆవిర్భవించిన తెలంగాణ జర్నలిస్టుల ఫోరం 2014 రాష్ట్రం సాధించేంత వరకు ఎన్నో సందర్భాల్లో క్రియాశీలక పాత్ర పోషించిందన్నారు. ఇలాంటి రజతోత్సవాలకు జిల్లా నుండి అధిక సంఖ్యలో తరులుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి షఫీ, టెంజు జిల్లా అధ్యక్షులు పట్టి కొండ రవి, జిల్లా కార్యవర్గ సభ్యులు తాండ్ర రాజ్ కుమార్, సిరికొండ ప్రసాద్, మధు, రాజేష్, నాగేశ్వరరావు, శేషు, సంతోష్, సురేంద్రబాబు, దానియేల్, రవి, చాంద్, సురేష్, రాజశేఖర్, నందు, విజ్ఞాన్, రాజేష్, వీరన్న పాల్గొన్నారు.

పినపాక ఇంచార్జి తహశీల్దార్‌గా గోపాలకృష్ణ

విశాలాంధ్ర - పినపాక : పినపాక ఇంచార్జ్ తహసిల్దార్ గా గొంది గోపాలకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. పాల్వంచ శ్రీరామ ప్రాజెక్ట్ లో డిటి గా విధులు నిర్వహిస్తూ బదిలీ పై ఇక్కడికి వచ్చారు. గతంలో పినపాక మండలంలో విఆర్ఓ, ఆర్ఐ గా గోపాలకృష్ణ విధులు నిర్వహించారు. కొత్తగా విధుల్లో చేరిన ఆయన్ను రెవిన్యూ సిబ్బంది మర్యాద పూర్వకంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ రెవిన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కాగా ఇక్కడ తహసిల్దార్ గా విధులు నిర్వహించిన అద్దంకి నరేష్ మణుగూరు మండలానికి బదిలీ అయ్యారు.

26 నుండి భూభారతి సర్వేయర్లకు శిక్షణ తరగతులు : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : భూభారతి చట్టంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు భూమి సర్వే చేయడం కోసం లైసెన్సు సర్వేయర్లుగా ఎంపికైన వారికి ఈనెల 26 నుండి జూలై 26 వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. కొత్తగూడెం మైనింగ్ కళాశాలలో లైసెన్స్ సర్వేయర్ల శిక్షణ కోసం జరుగుతున్న ఏర్పాట్లను గురువారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కళాశాలలో తరగతి గదులు, డ్రాయింగ్ రూమ్‌లను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ 426 అభ్యర్థులకు 50 రోజుల పని దినాలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుంద న్నారు. ఈ శిక్షణలో భాగంగా అభ్యర్థులకు ఉదయం 9 గంటలకు క్షేత్రస్థాయిలో శిక్షణ, 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు థియరీ, ప్రాక్టికల్స్ నిర్వహించడం జరుగుతుందని వివరించారు. శిక్షణ కోసం అవసరమైన ప్రొజెక్టర్లు, బోర్డులు ఇతర పరికరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఉమ్మడి ఖమ్మం జిల్లా మైనింగ్ కళాశాలల ఏడి శ్రీనివాస్, డిప్యూటీ ఇన్స్పెక్టర్ డి.శ్రీనివాస్, మైనింగ్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

రహదారుల వెంట ఇంకుడు గుంటల నిర్మాణం చేపట్టాలి : కలెక్టర్

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న రహదారుల వెంట ఇంకుడు గుంటల నిర్మాణం చేపట్టాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం "జల్ సంచెయ్ జన్ భాగీ దారి" కార్యక్రమంలో భాగంగా రహదారుల వెంట ఇంకుడు గుంతల నిర్మించడానికి సంబంధిత అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. రహదారుల వెంట ఇంకుడు గుంతలు ఉండడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. వర్షపు నీరు నేలలోకి ఇంకి భూగర్భ జల మట్టం పెరుగుతుందన్నారు. అలాగే రహదారులపైన నీరు నిల్వకుండా రోడ్లు పాడైపోకుండా ఉంటాయని చెప్పారు. ఎక్కువ నీరు నిలిచే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి జిల్లాస్థాయిలో మార్కింగ్లు పెద్ద ఎత్తున చేయాలన్నారు. మార్కింగ్ చేసిన ప్రదేశాలలో జెసిబి ద్వారా పంచాయతీరాజ్ శాఖ ఏఈల పర్యవేక్షణలో ఇంకుడు గుంతలను త్రవ్వాలన్నారు. దేశంలోనే ఈ జన్ భాగీదారి కార్యక్రమంలో జిల్లా రెండవ స్థానంలో ఉందన్నారు. ఇంకా పెద్ద ఎత్తున ఇంకుడు గుంటలు నిర్మాణం చేపట్టి దేశంలో మొదటి స్థానంలో జిల్లాను నిలపాలని అధికారులను కలెక్టర్ కోరారు.

హనుమాన్ జయంతి అన్నదానం ప్రారంభించిన సాబీర్ పాష

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : హనుమాన్ జయంతి సందర్భంగా రామవరం సి ఆర్ పి క్యాంపులోని హనుమాన్ ఆలయం వద్ద కమిటీ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా ఈ ఆలయ ప్రాంగణంలో కుల మతాలకు అతీతంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించటం ఎంతో ఆదర్శనీయం, అభినందనీయమన్నారు. కమిటీ నిర్వాహకులను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులు కంచర్ల జమలయ్య, పాటి మోహన్‌రావు, మునిగడప వెంకటేశ్వర్లు, గుత్తుల శ్రీనివాస్, మర్రి గోపికృష్ణ, సుధాకర్ రాజు, అశోక్, దిలీప్ గుప్తా, సందబోయిన శ్రీనివాస్, కుమార్, సతీష్, జాన్,ఏసు, చిన్న, మిల్కీ, యూత్ సభ్యులు పాల్గొన్నారు.రు.

బూటకపు ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ చేయాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : పీడిత బాధ్యత ప్రజల కోసం ఉన్నత లక్ష్యంతో పని చేస్తున్న మావోయిస్టు నేతలను పార్టీ నేతలు, సభ్యులను, ఆదివాసీలను కేంద్రంలోని ఫాసిస్టు ప్రభుత్వం హత్యలు చేస్తుందని పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు విమర్శించారు. మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతోపాటు 30 మంది ఆదివాసీల ను హతమార్చిన బూటకపు ఎన్కౌంటర్‌ను ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కగార్ పేరా నిర్వహించిన ఈ ఎన్కౌంటర్ పై న్యాయ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా కొత్తగూడెంలొ నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ భూమి, భుక్తి ఈ దేశ దోపిడీ పాలన విముక్తి కోసం ఉన్నత చదువులు, ఉన్నత కుటుంబాలను వదిలి విప్లవోద్యమంలో అనేక మంది ప్రయాణం చేస్తున్నారని తెలిపారు. పేద ప్రజలు, ఆదివాసీల హక్కుల కోసం ఈ దేశ భవిష్యత్తు కోసం పోరాటాల నిర్వహించి వేలాది మంది బూటకపు ఎన్కౌంటర్లలో ప్రాణ త్యాగాలు చేశారని వెల్లడించారు. ఒక సిద్ధాంతం కోసం పనిచేస్తున్న స్వదేశ మావోయిస్టులను శత్రుదేశ ఉగ్రవాదుల కంటే దారుణంగా హెచ్చరిక లేకుండా నియంతల్లా కాల్చి చంపుతున్నారని నరేంద్ర మోడీ ప్రభుత్వంపై విమర్శించారు. నెల రోజులు కావస్తున్నా పహాల్గామ్ ఉగ్రవాదుల ఉనికిని కూడా కనిపెట్టలేని అసమర్థత కేంద్ర ప్రభుత్వం భారత పౌరులను చంపుతుందని విమర్శించారు. మన దేశంలో సంపదంతా దోపిడీ చేస్తున్న కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా, ఆదివాసుల కోసం పోరాడుతున్న మావోయిస్టులను ఒక వ్యూహం ప్రకారమే కేంద్రంలోని నరేందర్ మోడీ, అమిత్ షా లు ఈ మారణ హోమానికి తెగబడుతున్నారని విమర్శించారు. తక్షణమే కాల్పుల విరమణ చేసి ఆపరేషన్ కగార్ ను రద్దుచేయ్యాలని, మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని ఆయన డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో ఎన్ డి నాయకులు వి. సురేష్, కిరణ్, క్రాంతి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు అన్యాయం



విశాలాంధ్ర - గూడూరు : ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రమోషన్ల యందు తీవ్ర నష్టం జరుగుతున్నదని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు పార్నంది రామయ్య పేర్కొన్నారు. గురువారం గూడూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ఆవరణలో ఎస్సి ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యం లో ప్రమోషన్లో ఉపాధ్యాయులకు అడ్డుగా ఉన్న అడ్వకేసి రద్దు చేయాలని కరపత్రం విడుదల చేశారు. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా రామయ్య హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే వివిధ రకాల ఉద్యోగ ఉపాధ్యాయ నియమ కాలు ఎస్సీ 15 శాతం, ఎస్టి 10 శాతం పి.హెచ్.సి 3 శాతం వారిగా ఇదివరకే చేరుకున్నట్లయితే వారు పదవీ విరమణ వరకు ఆయా వర్గాలకు తీరని అన్యాయం జరుగుతున్నదన్నారు.ఒక శాఖలో పనిచేసే ఉద్యోగి, ఉపాధ్యాయు లుగా డైరెక్టుగా ఉద్యోగం సంపాదించుకున్న, అతన్ని ఎస్సీ ఎస్టీ టిహెచ్చి రిజర్వేషన్లలో చూపించిన అడ్వకేసి ప్రకారం నీ కోట నిండిందని అంటున్నారని అయన ఆరోపించారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ రోస్టర్ పాయింట్స్ వర్తించదని డీఎస్సీలో మంచి ర్యాంకు తెచ్చుకొని, జనరల్ కోటాలో సెలెక్ట్ అయినా ఒక ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుని ప్రమోషన్ విషయంలో, ఎస్టి కోటాలో లెక్కిస్తున్నారని, ప్రమోషన్ విషయంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు ఉన్న, మెరిట్‌ను పరిగణలోకి తీసుకొనకపోవడం బాధ కరం అని అయన ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వేషన్‌పై ఉన్నతాధికారులకు సక్రమంగా అవగాహన చేసుకోవడంలో, విఫలమై బ్లండర్‌గా ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు తీరని అన్యాయం చేస్తున్నార న్నారు. ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మోకాళ్ళ వెంకన్న, మండల అధ్యక్షులు మేడ వసంత, వినయ్ కుమార్ టి ఆర్ టి యు రాష్ట్ర కార్యదర్శి ఈ లక్ష్మయ్య డిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు, డి పగడయ్య ఎల్ ఎఫ్ ఎల్ హెచ్ఎం, ఈ ప్రభాకర్ మచ్చర్ల ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం, సిహెచ్ సుభద్ర, బి రాజేశ్వరి పాల్గొన్నారు.

సంపాదకీయం

పైశాచిక ఆనందం

"నక్సలిజాన్ని నిర్మూలించడానికి కొనసాగిస్తున్న యుద్ధంలో ఇది మైలురాయి వంటి విజయం. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్ పూర్‌లో భద్రతా దళాలు, మావోయిస్ట్ పార్టీ అగ్రనాయకుడు, సీపీఐ మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాళ కేశవరావ్ అలియాస్ బసవరాజు మరో 26 మందిని మట్టు పెట్టాయి. నక్సలిజానికి వ్యతిరేకంగా కొనసాగిస్తున్న పోరాటంలో ప్రధాన కార్యదర్శిగా ఉన్న నాయకుడిని అంతమొందించగలగడం గొప్ప విజయం." ఇవి కేంద్ర హోం మంత్రి అమిత్ షా సంతోషాతిరేకంతో అన్న మాటలు. "మావోయిస్టు పార్టీకి ఇప్పుడు నాయకుడు లేకుండా పోయాడు" పేరు బయటకు చెప్పుకోలేని ఒక పోలీసు ఉన్నతోద్యోగి వ్యాఖ్య. "ఇది చరిత్రాత్మకమైన రోజు". ఇది మరో పోలీసు ఉన్నతాధికారి భాష్యం. నారాయణ్ పూర్, దంతెవాడ, బీజాపూర్, కొండగావ్ నుంచి ఛత్తీస్‌గఢ్‌లో 2015లో ఏర్పాటు చేసిన పోలీసు దళాలు నక్సలైట్లను చుట్టుముట్టాయి. ఈ "ఎన్‌కౌంటర్"లో కేశవరావ్ మరో 26మందిని కూడా భద్రతా దళాలు అంతమొందించాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్వయంగా ఈ ఎన్‌కౌంటర్ వార్త ప్రకటించవలసి వచ్చిందంటే ఇది ప్రభుత్వ దృష్టిలో మహత్తర విజయమై ఉండాలి. 21 రోజులుగా చేస్తున్న పోరాటం ఈ రోజు(21 మే) సఫలమైందని సీఆర్‌పీ అధికారి ఒకరు చెప్పారు. బసవరాజు నక్సల్ ఉద్యమానికి వెన్నెముక లాంటివాడు అని అమిత్ షా అన్నారు. బస్తర్ ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. 2026 మార్చికల్లా దేశంలో మావోయిజాన్ని అంతమొందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించుకుంది. మావోయిస్టుల అగ్రనాయకుడిని అంత మొందించినందుకు అమిత్ షా పైశాచిక ఆనందంలో ఓలలాడుతున్నారు. శత్రునిర్మూలన ఎవరికైనా ఆనందం కలిగించవచ్చు. ప్రధాన నాయకుడిని కడతేర్చగలగడం సహజంగానే మరింత ఆనందం కలిగించవచ్చు. కానీ నక్సలైట్ భావజాలం ఉన్న వారిని వ్యక్తులుగా అంతమొందించినంత మాత్రాన ఆ భావజాలం అంతమవుతుందనుకోవడం భ్రమే. అసలు నక్సలైట్ సమస్య మీద ప్రభుత్వాలకు మౌలిక అవగాహనైనా లేకపోవడంవల్లే ఇలాంటి ప్రకటనలు చేస్తుంటారు. ఎన్‌కౌంటర్లల్లో పారిన నెత్తురు చూసి మురిసిపోతుంటారు. వర్గశత్రు నిర్మూలనతో సమాజం మారిపోతుందని, సమసమాజం ఏర్పడుతుందని నక్సలైట్లు నమ్ముతారు. కానీ నక్సలిజం పుట్టినప్పటి నుంచి ఎంతమంది వర్గశత్రువులను హతమార్చినా మావోయిస్టుల సాయుధ పోరాటాన్ని నమ్ముకున్న ఇతర కమ్యూనిస్టు పార్టీల లక్ష్యం నెరవేరనేలేదు. ఈ విషయం మావోయిస్టు నాయకత్వానికి తెలియదనుకోలేం. కానీ తామే చుట్టుకున్న వలలోంచి బయటపడే అవకాశం వారికి రావడంలేదు. నిజానికి మావోయిస్టులు కారణం ఏదైనా ప్రభుత్వంతో చర్చలకు సిద్ధంగా ఉన్నారు. ఈ విషయాన్ని లేఖల ద్వారా ప్రభుత్వాలకు తెలియజేస్తూనే ఉన్నారు. కానీ ప్రభుత్వం ఈ దశలో చర్చలకు సిద్ధంగా లేదు. బహుశా గత కొన్ని రోజులుగా నక్సలైట్లను నిర్మూలించాలని కేంద్ర ప్రభుత్వం దీక్ష పూనిన తరవాత ఎటూ వచ్చే సంవత్సరం మార్చికల్లా ఆ లక్ష్యం సాధించేస్తాం కనక ఇంకా నక్సలైట్లతో చర్చలేమిటి అని ప్రభుత్వం భావిస్తూ ఉండవచ్చు. అమిత్ షా కంటున్న కలల ప్రకారమే ఒక్క నక్సలైటూ లేకుండా ఏరివేయగలిగినా నక్సలిజం అంతం అవుతుందన్నది అత్యాశే. నక్సలిజం విస్తరించడానికి గల కారణాలు కొనసాగినంత కాలం ఆ భావజాలానికి ఆదరణ ఉండనే ఉంటుంది.

విచిత్రం ఏమిటంటే కేరళలోని పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా నాయకుడి మీద హత్యకు కుట్ర పన్నారన్న ఆరోపణ ఉన్నా సుప్రీంకోర్టు ఆయనకు బెయిలు మంజూరు చేసింది. నక్సలైట్ల అంశాన్ని వివిధ ప్రభుత్వాలు ఎన్నడూ భావజాల పోరాట దృష్టితో చూడనేలేదు. కేవలం శాంతి భద్రతల సమస్యగానే అన్ని ప్రభుత్వాలూ పరిగణించాయి. బలమైన, సహేతుకమైన భావజాలం నుంచి పుట్టిన ఏ ఉద్యమం అయినా వ్యక్తులను నిర్మూలించినంత మాత్రాన అంతరించిపోదు. నక్సలైట్లను ఏరివేసే కార్యక్రమానికి ఆపరేషన్ బ్లాక్ ఫారెస్టు అన్న పేరు పెట్టారు. ఈ కార్యక్రమం మొదలైన తరవాత 54 మంది నక్సలైట్లను అరెస్టు చేశారు. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్టాలకు చెందిన 84 మంది నక్సలైట్లు లొంగిపోయారు అని అమిత్ షా మహదానందంతో వెల్లడించారు. ఈ మహదానందాన్ని ప్రధానమంత్రి మోదీ కూడా పంచుకున్నారు. "మన భద్రతా దళాలను చూస్తుంటే గర్వంగా ఉంది. వారు చెప్పుకోదగ్గ విజయం సాధించారు. మావోయిజాన్ని తుదముట్టించి ప్రజలకు అభ్యున్నతిచేసి చూపిస్తామని, ప్రజలు ప్రశాంతంగా బతికే ఏర్పాటు చేస్తాం" అని మోదీ "ఎక్స్" లోని ట్విట్టర్ ఖాతాలో రాశారు. కశ్మీర్‌లో ఆగడాలు సృష్టిస్తున్న తీవ్రవాదుల గురించి కూడా కేంద్ర ప్రభుత్వం గత ఆరేళ్ల నుంచి ఇలాంటి మాటలే చెప్తోంది. అయినా అక్కడ తీవ్రవాదం సమసిపోనే లేదు. సీపీఐ (మావోయిస్టు) వ్యవస్థాగత నిర్మాణంలో కేంద్ర కమిటీ చాలా కీలకమైంది. ఈ ఏడాది ప్రభుత్వం అగ్ర నాయకుడు కేశవరావుతో పాటు మరో ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులను కూడా ఎన్‌కౌంటర్ల పేర అంతమొందించింది. గత జనవరిలో ఛత్తీస్ గఢ్, ఒరిస్సా సరిహద్దులో రామచంద్రా రెడ్డిగారి ప్రతాప్ రెడ్డి అలియాస్ చలపతి, ప్రయాగ్ మాంఝీ అలియాస్ వివేక్ ఎన్‌కౌంటర్లలో బలయ్యారు. వీరిద్దరూ కేంద్ర కమిటీ సభ్యులే. కమ్యూనిస్టు పార్టీలలో ప్రధాన కార్యదర్శి పదవి చాలా ప్రధానమైంది. కేశవరావ్ 2018 నుంచి సీపీఐ (మావోయిస్ట్) ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఆయన స్థానంలో కొత్త నాయకుడిని ఎన్నుకోవలసి వస్తుంది. ఇటీవల బీజాపూర్ జిల్లా కర్రెగుట్ట ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్ లో 31 మంది మావోయిస్టులు మరణించారు. అప్పుడు కూడా 21 రోజుల పాటు మావోయిస్టుల వేట కొనసాగింది. ఆ వేట మే 11న ముగిసింది. 2023 డిసెంబర్ ఒకటి నుంచి 2025 మే 20 మధ్య జరిగిన ఎన్‌కౌంటర్లలో 401 ఒక్క మంది నక్సలైట్లు నేలకొరిగారు. ఈ క్రమంలో 214 మంది భద్రతా దళాలవారు, 87 మంది పౌరులు కూడా మరణించారు. పౌరులు కూడా మరణించడం అంటే భద్రతా దళాలు సరైన గురిలేకుండా విచ్చలవిడిగా కాల్పులు జరుపుతున్నట్టే. కేశవరావు సీపీఐ (మావోయిస్ట్) పార్టీ అగ్రనాయకుడే కాక ఆ పార్టీ సైనిక దళ అగ్రగామి కమాండర్. పోరాట వ్యూహాలు రూపొందించడంలో ఆయన దిట్ట. అందువల్ల ఆయన లేకపోవడం కొంతకాలంపాటైనా నాయకత్వలోపానికి దారితీయవచ్చు. కానీ పోరాటంలో నిమగ్నమైన పక్షాలు ఎప్పుడూ "ఒక వీరుడు మరణిస్తే వేల మంది ప్రభవింతురు" అన్న రీతిలోనే ముందుకు సాగుతాయి. ఇలాంటి పార్టీలలో వ్యక్తులు ప్రధానం కాదు. భావజాలం ముఖ్యం. ఈ విషయం ప్రభుత్వాలకు అర్థమూ కాదు, ఆ భావజాలాన్ని ఎదుర్కొనే సామర్థ్యమూ లేదు.

అభివృద్ధి పట్ల నిర్లక్ష్యం తగదు

కొట్టండి, చంపండి, జైల్లో వేయండి కక్ష తీరేలా కొట్టండి. ఏంటి బావా పొద్దున్నే కొట్టండి, చంపండి అంటున్నావు. పాకిస్థాన్ వాళ్లనేనా యుద్ధం ఆపేశారు కదా. అదేనయ్యా ఆపద సమయంలో పార్టీలుండవు కదా మరి ప్రతిపక్షాలన్నింటి ఆమోదంతోనే యుద్ధం ఆపారా లేక అమెరికా అధ్యక్షుని మాట మీదే ఆపారా అని నా సందేహం. అయినా నేను కొట్టండి, చంపండి అనేది పాకిస్థాన్‌ను కాదయ్యా. ప్రతిది కేంద్రాన్ని అనుసరించే మన నాయకులు ఇక్కడ కూడా అభివృద్ధి తరువాత ప్రతిపక్ష నాయకుల్ని అరెస్టు చేయండి, కొట్టండి, జైల్లో వేయండి అన్నట్లుగానే వ్యవహరిస్తున్నారు కదా. జగన్ రాష్ట్రాన్ని దివాలా తీయించాడు. మన వాళ్లను చిత్రహింసలు పెట్టాడు. అందుకే కక్ష ముందు అభివృద్ధి తరువాత అన్నట్లుగా ప్రభుత్వం ఆలోచిస్తోంది. అప్పుల పాలు చేశాడంటూనే మరిన్ని అప్పులు చేస్తున్నారు. కాని ప్రతిపక్షాన్ని కోలుకోని విధంగా దెబ్బ తీయాలి అనేది ముఖ్యం. మనం

ప్రజలకు మంచి చేస్తుంటే ప్రతిపక్షం అవసరం లేదు. అదేంటి ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం ముఖ్యం కదా. నిజమేనయ్యా నీవింకా పాత రోజుల్లో ఉన్నావు. కేంద్రంలో బీజేపీ ఆలోచనే మన ఆలోచన. ప్రధాని మోదీ నేతృత్వంలో దేశం దూసుకుపోతుంటే ఇంకా ప్రతిపక్షం ఉండి ఏం చేస్తుంది. అభివృద్ధికి ఆటంకం తప్ప. అందుకే మన రాష్ట్ర ప్రభుత్వం కూడా అదే దారిలో ఆలోచిస్తోంది. అభివృద్ధికి ఆటంకం కలిగించే నిరోధక శక్తుల్ని లేకుండా చేస్తే ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా అమరావతిని నిర్మించవచ్చు.

అది సరేనయ్యా అభివృద్ధి లేకుండా రాష్ట్రాన్ని సర్వనాశనం జగన్ చేశాడని చెప్పేటప్పుడు అభివృద్ధి మీద కంటె ప్రతిపక్ష నాయకుల అరెస్టుల మీదె దృష్టి పెట్టడం సబబు కాదు గదా. భలే వాడివయ్యా అభివృద్ధి నిరోధకుల్ని లోపల వేస్తేనే అభివృద్ధి ఏ ఆటంకం లేకుండా పరుగు పెడుతుంది కదా. కాని తిరిగి మేమే వస్తాం. మా ప్రభుత్వం వచ్చాక ఇంతకు మించి కక్ష తీర్చుకుంటామని జగన్ అంటున్నాడు. నీవు నేర్పిన పాఠం అప్పచెబుతాం అంటున్నాడు. ఈ విధంగా ఒకరిపై ఒకరు కక్ష తీర్చుకోవడంపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేకపోవడం మంచిది కాదని ప్రజలు భావిస్తున్నారు. అభివృద్ధి చినబాబు నేతృత్వంలో గుర్రపు పరుగులా ముందుకు వెడుతోంది. అనేక మంది పారిశ్రామికవేత్తలు ఎన్నో సంస్థలు నెలకొల్పుతున్నారు. అందుకే కక్ష సాధింపు అభివృద్ధి రెండూ రెండు కళ్లుగా భావించి ముందుకు వెడుతున్నామని తెలుగు తమ్ముళ్లు అంటున్నారు. ఎక్కడా చోటు లేనట్లు పార్టీ ఉత్సవం కడపలో పెట్టడం జగన్‌కు తొడ కొట్టడమే అని కూడా తెలుగు తమ్ముళ్లు ఆనందపడుతున్నారు. కాని గత ప్రభుత్వంలో వలే ఇప్పుడు కూడా చోటా నాయకులు, కాంట్రాక్టర్ల దోపిడీ ఆగలేదు. అధికారుల అవినీతి గతంలో కంటే పెరిగిందనే అధికులు అభిప్రాయం. ఈ పరిస్థితిలో హామీలన్నీ ఇంకా అమలు కాలేదు. ఆగస్టులో ఉచిత బస్సుతో పాటు మరికొన్ని హామీలు అమలవుతాయని అంటున్నారు. ఏది ఏమైనా గత ప్రభుత్వంలో వలే అవినీతి అందలమెక్కి కూర్చుంది. హామీలు అమలు చేసినా అవినీతిని అరికట్ట లేనప్పుడు ప్రజల సొమ్ముకు బాధ్యత వహించేది ప్రభుత్వమే కదా. ప్రజల నుంచి వసూలు చేసిన సొమ్ములో కొంత హామీలు నెరవేర్చడానికి ఖర్చు చేసినా అవినీతి పాలయ్యేది ప్రజల సొమ్మే కదా.

ప్రజల సొమ్ముకు కాపలా ఉండవలసిన ప్రభుత్వం అవినీతిని అరికట్ట లేనప్పుడు ఈ ప్రభుత్వమైనా, గత ప్రభుత్వమైనా ప్రజల ముందు ఫెయిల్ అయినట్టే కదా. ముందు అభివృద్ధి కార్యక్రమాలు అవినీతికి తావు లేకుండా అమలు చేస్తే ప్రభుత్వాన్ని ప్రజలు విశ్వాసముంచి నమ్మి నెత్తిన పెట్టుకుంటారు. గత ముఖ్యమంత్రిపై కేసులు బయటకు లాగితే ప్రభుత్వం మారిన తరువాత ఆ ప్రభుత్వం చేసే పని అదే. ఇద్దరు ముఖ్యమంత్రులపై కేసులున్నాయనే సంగతి తెలిసిందే. ఏ ప్రభుత్వమైనా ఇతర విషయాలు పక్కన పెట్టి ఇటు సంక్షేమ కార్యక్రమాలు అటు అభివృద్ధి ఒకేసారిచేసే ప్రయత్నం చేయడం మంచిది. కక్ష సాధింపులతో కాలం గడిపి వేస్తే ప్రజలకు అన్యాయం చేసినట్లే.

సమాజానికి వెన్నెముక రైతు అంటారు. కాని కష్టపడి పండించిన ధాన్యానికి మద్దతు ధర రాదు. పంట కాల్వలు మురుగు కాల్వలో పూడిక తీసి నీరు పారేలా చేయాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటారు. కాని ఈ విషయంలో ప్రభుత్వం అశ్రద్ధ చెప్పరానిది. ప్రతి సంవత్సరం కాంట్రాక్టులిచ్చి మమ అనిపించడమే కాని రైతులు కోరిన విధంగా పూడికలు తీయడం జరగదు. ఈ సంవత్సరం ఫిబ్రవరి కాంట్రాక్టు ఇవ్వడం, మార్చిలో పూడిక తీశామనడం ఏప్రిల్, మే మొదటి వారంలో మరల తూడు, కిక్కిసలతో పెరిగి మరల పూడిపోవడం ప్రస్తుతం వర్షాలతో మొదట స్థాయికి చేరి రైతుకు అశనిపాతంలా తయారయింది. విత్తనాలు ఇంతవరకు అందించలేదు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా అవసరార్థం సమాజానికి రైతు వెన్నెముక అని పొగడటం తప్ప రైతు సమస్యలు పట్టించుకున్న ప్రభుత్వం లేదు. ఇది రైతు చేసుకున్న పాపమా లేక ప్రభుత్వ నిర్లక్ష్య శాపమో కాని రైతుల పట్ల మొదటి నుంచి ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి తప్పడం లేదు. అన్నింటి కంటే రైతు సమస్యల పరిష్కారం అభివృద్ధి మొదటిదిగా ప్రభుత్వం గుర్తించాలి.

సెల్: 9885569394

ఫాసిజంపై ప్రగతిశీల శక్తులపోరు

సయ్యద్ జీజ్ పాషా
సీపీఐ జాతీయ కార్యదర్శి

మాస్కోలో ఏప్రిల్ 23-24 తేదీల్లో ఫాసిస్ట్ వ్యతిరేక వేదిక రెండవ ప్లీనరీ జరిగింది. ఇందులో 91 దేశాల నుంచి 164 పార్టీలు, సంస్థలు పాల్గొన్నాయి. ఫాసిస్ట్ వ్యతిరేక వేదిక మొదటి అంతర్జాతీయ ప్లీనరీ 2023 ఏప్రిల్ 22న మిన్స్క్‌లో జరిగింది. ప్లీనరీకి కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ రష్యన్ ఫెడరేషన్ చైర్మన్ కామ్రేడ్ గెన్నడి అధ్యక్షత వహించారు. ఫాసిజం అనేది అత్యున్నత రూపమైన కులీన వ్యవస్థ(ఒలిగార్కి)గా ఆయన అభివర్ణించారు. నాజీలు, ఫాసిస్టులు ఓటమి చెందేంతవరకు వెనుకంజ వేయని రెడ్ ఆర్మీ చారిత్రక పాత్రను ఆయన గుర్తు చేశారు. ఈ దేశభక్తి యుద్ధంలో 2.7కోట్ల మంది తమ ప్రాణాలను అర్పించారు. రెండవ ప్రపంచ యుద్ధంలో అత్యంత ఘోరమైన స్టాలిన్‌గ్రాడ్ యుద్ధాన్ని ఆయన గుర్తు చేశారు. మానవత్వం కోసం సోషలిజం మరింత స్థిరంగా ముందుకు సాగుతుందన్న విశ్వాసం ఆయన వ్యక్తం చేశారు.

నాటి సోవియట్ యూనియన్ అంకితభావంతో కూడిన మద్దతు ఫలితంగా అనేక ఆఫ్రికన్ దేశాలు వలసవాదం కబంధ హస్తాల నుంచి విముక్తి పొందాయి. ఇప్పుడు ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో నయా ఫాసిజం సంకేతాలు కనిపిస్తున్నాయి. వాటి పట్ల మనం అత్యంత జాగ్రత్త వహించాలి. ఐక్యరాజ్యసమితి ప్రజాస్వామీకరణ ఒక ముఖ్యమైన ఎజెండాగా ఉండాలి. పలస్తీనాలో వేలాదిమంది అమాయక చిన్నారులు, మహిళల మారణహోమానికి అమెరికా, ఇజ్రాయెల్ అనుసరిస్తున్న విధ్వంసక విధానాలను ఆయన తీవ్రంగా విమర్శించారు. ఆమోదయోగ్యమైన పరిష్కారంతో కూడిన శాశ్వత శాంతికోసం విజ్ఞప్తి చేశారు. ఉక్రెయిన్ మోసం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ ప్లీనరీ సమావేశం తరువాత అనేక సెక్షనల్ సమావేశాలు జరిగాయి. వాటిలో కమ్యూనిస్టు పార్టీల ప్రతినిధులు, ఇతర ప్రగతిశీల సంస్థల ప్రతినిధులు ప్రసంగించటం లేదా తమ పత్రాలను సమర్పించారు.

ఫోరమ్ చివరకు ఒక విజ్ఞప్తిని విడుదల చేసింది. దీనిలో ఆధునిక ప్రపంచంలో సామ్రాజ్యవాద దురాక్రమణకు పెట్టుబడిదారీ వ్యవస్థలో సంభవించిన సాధారణ సంక్షోభం తీవ్రతరమవడమే కారణమని, ఇవి చోటుచేసుకుంటున్న పరిణామాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని పేర్కొంది. 20వ శతాబ్దం చివరలో యుఎస్ఎస్ఆర్, తూర్పు యూరప్ దేశాలలో జరిగిన ప్రతీఘాత -విప్లవం ప్రపంచంలో సోషలిస్టు పాత్రను తాత్కాలికంగా బలహీనపరిచింది. ప్రతీఘాత శక్తులను ఏకం చేసింది.

సామ్రాజ్యవాదంపై లెనినిస్ట్ సిద్ధాంతం ప్రకారం, అమెరికా ఇతర దోపిడీదారులు అత్యంత హేయమైన పద్ధతుల ద్వారా ప్రపంచ ఆధిపత్యం కోసం ప్రయత్నిస్తున్నారు. ఇందులో నయా-ఫాసిస్టు పాలనలను ప్రోత్సహించడం కూడా ఉంది. అమెరికా నేతృత్వంలోని నాటో అవలంబించే రష్యా వ్యతిరేక విధానంలో 2022 ఫిబ్రవరి నాటికి దాదాపు 50 ఉపగ్రహ దేశాలు ఉన్నాయి. రష్యా, చైనా, క్యూబా, కొరియా డెమోక్రటిక్ పీపుల్స్ రిపబ్లిక్ ప్రజలపై ఆంక్షలు విధించాయి. ఆ దేశాలపై సైనిక బెదిరింపులు, రాజకీయ బ్లాక్‌మెయిల్, భయాన్ని వ్యాప్తిచేయడం సాధారణ విషయంగా మారాయి. యూరోపియన్ యూనియన్ సహా ప్రత్యర్థిని అణచివేయడం ద్వారా అమెరికా తన ఆర్థిక సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఉక్రెయిన్ విషయానికి వస్తే కీవ్‌లోని ఫాసిస్టు పాలనను ఖండించడంతో పాటు, ఉక్రెయిన్ కమ్యూనిస్టు పార్టీపై నిషేధాన్ని ఎత్తివేయాలని ప్లీనరీ తన విజ్ఞప్తిలో డిమాండ్ చేసింది. ఫాసిజానికి, ప్రపంచ యుద్ధాల ముప్పునకు అంతం సమీపిస్తోందని, సామ్రాజ్యవాదానికి ముగింపు పలకడం ద్వారానే పరిష్కారం లభిస్తుందని, కమ్యూనిస్టుల నేతృత్వంలోని కార్మికవర్గం, శ్రామిక ప్రజలు మాత్రమే సామ్రాజ్యవాదాన్ని అంతంచేయగల పార్టీ ఏకైక శక్తి అని అందులో ప్రకటించారు. ఫాసిస్ట్ వ్యతిరేక వేదిక రెండవ ప్లీనరీలో అనేకబంది ప్రసంగించి, పత్రాలు సమర్పించారు. సీపీఐ తరపున మాస్కో సందర్శించిన జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా(వ్యాస రచయిత) 'ఫాసిజంపై విజయం భారతదేశ చారిత్రక అనుభవాలు' అనే అంశంపై ఒక పత్రాన్ని సమర్పించారు. జపాన్ ఫాసిజం భారతదేశం తలుపులు తడుతూ దేశాన్ని ముంచెత్తడానికి సిద్ధంగా ఉన్నప్పుడు, మా దేశ ప్రజలు ఒక శిలలా నిలబడ్డారు. భారత కమ్యూనిస్టు పార్టీ కూడా తన చారిత్రక పాత్రను నిర్వర్తించింది. ఆగ్నేయాసియాలో విజయాలు సాధించిన తరువాత కలకత్తా, విశాఖపట్నం, మద్రాస్ వంటి ప్రధాన నగరాలపై బాంబులు వేయడం ద్వారా భారతదేశాన్ని లక్ష్యంగా చేసుకోవడం ప్రారంభించారు. మణిపూర్‌లోని గణనీయమైన భాగాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. బాంబుల భయం, దండయాత్ర ముప్పు కారణంగా కలకత్తా వంటి నగరాల నుంచి వేలాదిమంది భయంతో పారిపోవడంతో సామూహిక తరలింపులకు దారితీసింది. ఆ సమయంలో సీపీఐ భారతదేశాన్ని రక్షించడానికి ఒక స్పష్టమైన పిలుపునిచ్చింది. దేశ రక్షణ కోసం ఒక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. పార్టీ, దాని ప్రజా సంఘాలు బెంగాల్, ఆంధ్ర, మణిపూర్, ఇతర సరిహద్దు ప్రాంతాలలో స్వీయ-రక్షణ, గెరిల్లా బృందాలను ఏర్పాటు చేసారు. కందకాలు తవ్వారు. వైమానిక దాడుల డ్రిల్లు నిర్వహించారు. రాత్రి సమయాల్లో ఆశ్రయాలను ఏర్పాటు చేశారు. ఫాసిజం, నాజీయిజం నిజ స్వభావం గురించి అవగాహన పెంచడానికి సీపీఐ అవిశ్రాంతంగా కృషి చేసింది. అదే సమయంలో ప్రజా విస్తృత సమూహాలను సమీకరించింది. మహిళా శక్తి పాత్ర చాలా ముఖ్యమైనది. ఎందుకంటే గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ముఖ్యంగా కలకత్తాలో వేలాది మందిని సమీకరించారు. సీపీఐ అత్యంత విస్తృతమైన రాజకీయ, సైద్ధాంతిక ప్రచారాన్ని ప్రారంభించింది. 'జాతీయ ఫ్రంట్' అనే ఆలోచనను ముందుకు తెచ్చింది.

సోవియట్ రెడ్ ఆర్మీ పాత్ర అత్యంత నిర్ణయాత్మకమైనది. వారి త్యాగాలు నాజీయిజం, ఫాసిజం కబంధ హస్తాల నుంచి ప్రపంచాన్ని రక్షించాయి. లేకపోతే ప్రపంచ చిత్రం భిన్నంగా ఉండేది. ప్రపంచంలోని ప్రజాస్వామ్య ప్రజలు అప్రమత్తంగా ఉండటంతోపాటు పచ్చి మితవాద, నయా-ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా పోరాటాన్ని కొనసాగించేందుకు దృఢంగా సంకల్పించాలి. అవి ఎప్పుడైనా తమ అసహ్యకరమైన రూపాన్ని ప్రదర్శించగలవు.

శాంతి, సమానత్వం, న్యాయంపై ఆధారపడిన ప్రపంచాన్ని నిర్మిద్దాం! దానిని పరిరక్షించుకుందాం!!

నాటి సోవియట్ యూనియన్ అంకితభావంతో కూడిన మద్దతు ఫలితంగా అనేక ఆఫ్రికన్ దేశాలు వలసవాదం కబంధ హస్తాల నుంచి విముక్తి పొందాయి. ఇప్పుడు ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో నయా ఫాసిజం సంకేతాలు కనిపిస్తున్నాయి. వాటి పట్ల మనం అత్యంత జాగ్రత్త వహించాలి.

జర్నలిస్టులకు కొరవడిన భద్రత

కృష్ణ ఝా

దేశవ్యాప్తంగా వివిధరాష్ట్రాల్లో జర్నలిస్టులపై హింసాత్మక చర్యలు పెరుగుతున్నాయి. 28 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో 427 మంది జర్నలిస్టులపై నేరపరమైన కేసులు పెట్టారు. కావాలనే ఇలాంటి నేరాలుమోపి హింసిస్తున్నారు. 2012-2022 మధ్యకాలంలో ఈ 423 మందిపై క్రిమినల్ కేసులు నమోదుచేశారు. అనేకసార్లు పెట్టిన కేసులనే జర్నలిస్టులపై పెడుతున్నారు. క్రిమినల్ జస్టిస్ వ్యవస్థలో జర్నలిస్టుల అనుభవం దారుణంగా ఉంటోంది. ఢిల్లీలోని జాతీయ న్యాయ యూనివర్సిటీ, క్లూని ఫౌండేషన్ ఫర్ జస్టిస్ ట్రయల్, హ్యూమన్ రైట్స్ ఇన్‌స్టిట్యూట్, కొలంబియా లా స్కూల్ కలిసి అధ్యయనంచేసి క్రిమినల్ కేసులను నిర్ధారించాయి. దేశంలో రాజ్యాంగ పరిధిలో మీడియాకు ఏ మాత్రం స్వేచ్ఛలేకుండా పోయింది. ఎటువంటి బెదిరింపులు లేకుండా జర్నలిస్టులకు స్వేచ్ఛగా పనిచేసే అవకాశం చాలా ముఖ్యమైనదని సుప్రీంకోర్టు వక్కాణించింది.

జర్నలిస్టులకు భద్రత కల్పిస్తామన్న వాగ్దానం ఉన్నప్పటికీ వారు ఎల్లవేళలా బెదిరింపుల మధ్య పనిచేయవలసి వస్తోంది. పాలకులకు ఏ మాత్రం గిట్టకపోయినా క్రిమినల్ కేసులను బనాయిస్తున్నారు. జర్నలిస్టుల విధులు చాలా కీలకమైనవి. ప్రభుత్వ అధికారుల చర్యలపై వార్తలు రాసినప్పటికీ కేసులు మోపుతున్నారు. చిత్తశుద్ధికలిగిన ప్రభుత్వయంత్రాంగం లేనట్లయితే జర్నలిస్టులు చాలా ఇబ్బందులపాలవుతారు. చాలా తరచుగా అధికార యంత్రాంగం జర్నలిస్టులను బెదిరిస్తూ ఉంటుంది. ప్రభుత్వ వ్యవస్థకు కూడా ఇదొక సవాలుగా మారుతోంది. దీన్ని ఎదుర్కొనేందుకు జర్నలిస్టులు సిద్ధంగా ఉండటంకూడా కష్టమైనదే. జర్నలిస్టులు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తున్నప్పుడు ఎలాంటి బెదిరింపులు ఉండకూడదు. రాజ్యాంగం భావప్రకటనా స్వేచ్ఛను, ప్రత్యేకించి పత్రికా స్వేచ్ఛను కల్పించింది.

ఒక ప్రాజెక్టులో భాగంగా 48 మంది జర్నలిస్టులను ఇంటర్వ్యూ చేశారు. ఈ ఇంటర్వ్యూల ఆధారంగా ప్రాజెక్టులో అనివార్యమైన లోపాలున్నాయని రిపోర్టు స్పష్టంచేసింది. ఈ రిపోర్టు జర్నలిస్టులపైన, వారి కుటుంబాలపైన తీవ్ర ప్రతికూల ప్రభావం చూపింది. వీరిలో కనీసం 40శాతం మంది జర్నలిస్టులను జైలులో అధ్యయనం చేసేందుకు ఎంపికచేశారు. చిన్న నగరాలు, మారుమూల గల పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలలో వాస్తవంగా జర్నలిస్టులు తీవ్ర కష్టాలను ఎదుర్కొంటున్నారు. స్థానిక పత్రికలు, హిందీలోగాని, ఇతర స్థానిక భాషలలో గాని పనిచేసే జర్నలిస్టులపై కేసులు తరచుగా జాతీయ, అంతర్జాతీయ మీడియా దృష్టికిరావు. సాధారణంగా నమోదుచేసిన నేరాల ఆధారంగా కనీసం ఐదేళ్లకు తక్కువలేకుండా జైలుశిక్ష విధిస్తున్నారు. ఈ చట్టాల వివరాలు కూడా అస్పష్టంగా ఉంటున్నాయి. వీటినే ప్రెస్‌కు వ్యతిరేకంగా నిర్వచించి కేసులు నమోదు చేస్తున్నారు. నేర న్యాయవ్యవస్థలో జర్నలిస్టులను భాగస్వాములను చేస్తున్నారు. ప్రతి కేసులోనూ నమోదుచేసే డాటాలో అనేక నేరాలను పేర్కొనడం ముఖ్యంగా గమనించాలి. వాస్తవంగా 90శాతం సంఘటనలలో ఒకటికంటే ఎక్కువగా నేరాలను నమోదు చేస్తున్నారు. ఇలా కేసులను నమోదుచేయడం ప్రభుత్వ యంత్రాంగం ఏ మాత్రం జాగ్రత్త తీసుకోకుండా జరిగిపోతోంది.

యధాలాపంగా జర్నలిస్టులపై క్రిమినల్ కేసులను నమోదు చేస్తున్నారు. ఇది మరింతగా ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తోంది. జర్నలిస్టులపైచేసే అభియోగాలు వారి ప్రవర్తనకు సంబంధించినదిగా ఉంటున్నాయి. లభించిన సమాచారంలో దాదాపు 100 కేసులలో ఎన్నోఎత్తుగడలు కూడా ఉంటున్నాయి. న్యాయపరమైన హింస సమాచారంలో చాలా ఎక్కువగా ఉండటమేకాదు, చాలా ప్రగాఢంగా కూడా ఉంటోంది. 427 మంది జర్నలిస్టులు ఎదుర్కొంటున్న నేర కేసుల్లో 60మందికిపైన ఒక్క కేసు కంటే ఎక్కువగా ఉన్నాయి. అలాగే 36మంది జర్నలిస్టులపైన అనేక కేసులు నమోదు చేస్తున్నారు. కేసుల విచారణ చేపట్టడానికి చాలా సమయం తీసుకుంటు న్నారు. అనేక రాష్ట్రాలలో జర్నలిస్టులకు శిక్షలు విధించిన కేసులే ఎక్కువగా ఉంటున్నాయి. సేకరించిన డేటాలో 244 కేసుల విచారణలో 65శాతానికి పైగా 2023 అక్టోబరు 30నాటికి కూడా పూర్తికాలేదు. 40శాతం కేసుల విషయంలో పోలీసులు తమ దర్యాప్తును ఇంతవరకు పూర్తిచేయలేదు. కేవలం 16కేసులలో మాత్రమే విచారణపూర్తిచేసి శిక్ష విధించడం, లేదా వదిలి వేయడం జరిగింది. కేసులు నమోదుచేసినప్పుడే జర్నలిస్టులపైన, వారి కుటుంబాలపైన చాలా తీవ్రమైన ప్రభావం కనిపిస్తుంది. అరెస్టులకు అవకాశం ఉంటుంది.

పోలీసులు లేదా రాజకీయ నాయకులు బెదిరించడం తప్పనిసరిగా ఉంటోంది. జర్నలిస్టులపైన నేరాలు మోపినప్పుడు వృత్తిపరమైన అవకాశాలను కోల్పోతున్నారు. ఒక జర్నలిస్టు నా కుమార్తె స్కూలులో తీవ్రమైన ఎగతాళికి గురవుతోంది. దాదాపు రెండేళ్లపాటు నా కూతురు హింసకు గురైందని చెప్పారు. భారత్‌లో జర్నలిస్టులపై కేసులు ఎల్లవేళలా విచారణను ఒకే విధంగా ఎదుర్కొంటున్నారు. ఉదాహరణకు పరువునష్టం ఆరోపణలు ఉంటున్నాయి. వీటిని ప్రభుత్వ అధికారులు కాకుండా ప్రైవేటు వ్యక్తులు విచారణ చేస్తున్నారు. పెద్దపెద్ద నగరాలలో సర్వసాధారణంగా జర్నలిస్టులపై విచారణ జరగకుండానే శిక్షలు విధిస్తున్నారు. చిన్నచిన్న పట్టణాలలో నేరాలను సర్వసాధారణంగా పేర్కొని కేసులు నమోదు చేస్తున్నారు. వార్తా సేకరణ కార్యకలాపాలలో పాల్గొనే జర్నలిస్టులపైనే ఎక్కువగా కేసులు పెడుతున్నారు.

జాతీయ స్థాయిలో జర్నలిస్టులపైన తక్కువగా కేసులునమోదవుతున్నాయి. డిజిటల్ మీడియా, సోషల్ మీడియాలో జర్నలిస్టులపై కేసులు నమోదైనప్పుడు అవి వైరల్ అవుతున్నాయి.

చర్చలకు ముందుకురాని కేంద్రం: సీపీఎం

న్యూఢిల్లీ: మావోయిస్టు అధిపతి నంబాల కేశవరావు సహా 27 మందిని ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపడాన్ని సీపీఎం తీవ్రంగా ఖండించింది. చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకుందామని కేంద్రానికి పదేపదే విజ్ఞప్తి చేసినా ముందుకు రాలేదని, ఇప్పుడు ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ప్రాణాలు తీస్తుందని విమర్శించింది. ఈ మేరకు సీపీఎం పొలిట్‌బ్యూరో గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. అటు కేంద్రం గానీ, ఇటు బీజేపీ నేతృత్వంలోని చత్తీస్‌గఢ్ ప్రభుత్వం గానీ చర్చలకు అంగీకరించడంలేదని పేర్కొంది. 'చర్చలకు ముందుకు రాకుండా 'నిర్మూలన' అనే అమానవీయ విధానాన్ని కేంద్రం అవలంబిస్తోంది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా మావోయిస్టుల అంతానికి గడువు దగ్గరపడుతోందని పదేపదే చెబుతున్నారు. మరోవైపు చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి కూడా చర్చలు అవసరం లేదంటున్నారు. ఈ ఇద్దరి తీరు ఫాసిస్టుల మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధం' అని సీపీఎం పేర్కొంది. ప్రజలు, రాజకీయ పార్టీలు చర్చలు జరపాలని విజ్ఞప్తి చేస్తున్నా ప్రభుత్వాలకు చెవికెక్కడం లేదని మండిపడింది.

పాక్ ఆయుధాలపై భారత్ ఆరా

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ వేళ పాకిస్థాన్ వందల సంఖ్యలో చిన్న డ్రోన్లు ప్రయోగించింది. వీటిల్లో కొన్నింటికి అత్యంత తక్కువదూరం ప్రయాణించే సామర్థ్యం మాత్రమే ఉంది. ఆ సమయంలో భారత భద్రతా దళాలు కొన్నింటిని పేల్చివేయగా... మరికొన్నింటిని అత్యాధునిక సాంకేతికత వినియోగించి నిర్వీర్యం చేశాయి. తాజాగా వాటి శకలాలను దళాలు సేకరిస్తున్నాయి. వీటిల్లో కొన్ని చెక్కుచెదరలేదు. వీటిల్లో చాలావరకు మే 7-10 తేదీల్లో ప్రయోగించినవే. వీటిల్లో అతి తక్కువ రేంజి కిందకు వచ్చే డ్రోన్లు ఉన్నాయి. వాటిని స్థానిక ఆపరేషన్లకు మాత్రమే వినియోగించే అవకాశం ఉంది. తక్కువ రేంజి ఉండటంతో వీటి విలువ చౌకగానే ఉంటుంది. దీంతో వీటిని ఎక్కడి నుంచి కొనుగోలు చేశారనే అంశంపై అధికారులు దృష్టిపెట్టారు. డ్రోన్ల విక్రయాలకు సంబంధించి ఈ కామర్స్ వేదికలో రికార్డులు ఉంటాయి. వీటినుంచి కొనుగోలుదారుల వివరాలు సేకరించాలని భావిస్తున్నారు. భారత సైన్యానికి చెందిన ఎయిర్ డిఫెన్స్ విభాగం చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ సుమెర్ డి కున్హా స్పందిస్తూ... దాడి కోసం 800 నుంచి 1,000 వరకు డ్రోన్లను పాక్ వాడింది. వీటిల్లో చాలావాటిని భారత ఎయిర్ గన్స్, సిస్టమ్స్ ధ్వంసం చేశాయి. మరికొన్ని 10 కిలోల పేలుడు పదార్థాలను మోసుకువచ్చాయి. వీటిని కూడా కూల్చివేశాం. ఆర్మీకి వందల సంఖ్యలో వీటి శకలాలు లభ్యమయ్యాయి. ఆపరేషన్ సిందూర్ వేళ భారత ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను పూర్తిగా ఉక్కిరిబిక్కిరి చేసి వాటి సామర్థ్యాన్ని మించేటట్లు పాక్ వందల కొద్దీ డ్రోన్లు ప్రయోగించింది. వీటిల్లో చాలావరకు చౌకబారువి ఉన్నాయి. కనీసం కెమెరా కూడా లేదు. వీటి మాటున కొన్ని నిఘా, సాయుధ డ్రోన్లు పంపింది. భారత ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల లోపాలు, సైనిక సామగ్రిని మ్యాపింగ్ చేయడం దీని ప్రధాన ఉద్దేశం. జమ్మూకశ్మీర్‌లోని బారాముల్లా నుంచి రాజస్థాన్‌లోని బర్మేర్ వరకు నాలుగు రోజులపాటు ఈ రకమైన ప్రయత్నాలు చేసింది. కొన్ని డ్రోన్లతో లైట్ డిటెక్షన్, రేంజింగ్ టెక్నాలజీని కూడా పాక్ వాడినట్లు సైన్యం చెబుతోంది.

ఐఎస్ఐతో జ్యోతికి లింకు

చండీగఢ్: పాకిస్థాన్‌కు గూఢచార్యం చేస్తుందనే ఆరోపణ నేపథ్యంలో అరెస్టయిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా కేసులో పోలీసులు విచారణను వేగవంతం చేశారు. విచారణకు సంబంధించి హర్యానా పోలీసులు గురువారం కీలక ప్రకటన చేశారు. పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్స్‌తో జ్యోతి సంప్రదింపులు జరిపారనే విషయం స్పష్టమైందని అన్నారు. కానీ ఉగ్రవాద కార్యకలాపాలు, ఆ గ్రూపులతో సంబంధాలు ఉన్నట్లుగా ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. ఆమెకు భద్రతా దళాల గురించి ఎలాంటి అవగాహన లేదని చెప్పారు. హిస్సార్ ఎస్పీ మాట్లాడుతూ పాక్ నిఘా వర్గాలకు చెందిన వ్యక్తిని జ్యోతి వివాహం చేసుకోవాలని లేదా మతం మార్చాలని అనుకున్నట్లుగా ఆమె వద్ద ఎలాంటి డాక్యుమెంట్లు లభించలేదని తెలిపారు. జ్యోతికి చెందిన మూడు మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్, వీసా ఏజెంట్ హర్కిరత్ సింగ్‌కు చెందిన రెండు మొబైల్ ఫోన్లలో డేటా రిట్రైవ్ చేసేందుకు లాబ్‌కు పంపామని ఎస్పీ వివరించారు.

భారత్ దాడులతో పాక్‌కు అంతులేని నష్టం

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ కారణంగా పాకిస్థాన్ తీవ్ర నష్టాలు చవి చూస్తోందని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. పాక్ వైమానిక దళానికి చెందిన నాలుగు ఎఫ్-16 సూపర్ సోనిక్ యుద్ధవిమానాలను భారత క్షిపణి వ్యవస్థ కూల్చి వేసింది. పాకిస్థాన్ వైమానిక దళంలో అత్యంత కీలకమైన సర్గోదా వైమానిక స్థావరం సైతం తీవ్రంగా దెబ్బతిన్నది. ఇందులోని రాడార్ వ్యవస్థ దాదాపుగా ధ్వంసమైంది. వీటికి మరమ్మతులు చేయించాలంటే దాదాపు 100 మిలియన్ డాలర్లు అవసరమవుతాయని ఆయా నివేదికలు పేర్కొన్నాయి. అయితే ఎఫ్-16 వల్ల 349.52 మిలియన్ డాలర్లు, సీ-130తో 40 మిలియన్ డాలర్లు, హెచ్‌క్యూ కారణంగా 200 మిలియన్ డాలర్లతోపాటు రెండు మొబైల్ కమాండ్ సెంటర్లు 10 మిలియన్ డాలర్ల మేర నష్టపోయాయని సోదాహరణగా ఆయా నివేదికలు వివరించాయి. భారత్ ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌పై దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో నిషేధిత జైషే మొహమ్మద్, లష్కరే తోయిబా, హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాద ప్రధాన కార్యాలయాలకు చెందిన తొమ్మిది రహస్య స్థావరాలను నేలమట్టం చేసింది. ఈ దాడుల్లో దాదాపు 100 మందికిపైగా ఉగ్రవాదులు మరణించారు. గత నెల ఇదే రోజు... అంటే ఏప్రిల్ 22వ తేదీన పహల్గాంలోని పర్యాటకులే లక్ష్యంగా ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో 26 మంది మరణించారు. ఈ ఘటనకు పాకిస్థాన్ కారణమని భారత్ ఆధారాలు సేకరించింది. పాక్‌కు వ్యతిరేకంగా భారత్ చర్యలు చేపట్టింది. అందులోభాగంగా సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ రద్దు చేసింది. పాకిస్థాన్ సైతం భారత్‌కు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంది. సిమ్లా ఒప్పందాన్ని పాక్ రద్దు చేసింది. దీంతో రెండుదేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అలాంటి వేళ భారత్... ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. అందుకు ప్రతిగా పాకిస్థాన్ భారత్ సరిహద్దుల్లోని భూభాగంపైకి డ్రోనులు, క్షిపణులతో దాడి చేసింది. ఈ దాడిలో 27 మంది భారతీయులు మరణించగా... 70 మంది గాయపడ్డారు. అనంతరం పాకిస్థాన్ దిగి వచ్చింది. రెండుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. కానీ రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు మాత్రం ఇంకా కొనసాగుతున్నాయి.

ట్రంప్ మాటల్లో నిజమెంత?

పహల్గాం దోషులను అరెస్టు చేయలేదేం?

పార్లమెంటు ప్రత్యేక సమావేశం ఎందుకు పిలవరు?

ప్రధాని మోదీకి కాంగ్రెస్ సూటి ప్రశ్నలు

ఆ బృందాలు ప్రజల దృష్టి మళ్లించే అస్త్రాలు: జైరాం రమేశ్

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ సినిమా డైలాగులు చెబుతారు కానీ భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ సంధిలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాత్రపై మాత్రం స్పష్టతివ్వరని కాంగ్రెస్ విమర్శించింది. ఉగ్రవాదాన్ని ఉపేక్షించేది లేదన్న సందేశంతో పాటు ఆపరేషన్ సిందూర్ వివరాలను తెలియజేసేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించకపోవడాన్ని ప్రశ్నించింది. విదేశాలకు పంపే దౌత్య బృందాలను 'వెపన్స్ ఆఫ్ మాస్ డిస్ట్రక్షన్ (డబ్ల్యూఎండీ) అంటే ప్రజల దృష్టిని మళ్లించే అస్త్రాలంటూ అభివర్ణించింది. అంతా తామే చేశామని ట్రంప్ చెప్పుకోవడం, సంధి కోసం వాణిజ్యాన్ని ముడిపెట్టినట్లు చెప్పుకుంటుంటే మోదీ ఎందుకు నోరు విప్పరని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ గురువారం ప్రశ్నించారు. ఆయన పీటీఐతో మాట్లాడుతూ మోదీని, ఆయన ప్రభుత్వ వైఖరిని విమర్శించారు. ఎక్స్‌లోనూ కొన్ని ప్రశ్నలు వేశారు. అమెరికా పదేపదే చెబుతుండటంలో నిజమెంతో మోదీ ప్రభుత్వం తేల్చాలన్నారు. పహల్గాం హంతకులు స్వేచ్ఛగా ఎలా తిరుగుతున్నారని ప్రశ్నించారు. ఈ దోషులకు పూంచ్, గంగన్‌గిర్, గుల్మార్గ్‌లో గత 18 నెలలుగా జరిగిన మూడు ఉగ్రదాడులతో సంబంధాలు ఉన్నాయన్న కథనాలపై స్పష్టతివ్వాలని డిమాండ్ చేశారు. అఖిలపక్ష సమావేశాన్ని ఎందుకు నిర్వహించరని, ప్రతిపక్ష పార్టీలతో సంప్రదింపులు ఎందుకు జరపరని మోదీ ప్రభుత్వాన్ని జైరాం రమేశ్ ప్రశ్నించారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించడానికి నిరాకరిస్తూ 50 మంది ఎంపీలను విదేశాలకు పంపడంలో అర్థం లేదని, ఇది అవనవసర ప్రయాస అని ఆయనన్నారు. 'భారత్, పాకిస్థాన్ వద్ద 'వెపన్స్ ఆఫ్ మాస్ డిస్ట్రక్షన్' డబ్ల్యూఎండీలు (మారణాయుధాలు) ఉన్నాయి. భారత్ వద్ద మరొక డబ్ల్యూఎండీ... ప్రజల దృష్టిని మళ్లించే అస్త్రం ఉంది. ఎంపీల బృందాలను విదేశాలకు పంపడం 'డబ్ల్యూఎండీ' (వెపన్ ఆఫ్ మాస్ డిస్ట్రాక్షన్) కసరత్తే' అని జైరాం రమేశ్ దుయ్యబట్టారు. గతంలో హౌడీ మోదీ, నమస్తే ట్రంప్ జరిగాయి. అప్పట్లో పెద్దఎత్తున ప్రచారం చేసుకున్నారు. వాణిజ్యాన్ని అడ్డుపెట్టి భారత్, పాకిస్థాన్ మధ్య సయోధ్య కుదిర్చినట్లు ట్రంప్ చెబుతుండటాన్ని మోదీ తోసిపుచ్చరేం. అమెరికా మంత్రి రూబియో... రెండు దేశాల మధ్య న్యూట్రల్ సైట్' (తటస్థ స్థలి)లో చర్చలు జరుగుతాయన్నారు. న్యూట్రల్ సైట్ అంటే ఏమిటి? డొనాల్డ్ భాయికి మంచి మిత్రుడు మౌనం వీడరెందుకు? విదేశాంగ శాఖ మౌనానికి కారణమేమిటి? అని జైరాం రమేశ్ సూటిగా ప్రశ్నించారు. 'ఆపరేషన్ సిందూర్‌ను ఆకస్మికంగా ఆపేయడం, దాని పూర్తి ప్రభావంపై స్పష్టతివ్వకపోవడంతో అనేక ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. కార్గిల్ కమిటీ తరహా కసరత్తుతోనే దీనిపై స్పష్టత సాధ్యమవుతుంది. కార్గిల్ యుద్ధం ముగిసిన మూడు రోజులకు అప్పటి వాజ్‌పేయి ప్రభుత్వం కార్గిల్ రివ్యూ కమిటీని 1999, జులై 29న ఏర్పాటు చేసింది. ఆ కమిటీ నివేదికను 2000, ఫిబ్రవరి 23న పార్లమెంటు ముందుర ఉంచింది. ఆపరేషన్ సిందూర్ విషయంలోనూ చేయాల్సినది అదే' అని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఎంపీ ప్రణీతి షిండే పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జాతీయ భద్రత, దౌత్యం, అంతర్గత సుస్థిరత వంటి కీలక అంశాల స్థాయిని కేవలం డొల్ల ప్రచారాలకు, ఫొటోలకు అవకాశంగా మోదీ ప్రభుత్వం దిగజార్చిందన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత ప్రధాని దృష్టి మొత్తం ప్రచారంపైనే ఉన్నదని, ఆత్మస్తుతికే ఆయన పరిమితమయ్యారని విమర్శించారు. ప్రభుత్వం నుంచి ప్రజలు సమాధానాలు కోరుకుంటున్నారన్నారు. పహల్గాం దోషులను ఎందుకు అరెస్టు చేయలేదో చెప్పాలన్నారు. అంతా తామే చేసినట్లు ట్రంప్ చెప్పుకుంటుంటే మోదీ మౌనం వీడాలని షిండే డిమాండ్ చేశారు.

'దౌత్య మార్గంలోనే రాజీ కుదిరింది'

భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణపై జైశంకర్

న్యూఢిల్లీ: భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలకు తెర దించి, కాల్పుల విరమణకు సంధి కుదుర్చినట్లు అమెరికా పెద్దఎత్తున ప్రచారం చేసుకుంటున్న వేళ విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్, పాకిస్థాన్ మధ్య దౌత్య మార్గంలో ప్రత్యక్ష చర్చల ద్వారా రాజీ కుదిరిందని ఆయన వెల్లడించారు. భవిష్యత్‌లో ఉగ్రదాడులు జరిగితేగనుక పహల్గాం తరహా ప్రతిస్పందనే ఉంటుందని, పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ మళ్లీ భీకర దాడులు చేస్తుందని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ ముగియకపోవడానికి కారణమిదే అన్నట్లు సంకేతమిచ్చారు. నెదర్లాండ్స్, డెన్మార్క్, జర్మనీ పర్యటనలో భాగంగా ది హేగ్‌లో ఉన్న జైశంకర్... డచ్ బ్రాడ్‌కాస్టర్ ఎన్‌ఓఎస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. రెండు దేశాల మధ్య ఘర్షణ నెలకొన్నప్పుడు ప్రపంచ దేశాలు స్పందించడం, సమస్య పరిష్కారానికి సూచనలు చేయడం సహజమేనని చెప్పారు. అయితే కాల్పుల విరమణ, సైనిక చర్య వంటివి భారత్, పాకిస్థాన్ ప్రత్యక్ష చర్చల్లో తీసుకున్న నిర్ణయాలన్నారు. 'మాతో మాట్లాడిన అమెరికాకే కాదు ప్రతి దేశానికి ఒక విషయాన్ని చాలా స్పష్టంగా చెప్పాం. పాకిస్థాన్‌లు ఘర్షణ ముగించాలని భావిస్తే వాళ్లే స్వయంగా మాతో చెప్పాలి. వాళ్ల నోటి నుంచి ఆ మాట రావాలి. పాకిస్థాన్ ఆర్మీ జనరల్ మా జనరల్‌కు ఫోన్ చేసి ఘర్షణ ముగించమని అడగాలి అని చెప్పాం. చివరకు అదే జరిగింది' అని జైశంకర్ అన్నారు. పహల్గాం దాడి క్రూరత్వానికి నిదర్శనమన్నారు. అందుకు దీటైన ప్రతిస్పందన అనివార్యమని చెప్పారు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌పై, ఉగ్రవాదంపై పాకిస్థాన్‌తో చర్చించడానికి భారత్ సిద్ధంగా ఉందని జైశంకర్ తెలిపారు. ఆర్థిక వృద్ధి, భద్రత అన్నవి ఒకే నాణేనికి రెండు పక్కలని ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. యూరప్‌తో పోల్చుకుంటే భారత్ ఎదుర్కొనే భద్రతాపరమైన సవాళ్లు తీవ్రంగా ఉంటాయి కాబట్టే భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తామని జైశంకర్ తెలిపారు. భద్రతా, ఆర్థిక సమృద్ధి మధ్య ఏదో ఒకదానిని ఎంపిక చేసుకోలేమని, అవి ఒకే నాణేనికి రెండు పక్కలని అన్నారు.

పహల్గాం వెలవెల

ఉగ్రదాడికి నెల: ఉపాధి లేక స్థానికుల కష్టాలు

ఆదుకోవాలని ప్రభుత్వానికి వేడుకోలు

పహల్గాం: జమ్మూకశ్మీర్, పహల్గాం వెలవెలబోతోంది. పర్యాటకుల సందడి లేక అక్కడి సుందర క్షేత్రాలన్నీ బోసిపోయాయి. పర్యాటక కేంద్రాలన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఉపాధి లేక స్థానికులు కష్టాల్లో పడ్డారు. ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఉగ్రదాడి జరిగి గురువారానికి ఒకనెల అయింది. నాటి భయానక పరిస్థితులు, అనంతర పరిణామాలతో పర్యాటకులు రాక... ఉపాధి లేక పహల్గాం కళతప్పింది. ఇప్పుడిప్పుడే పరిస్థితులు సాధారణ స్థాయికి చేరుకుంటున్నాయి. నెల రోజులుగా ఉపాధి లేక స్థానికులు, తమకు జరిగిన నష్టాన్ని అంచనా వేసుకుంటున్నారు. ఒకప్పుడు పర్యాటకులతో కళకళలాడే పహల్గాం నిర్మానుష్యంగా మారిందని స్థానిక దుకాణదారులు, వీధివిక్రేతలు, గుర్రాలు నడిపేవారు, క్యాబ్ డ్రైవర్లు, హోటళ్ల యజమానులు దిగాలు పడుతున్నారు. 1990 నుంచి ఇలాంటి పరిస్థితి ఎన్నడూ చూడలేదని టూర్ ఆపరేటర్ నసీర్ అహ్మద్ అన్నారు. బయట వారు రాకపోయినా స్థానిక (కశ్మీరీలు) పర్యాటకులతో ఆర్థికంగా నిలద్రొక్కుకోగలిగేవారము కానీ ఇప్పుడు ఆ పరిస్థితి కూడా లేదన్నారు. ఈ కష్టాలను మరింత కాలం ఎదుర్కొనే పరిస్థితుల్లో లేమని చిరు వ్యాపారులు, గుర్రాలు నడిపేవారు వాపోయారు. ప్రభుత్వం సత్వరమే స్పందించాలని, తమ కోసం ఏదో ఒకటి చేయాలని, లేకపోతే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని తీవ్రస్థాయిలో ఆవేదన వ్యక్తంచేశారు.

కేరళను వణికిస్తున్న కరోనా మహమ్మారి

ఈనెలలో 182 కేసులు

తిరువనంతపురం : కరోనా మళ్లీ విజృంభిస్తోంది. ఈ మహమ్మారి కేరళకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. రోజురోజుకు కోవిడ్ కేసులు పెరుగుతుండడంతో.. ఆ రాష్ట్ర అధికార యంత్రాంగం ఆందోళనకు గురవుతోంది. ఈ నెలలో ఇప్పటి వరకు 182 కోవిడ్ కేసులు నమోదయ్యాయని ఆ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి వీణా జార్జ్ వెల్లడించారు. అత్యధికంగా కొట్టాయం జిల్లాలో 57 కేసులు నమోదైనట్లు తెలిపారు. ఎర్నాకుళంలో 34, తిరువనంతపురంలో 30 కేసులు ఉన్నట్లు చెప్పారు. కేరళలో కొవిడ్ కేసుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జలుబు, దగ్గు, శ్వాస సంబంధిత లక్షణాలతో బాధపడేవారు తప్పసరిగా మాస్క్ ధరించాలని వీణా జార్జ్ సూచించారు. మరోవైపు మహారాష్ట్రలో జనవరి నుంచి ఇప్పటివరకు నమోదైన కోవిడ్ కేసుల్లో ఇద్దరు మరణించినట్లు ఆ రాష్ట్ర ఆరోగ్యశాఖ ప్రకటించిన విషయం విదితమే. మొత్తం 6,066 స్వాబ్ టెస్ట్‌లు చేయగా, 106 కేసులు పాజిటివ్‌గా తేలినట్టు చెప్పింది. వీరిలో 101 మంది ముంబైకి చెందిన వారు కాగా, మిగిలిన వారు పుణె, థానే, కొల్హాపూర్ వారుగా పేర్కొంది. ప్రస్తుతం రాష్ట్రంలో 52 కేసులు పాజిటివ్ కేసులు ఉన్నట్లు, వారిలో 16మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లుగా ఆరోగ్యశాఖ వెల్లడించింది.

పాక్‌కు ఉగ్రవాదం ఆపమని చెప్పండి

టర్కీకి భారత్ హితవు

న్యూఢిల్లీ: పాకిస్థాన్‌కి టర్కీ మద్దతు ఇవ్వడంపై భారత విదేశాంగ శాఖ గురువారం స్పందించింది. పాకిస్థాన్ నుంచి వస్తున్న సీమాంతర ఉగ్రవాదాన్ని పరిష్కరించడానికి టర్కీ పనిచేయాలని భారత్ ఆశిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఉగ్రవాదాన్ని దేశ విధానంగా ఉపయోగించుకోకుండా పాకిస్థాన్‌ని నిరోధించడానికి, దశాబ్దాలుగా ఆశ్రయం ఇస్తున్న ఉగ్రవాద ఎకో సిస్టమ్‌పై విశ్వసనీయమైన, ధ్రువీకరించదగిన చర్యలు తీసుకోవాలని టర్కీని కోరింది. 'పాకిస్థాన్ సీమాంతర ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వడం మానేయాలని, దశాబ్దాలుగా అది పెంచి పోషిస్తున్న ఉగ్రవాద పర్యావరణ వ్యవస్థపై విశ్వసనీయమైన, ధృవీకరించదగిన చర్యలు తీసుకోవాలని టర్కీ గట్టిగా కోరుతుందని మేము ఆశిస్తున్నాం. సంబంధాలు ఒకరి ఆందోళనలకు మరొకరి సున్నితత్వంపై ఆధారపడి ఉన్నాయి' అని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వారాంతపు మీడియా సమావేశంలో అన్నారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత టర్కీ, పాకిస్థాన్‌కి మద్దతు ఇచ్చింది. భారత్‌పై దాడి చేయడానికి పాకిస్థాన్ టర్కీ తయారీ డ్రోన్లు ఉపయోగించింది. ఇదేకాకుండా, వీటిని ఆపరేట్ చేయడానికి ఇద్దరు టర్కీ వ్యక్తుల్ని నియమించింది. అయితే, భారత్ జరిపిన దాడుల్లో టర్కీ డ్రోన్లు ధ్వంసం కావడంతో పాటు ఇద్దరు వ్యక్తులు కూడా మరణించారు. దీంతో భారత్, టర్కీ మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. టర్కీ నుంచి దిగుమతి అయ్యే ఆపిల్స్‌ని భారత వ్యాపారులు కొనడం లేదు. దీంతో పాటు టర్కీకి వెళ్లే పర్యాటకుల సంఖ్య చాలా తగ్గింది. విమానాశ్రయం గ్రౌండింగ్ సేవలు అందించే టర్కీకి చెందిన సంస్థ సెలిబి అనుమతిని రద్దు చేసింది.

చొరబాటుకు 50 మంది ఉగ్రవాదుల యత్నం

సమర్థంగా తిప్పికొట్టాం: బీఎస్ఎఫ్

శ్రీనగర్: ఆపరేషన్ సిందూర్ జోరుగా జరుగుతున్న వేళ పెద్ద సంఖ్యలో ఉగ్రమూకను భారత్‌లోకి పంపేందుకు పాక్ విశ్వప్రయత్నం చేసింది. ఈ విషయాన్ని సరిహద్దు భద్రతాదళం (బీఎస్ఎఫ్) ధ్రువీకరించింది. మే 8వ తేదీన 45-50 మంది ఉగ్రవాదులను సరిహద్దులు దాటించి భారత్‌లోకి పంపించేందుకు పాక్ దళాలు తీవ్రంగా ప్రయత్నించాయి. ఇందుకోసం భారీగా కాల్పులు చేపట్టినట్లు పేర్కొన్నాయి. బీఎస్ఎఫ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎస్ఎస్ మండ్ ఓ ఆంగ్ల వార్తా సంస్థతో మాట్లాడుతూ... 'మా జవాన్లు వారికి తీవ్రస్థాయిలో నష్టం కలిగించారు. పెద్ద ఎత్తున ఉగ్రవాదులు సరిహద్దులు దాటేందుకు వస్తున్నట్లు మా వద్ద ముందే సమాచారం ఉంది. వారి కోసం కాచుకు కూర్చొని... గుర్తించగానే దాడులు నిర్వహించాం. ఆ గ్రూపులో దాదాపు 45-50 మంది వరకు ఉన్నారు. వారు మా వైపునకు వచ్చారు. అదును చూసి వారిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాం. మేము ఊహించినట్లే తమ పోస్టుల నుంచి వారు భారీస్థాయిలో కాల్పులు మొదలుపెట్టారు. మేము అత్యంత కచ్చితత్వంతో కాల్పులు జరిపాం. దీంతో వారు తమ పోస్టులు వదిలేసి పారిపోయారు. దాదాపు గంటన్నరలోనే వారికి మేము బుద్ధి చెప్పాం. వారి బంకర్లు, ఆయుధాలు ధ్వంసం చేశాం. వారు మరోసారి వస్తే పదింతల శక్తితో తిప్పికొట్టేందుకు మా జవాన్లు సిద్ధంగా ఉన్నారు. ఇందుకు సంబంధించి బీఎస్ఎఫ్‌కు స్పష్టమైన ఆదేశాలున్నాయి. బీఎస్ఎఫ్‌లోని మహిళా జవాన్లు కూడా పురుషులతో సమానంగా శత్రువులపై పోరాడే బాధ్యతలు నిర్వహించారు. వారిని చూస్తే మాకు గర్వంగా ఉంది' అని డీఐజీ వెల్లడించారు.

పహల్గాంకు ముందు ఢిల్లీలో ఉగ్రదాడికి

పాక్ ఐఎస్ఐ కుట్ర

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఘటన కంటే కొన్ని వారాల ముందే ఢిల్లీలో ఓ భారీ ఉగ్రదాడికి పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ కుట్ర పన్నినట్లు తాజాగా బయటికొచ్చింది. నేపాల్ గూఢచారితో ఐఎస్ఐ పన్నిన ఈ కుట్రను భారత నిఘా సంస్థలు సీక్రెట్ ఆపరేషన్‌తో భగ్నం చేశాయి. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. భారత సాయుధ దళాలకు సంబంధించిన రహస్య పత్రాలు, కీలక ప్రదేశాల ఫొటోలు సేకరించడం కోసం పాక్ ఐఎస్ఐ తమ గూఢచారిని నేపాల్ మీదుగా ఢిల్లీకి పంపించినట్లు ఈ ఏడాది జనవరిలో ఇంటెలిజెన్స్ ఏజెన్సీలకు సమాచారం వచ్చింది. అదే సమయంలో ఢిల్లీ పోలీసులకు ఓ పాకిస్థానీ ఏజెంట్ గురించి సమాచారం అందింది. దీంతో కేంద్ర సంస్థలతో కలిసి ఢిల్లీ పోలీసులు సీక్రెట్ ఆపరేషన్ ప్రారంభించారు. అప్పటికే నేపాల్ జాతీయుడైన ఆ గూఢచారి అన్సారుల్ మియాన్ అన్సారీ ఢిల్లీ చేరుకొని, కొన్ని మిలిటరీ డాక్యుమెంట్లు సంపాదించాడు. ఫిబ్రవరి 15న ఢిల్లీలోని ఓ హోటల్‌లో అన్సారీని పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. నేపాల్ మీదుగా పాకిస్థాన్ తిరిగివెళ్లేందుకు అన్సారీ ప్రయత్నిస్తుండగా పోలీసులకు చిక్కాడు. అన్సారీకి సాయం చేసిన రాంచీకి చెందిన అజామ్ అనే వ్యక్తిని కూడా పట్టుకున్నారు. వీరిద్దరూ పాక్‌లోని ఐఎస్ఐ హ్యాండ్లర్లతో నిరంతరం సంప్రదింపులు జరిపినట్లు గుర్తించారు. వీరిద్దరిని తీహార్ జైలుకు తరలించి విచారించారు. ఈ విచారణలో ఐఎస్ఐ గూఢచర్యం చేసే నెట్‌వర్క్ గురించి అన్సారీ కీలక విషయాలు వెల్లడించినట్లు తెలుస్తోంది. నేపాల్‌కు చెందిన ఇతడు ఖతార్‌లో క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా ఐఎస్ఐకు చెందిన ఓ వ్యక్తితో పరిచయం ఏర్పడింది. అతడు అన్సారీని పాకిస్థాన్‌కు తీసుకెళ్లాడు. అక్కడ అతడికి కొన్ని రోజుల పాటు శిక్షణ ఇచ్చి ఢిల్లీ పంపించినట్లు విచారణలో తేలింది. అనంతరం అజామ్‌తో కలిసి మిలిటరీకి సంబంధించిన రహస్య సమాచారాన్ని సేకరించినట్లు అన్సారీ దర్యాప్తులో అంగీకరించినట్లు తెలుస్తోంది. దీనిపై మరింత లోతుగా విచారిస్తున్నట్లు ఢిల్లీ పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీలో ఐఎస్ఐ సెల్‌ను పట్టుకోవడంతో భారీ ఉగ్ర కుట్ర తప్పిందంటూ నిఘా వర్గాలు పేర్కొన్నాయి.

ఢిల్లీలో వర్ష బీభత్సం... ఆరుగురి మృతి

నేలకూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

విరిగిపడిన బ్రిడ్జి గ్రిల్... కూలిన బాల్కనీలు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో బుధవారం రాత్రి వర్ష బీభత్సానికి తోడు ఇసుక తుపాను అతలాకుతలం చేసింది. ఈ ప్రకృతి విపత్తుకు ఢిల్లీ-ఎన్సీఆర్ ప్రాంతంలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది గాయపడ్డారు. ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన కుండపోత వర్షం పడింది. నగరం మొత్తం అతలాకుతలమైంది. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. ఇళ్లు, వాహనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. నిజాముద్దీన్ సమీపంలోని లోధి రోడ్ ఫ్లైఓవర్ సమీపంలో ఓ విద్యుత్ స్తంభం కూలి బైక్‌పై వెళ్తున్న ఓ దివ్యాంగుడిపై పడింది. దీంతో స్థానికులు వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించగా... మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈశాన్య ఢిల్లీలోని గోకుల్‌పురిలో ఓ చెట్టు కూలిపోవడంతో అజార్ (22) అనే వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఢిల్లీ సమీపంలోని ఘజియాబాద్‌లో వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు మరణించారు. గ్రేటర్ నోయిడాలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఈ వర్షం కారణంగా సంభవించిన ఘటనల్లో 11 మంది గాయపడ్డారు. ముఖర్జీ నగర్‌లోని పాత ఓవర్‌బ్రిడ్జి గ్రిల్ కొంత భాగం విరిగిపడింది. ఈ ఘటనలో ఆరుగురు గాయపడ్డారు. కాశ్మీరీ గేట్ ప్రాంతంలో బాల్కనీ కూలిపోవడంతో 55 ఏళ్ల వ్యక్తి గాయపడ్డాడు. మంగోల్‌పురిలో బాల్కనీ కూలిపోవడంతో ఒక మహిళతో సహా నలుగురు గాయపడ్డారు.

పంజాబ్, హర్యానా హైకోర్టుకు బాంబు బెదిరింపు

చండీగఢ్: పంజాబ్, హర్యానా హైకోర్టుకు గురువారం మధ్యాహ్నం బాంబు బెదిరింపు వచ్చింది. కోర్టులో బాంబు ఉందంటూ ఈ-మెయిల్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన సిబ్బంది ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా కోర్టు రూమ్‌లను ఖాళీ చేయించారు. పోలీసులతోపాటు సహాయక బృందం, అగ్నిమాపక సిబ్బంది హైకోర్టుకు చేరుకుని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానం వచ్చిన వస్తువును పరిశీలించారు. న్యాయవాదులంతా కోర్టు ఆవరణను విడిచి వెళ్లాలని బార్ అసోసియేషన్ కోరింది. పరిసరాల్లో అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులు కనిపించినా వెంటనే పోలీసు లేదా బార్ అసోసియేషన్‌కు సమాచారం అందించాలని తెలిపింది. బెదిరింపుల నేపథ్యంలో కోర్టు కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేశారు. కాగా, అంబాలా రైల్వే స్టేషన్‌కు కూడా ఇదేవిధమైన బాంబు బెదిరింపు వచ్చినట్లు తెలుస్తోంది. గురుగ్రామ్ మినీ సెక్రటేరియట్‌కు బాంబు బెదిరింపు వచ్చింది. దీంతో సెక్రటేరియట్‌ను ఖాళీ చేయించిన అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి అనుమానాస్పద వస్తువు లభించకపోవడంతో అది ఫేక్ అని నిర్ధారించారు.

విశాలాంధ్ర హైదరాబాద్

మంత్రి సీతక్కను సన్మానించిన దివ్యాంగ సంఘం నాయకులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : 10 సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న సమస్యను పరిష్కరించిన సీతక్కకు దివ్యంగ సంఘాల నాయకులు సన్మానం చేశారు. గురువారం సచివాలయంలో పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్కను పలు దివ్యాంగ సంఘాల ప్రతినిధులు సన్మానించడం జరిగింది. దివ్యాంగుల వివాహాలకు లక్ష రూపాయల వివాహ కానుకను అమలు చేసినందుకు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలిపారు. దివ్యాంగుల సంక్షేమం, ఉన్నతి కోసం మరిన్ని పథకాలు అమలు చేసేందుకు కృషి చేస్తామని మంత్రి సీతక్క వెల్లడిరచారు. ఆర్టీసీ బస్సులు దివ్యాంగులకు ఉచిత రవాణా అంశము ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. అర్హుల జాబితాలో దివ్యాంగులుంటే, వారి పేరు మీద ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసేలా నిబంధనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించాలని మహిళా సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్‌కు ఆదేశాలు జారీ చేశారు. దివ్యాంగుల పేరు పైన ఇద్దరమ్మ ఇంఢ్ల మంజూరు, ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే అంశాలను సంబంధిత శాఖ మంత్రులతో, ప్రభుత్వంతో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. దివ్యాంగ సమస్యలను పరిష్కరిస్తున్న మంత్రి సీతక్కకు దివ్యాంగ సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు ధ్యెనంపల్లి మల్లికార్జున్, వికలాంగుల హక్కుల కార్యకర్త రాజేందర్‌తో పాటు వ్యంగ సంఘాల ప్రతినిధులు ఉన్నారు.

తెలంగాణ తొలి సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ

విశాలాంధ్ర - హైదరాబాద్ : అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన గొప్ప సంఘ సంస్కర్త మాదరి భాగ్యరెడ్డి వర్మ అని హైదరాబాద్ అదనపు కలెక్టర్ కదిరవన్ పలని అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మాదరి భాగ్యరెడ్డి వర్మ 137 జయంతి ఉత్సవంలో ఆయన పాల్గొని భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ దళిత సమాజోద్ధరణ, అంటరానితనం, మహిళల బాలికల విద్య కోసం ఎంతో కృషి చేశారని జోగిని వ్యవస్థను తొలగించడానికి పాటపడ్డారని అన్నారు. ఈ సమావేశంలో షెడ్యూల్ కులాల ఉపసంచాలకులు డాక్టర్ రమేష్, డిటిడబ్ల్యూఓ ఆర్. కోటజి, ఎస్ఈఎం జ్యోతి, లా ప్రొటెక్షన్ ఆఫీసర్, డిప్యూటీ కలెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆనంద్ బాగ్ శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో వేంచేసి ఉన్న శ్రీ సంకట విమోచన ఆంజనేయస్వామి వారి కి గురువారం ఉదయం ప్రభాత ఆరాధన, అనంతరం వివిధ ఫల రసాలతో, పంచామృత, సింధూరాభిషేకం ను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు అని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ బి రవీంద్ర రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రదానా అర్చకులు ముడంబై వెంకట రమణాచార్యులు, అర్చకులు తులసి వెంకట రమణా చార్యులు ఆధ్వర్యంలో అభిషేకం అనంతరం విశేష అలంకరణ, లక్ష తమలపాకులతో అర్చన కార్యక్రమంను నిర్వహించారు. అనంతరం స్వామి వారికి మహనివేదన, హారతి మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించారు. పూజలో పాల్గొన్న భక్తులకు స్వామివారి ఫల ప్రసాదంను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ క్లర్క్ సంద్ర సుధాకర్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సానాది శంకర్, హేమంత్ కుమార్, సంజయ్, భక్తులు కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - మల్కాజిగిరి : హనుమాన్ జయంతి వేడుకలను పురస్కరించుకొని గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జున నగర్ మల్లన్న దేవాలయం న్యూ మిర్జాలగూడలో గల హనుమాన్ దేవాలయంతో పాటు పలు ప్రాంతాలలో హనుమాన్ జయంతి వేడుకలు గురువారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. ప్రత్యేక పూజలు హెూమాలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రాము యాదవ్ పాల్గొన్నారు.

అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమీషనర్ రాజు ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులతో సమన్వయ కమిటి సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఎం.డి.ఎ, ఇరిగేషన్, వాటర్ వర్క్స్, శానిటైజషన్, ఎంతోమలజీ, ఇంజనీరింగ్, స్ట్రీట్ లైట్స్, టౌన్ ప్లానింగ్ తదితర అధికారులు పాల్గొన్నారు. దీనిలో భాగంగా సఫిలగూడ చెరువు చుట్టూ ఉన్న పరిస్థితులను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా సఫిలగూడ చెరువు సమగ్ర అభివృధికి ప్రణాళిక రూపొందించారు. చెరువు చుట్టూ బండ్ నిర్మాణం చేసి, స్టీల్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయడం, లైట్స్, గ్రీనరీ, టాయిలెట్స్ నిర్మాణం, గుర్రపు డెక్క తొలగింపు, మురుగునీటి డైవర్షన్ వాటర్, బేబీ పాండ్ అభివృద్ధి చేయడానికి అధికారులు నిర్ణయించారు. ప్రతిపాదనలు సిద్ధం చేసి ఆయా శాఖలపై అధికారులకు పంపి పనులు ఆమోదం పొందే విధంగా చూడాలని సమావేశం నిర్ణయించింది. మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్, ఈ.ఈ లక్ష్మణ్, డి.ఈ మహేష్, ఏ.ఈ నవీన్, జల మండలి జనరల్ మేనేజర్ సునిల్, రాజు, ఆశ్రీత, నవీన్, ఏ.ఎం.ఓ.హెచ్ మంజుల, ఇరిగేషన్ డి.ఈ కనిష్క, హెచ్.ఎం.డి.ఏ ఏ.ఈ శివారెడ్డి, ఎంటమాలజి ఏ.ఈ. ఈ.వనజ పాల్గొన్నారు.

రాష్ట్రంలో రైల్వే అభివృద్ధికి సహకరించండి

కేంద్ర ప్రభుత్వానికి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి విజ్ఞప్తి

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో పరుగులు పెడుతున్న అభివృద్ధికి అనుగుణంగా రైల్వే వ్యవస్థ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణంగా సహకరించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా పునరాభివృద్ధి చెందిన వరంగల్ రైల్వే స్టేషన్ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా "వీడియో కాన్ఫరెన్సింగ్ మాధ్యమం" ద్వారా ప్రారంభమైన కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత్ పథకం ద్వారా తెలంగాణలోని మూడు రైల్వే స్టేషన్లను ఎంపిక చేసి గురువారం వరంగల్ రైల్వేస్టేషన్‌ను దేశంలోని 103 రైల్వే స్టేషన్లతో పాటు వర్చువల్‌గా ప్రారంభిస్తున్న ప్రధాన మంత్రి మోదీకి అభినందనలు తెలియజేశారు. ప్రపంచంలోని ముఖ్య నగరాలకు ధీటుగా హైదరాబాద్ మహానగరం అభివృద్ధి చెందుతుంది. వరంగల్ జిల్లాను కూడా అలా అభివృద్ధి చేయాలన్నదే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇటు సౌత్ సెంట్రల్ రైల్వేకి, అటు నార్త్ సెంట్రల్ రైల్వేకి మధ్యగా ఉన్న కాజీపేట రైల్వేస్టేషన్‌ను డివిజన్‌గా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. రూ. 24,500 కోట్ల వ్యయంతో 76 కిలోమీటర్ల పరిధిలో రెండో విడత హైదరాబాద్ మెట్రో నిర్మాణ పనులను చేపట్టేందుకు వీలైనంత త్వరగా అనుమతులతో పాటు నిధులను విడుదల చేయాలని కోరారు. రీజనల్ రింగ్ రోడ్‌కు సమాంతరంగా రైల్వేలైన్ మంజూరు చేయాలని కోరారు. వికారాబాద్ - కృష్ణా మధ్య రైల్వేలైన్, కల్వకుర్తి - మాచర్ల రైలు మార్గాన్ని మంజూరు చేయాలని డోర్నకల్ - మిర్యాలగూడ (పాపటపల్లి- జాన్ పహాడ్), డోర్నకల్ - గద్వాల ప్రతిపాదిత రైలు మార్గాలను పునఃపరిశీలించాలని కోరారు.

ఆలస్యంగా వచ్చిన సిబ్బందిపై చర్యలు

ప్రతి ప్రధాన కార్యాలయాల్లో ఫేస్ రికగనైజేషన్‌తో బయోమెట్రిక్ ఏర్పాటు చేయాలి

మార్కెటింగ్ శాఖ ప్రధాన కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి తుమ్మల

విశాలాంధ్ర - హైదరాబాద్ : విధులకు అలస్యంగా హజరయ్యే సిబ్బందిపై చర్యలు తప్పవని రాష్ట్రయ వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హెచ్చరించారు. గురువారం నాడు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల బిఆర్‌కె భవన్‌లోని మార్కెటింగ్ శాఖ ప్రధాన కార్యాలయంలో అకస్మాత్తుగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా, కార్యాలయానికి ఆలస్యంగా హాజరైన అధికారులపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి, ఆలస్యంగా వచ్చిన సిబ్బంది మీద వెంటనే మెమో ఇచ్చి, సంజాయిషీ తీసుకోవాల్సిందిగా మార్కెటింగ్ డైరెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు మార్కెటింగ్ డైరెక్టర్ మొత్తం 53 మంది రెగ్యులర్ సిబ్బందిలో 16 మంది ఆలస్యంగా హాజరయ్యారని, 42 ఔట్ సోర్సింగ్ సిబ్బందిలో 5గురు మాత్రమే ఆలస్యంగా హాజరయ్యారని వారికి మెమో జారీ చేశామని తెలిపారు. దీనికి మంత్రి మార్కెటింగ్ డైరెక్టర్‌కి వెంటనే ఫేస్ రికగనైజేషన్‌తో బయో మెట్రిక్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇకపై ఆలస్యాన్ని వచ్చిన అధికారులు, అందుబాటులో లేని అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని డైరెక్టర్‌ని ఆదేశించారు. ప్రతిరోజు సిబ్బంది హాజరు పట్టికను మంత్రి ఆఫీసుకు పంపాల్సిందిగా ఆదేశించారు.

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలపై దిశా నిర్దేశం

విశాలాంధ్ర - హైదరాబాద్ : జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలని ఉన్నతాధికారులను సిఎస్ ఆదేశించారు. ఈ వేడుకలకు కావలసిన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు గురువారం ఉన్నతాధికారులతో డా.బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో సమావేశమై సమీక్షించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు సీఎస్ తెలిపారు. ముఖ్యమంత్రి ముందుగా గన్‌పార్క్‌ను సందర్శించి తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించిన అనంతరం పరేడ్ గ్రౌండ్ వేడుకల్లో పాల్గొంటారని వెల్లడించారు. ఈ సందర్భంగా పరేడ్ గ్రౌండ్ వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు సీఎస్ దిశానిర్దేశం చేశారు. ఈ వేడుకల ఏర్పాట్లపై ప్రతి శాఖ నుంచి ఒక నోడల్ అధికారి నియమించి సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రముఖులు ప్రయాణించే మార్గాలలో అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా పరేడ్ గ్రౌండ్‌కు వచ్చే వాహనాలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేసి ట్రాఫిక్ రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు శాఖను ఆదేశించారు. వర్షాలను దృష్టిలో పెట్టుకొని వాటర్ ప్రూఫ్ షామియానాలు, బారికేడిరగ్, సైనేజెస్ ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ శాఖను ఆదేశించారు. సభా ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణతో పాటు తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పండుగ వాతావరణాన్ని తలపించేలా కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సాంస్కృతిక శాఖను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని దీంతో పాటు జనరేటర్ బ్యాకప్ కూడా ఏర్పాటు చేయాలని విధ్యుత్ శాఖకు సూచించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విస్తృతంగా ప్రచారం చేసేందుకు లైవ్ టెలికాస్ట్ ఏర్పాట్లు చేయాలని సమాచార శాఖ కమిషనర్‌ను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఈ సమావేవంలో డీజీపి జితేందర్, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్, సమాచార పౌర సంబంధాల కమిషనర్ హరీష్, జలమండలి ఎండి అశోక్ రెడ్డి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సి.వి. ఆనంద్, ఇతర పోలీసు ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిలోఫర్ ఆసుపత్రి క్యాంపస్‌లో నిర్మాణాలకు అనుమతి ఇవ్వలేదు : కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : నిలోఫర్ దవాఖానాలోని పార్క్ స్థలంలో నిర్మాణాలు చేపట్టేందుకు ప్రైవేట్ వ్యక్తులు ఎవరికి ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఒక ప్రకటనలో తెలిపారు. నిలోఫర్ ఆస్పత్రి సూపరిండెంట్ ఆస్పత్రి స్థలంలో ప్రైవేట్ మెడికల్ షాప్ నిర్మాణం కోసం డీఎంఈ, హైదరాబాద్ కలెక్టర్ నుండి అనుమతులు తీసుకున్నామని తెలియజేసినట్లు తన దృష్టికి వచ్చిందని అనుమతి ఇచ్చినట్లు సూపరిండెంట్ తెలియజేయడం అవాస్తవమని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరైనా నిలోఫర్ ఆస్పత్రిలోని స్థలంలో నిర్మాణాలు చేపడితే సంబంధిత వ్యక్తులు, అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

ఎల్బీనగర్ జోన్‌లో పర్యటించిన కమిషనర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఎల్బీనగర్ జోన్‌లో పలు అభివృద్ధి పనులను గురువారం జీహెచ్ఎంసీ కమీషనర్ ఆర్.వి.కర్ణన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎల్బీనగర్ జోన్‌లోని సరూర్‌నగర్ సర్కిల్‌లో పలు అభివృద్ధి పనులు పరిశీలించారు. వెంకటేశ్వర కాలనీకి వెళ్లగా ఆ కాలనీకి చెందిన రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కమిషనర్‌ను కలిసి కాలనీకి సంబంధించి సమస్యలు వివరించగా వెంటనే పరిష్కరించాలని జోనల్, డిప్యూటీ కమిషనర్‌లను ఆదేశించారు. గడ్డిఅన్నారం డివిజన్‌లో బాక్స్ డ్రెయిన్ పనులను పరిశీలించి వెంటనే పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వల్లభ నగర్‌లో వాటర్ లాగింగ్ పాయింట్‌ను కమిషనర్ పరిశీలించారు. కమీషనర్ వెంట జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎస్.ఈ అశోక్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్లు పాల్గొన్నారు.

మానవతా దృక్పథంతో సాయం

విశాలాంధ్ర - మల్కాజిగిరి : సమాజంలో ప్రతి వ్యక్తి తన పరిధిలో ఇతరులకు సహాయం చేయాలని సంకల్ప సోషల్ సర్విస్ ఆర్గనైజేషన్ సభ్యులు తెలిపారు. ఎదుటి వ్యక్తికి మానవత దృక్పథంలో ఆదుకోవడం మన కర్తవ్యంగా భావించాలని వారు అన్నారు. మల్కాజిగిరిలోని ఆనంద్‌బాగ్‌లోని 30 మంది అంధ విద్యార్థులకు సంకల్పం ఎన్‌జిఓ ఆధ్వర్యంలో వారికి పరుపులు, దిండ్లుతో పాటుగా వారికి అవసరమైన నిత్యావసర సరకులను అందజేశారు. ఈ సందర్భంగా సంకల్పం ఎన్‌జిఓ సభ్యులు మాట్లాడుతూ... ఎంతో కష్టపడి డిగ్రి, పీజీలు చేస్తున్నా అంధ విద్యార్థులకు వారి వసతిగృహంలో సరైన వసతులు కల్పించాలని నిర్ణయించినట్లు తెలిపారు. విద్యార్థులు గత కొంతకాలంగా పడుకోవడానికి కనీసం బెడ్ సీట్లు లేవని తెలుసుకుని వారికి సహాయం చేశామని తెలిపారు. విద్యార్థులు కటిక నేలపైనే పడుకుంటున్నారని, ఆవేదన వ్యక్తం చేశారు. భ్యవిషత్తులో వారికి ఏ అవసరం ఉన్నా చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ప్రస్తుతం తమ భాధ్యతగా సహాయం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంకల్పం ఎన్‌జిఓ సభ్యుల డా.వెంకట్, లక్ష్మణరావు, కొత్త కల్పన, రజిత, సుప్రియా, బింద్రా తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి కాంగ్రెస్ నేతకి హైకోర్టు నోటీసులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న ఝాన్సీ రెడ్డి, ఆమె భర్త రాజేందర్ రెడ్డికి హైకోర్టు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వివాదాస్పద భూమి కొనుగోలుకు సంబంధించిన ఒక కేసులో భాగంగా న్యాయస్థానం ఆదేశాలు ఇచ్చింది. వివరాల్లోకి వెళితే, మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం గుర్తూరు గ్రామంలో ఝాన్సీ రెడ్డి దంపతులు 2017లో సుమారు 75 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశారు. అయితే, ఇటీవలే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ స్థలంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు శంకుస్థాపన చేయడంతో ఈ భూ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో, దామోదర్ రెడ్డి అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. విదేశీ పౌరసత్వం కలిగిన ఝాన్సీ రెడ్డి ఇక్కడ వ్యవసాయ భూమి ఎలా కొనుగోలు చేస్తారని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. పిటిషనర్ వాదనల ప్రకారం, ఝాన్సీ రెడ్డి భారత పౌరసత్వాన్ని వదులుకుని అమెరికా పౌరసత్వం స్వీకరించారని, విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) నిబంధనల ప్రకారం ఆమె వ్యవసాయ భూమిని కొనుగోలు చేయడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. అంతేకాకుండా, తప్పుడు పత్రాలు సమర్పించి ఈ భూమిని దక్కించుకున్నారని, నిబంధనలకు విరుద్ధంగా ఆమెకు రెవెన్యూ అధికారులు పట్టాదారు పాసుపుస్తకం కూడా జారీ చేశారని పిటిషన్‌లో తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ పిటిషన్‌పై మే 1వ తేదీన జస్టిస్ సీవీ భాస్కరెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. తాజా విచారణలో... ఝాన్సీ రెడ్డి ఫెమా నిబంధనలను ఉల్లంఘించారన్న ఆరోపణల నేపథ్యంలో, భూమి కొనుగోలు వ్యవహారంపై జూన్ 19వ తేదీలోగా వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆమెకు, ఆమె భర్తకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వారితో పాటు రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, సీసీఎల్ఏ కమిషనర్, జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహశీల్దార్‌లకు కూడా న్యాయస్థానం నోటీసులు పంపింది.

సింగరేణి సేవా సమితి స్టాల్‌ను సందర్శించిన సుందరీమణులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రపంచ అందాల పోటీల నేపథ్యంలో గురువారం హైదరాబాద్‌లోని శిల్పారామాన్ని సందర్శించిన అనంతరం ప్రపంచ సుందరీమణులు పక్కనే ఉన్న ఇందిరా మహిళా శక్తి బజారును సందర్శించారు. ఈ సందర్భంగా సింగరేణి సేవా సమితి స్వయం ఉత్పత్తిదారుల వస్తు విక్రయశాలను కూడా వారు సందర్శించారు. వివిధ ఏరియాల నుండి సింగరేణి సేవా సమితిలో శిక్షణ పొందిన మహిళలు తయారుచేసి విక్రయశాలలో ఉంచిన బ్యాగులు, చేతి పర్సులు, మగ్గం వర్క్ చేసిన దుస్తులను పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విక్రయశాలలో ఉన్న స్వయం ఉత్పత్తి యూనిట్ల మహిళలతో ముచ్చటించి సెల్ఫీలు దిగారు. వివిధ ఉత్పత్తుల తయారీ గురించి అడిగి తెలుసుకున్నారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులు చక్కగా ఉన్నాయంటూ ప్రశంసలు కురిపించారు. ప్రపంచ స్థాయి సుందరీమణుల నుంచి ప్రశంసలు అందుకోవడం మాకు గర్వకారణమని సమితి సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. తమకు సింగరేణి సేవా సమితి ద్వారా శిక్షణ ఇప్పించి స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించిన సింగరేణి యాజమాన్యానికి, రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి స్టాల్ ఏర్పాటుకు అవకాశం కల్పించిన సీఎండీ ఎన్.బలరామ్‌కు స్టాల్‌లో ఉన్న సేవా మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మారుమూల ప్రాంతంలో ఉన్న తమకు హైదరాబాద్‌లో స్టాల్‌తో పాటు వసతి, రవాణా సదుపాయాన్ని కల్పించడమే కాకుండా ప్రపంచ సుందరీమణులను ఇక్కడకు తీసుకొచ్చి తమ ఉత్పత్తులకు ప్రచారం కల్పించిన సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

24న జీ తెలుగు అప్సర అవార్డ్స్

విశాలాంధ్ర - వరంగల్: వెండితెర, బుల్లితెర తారల సందడితో వైభవంగా జరిగిన జీ తెలుగు అప్సర అవార్డ్స్ ఈ నెల 24 వ తేది సాయంత్రం 5:30 గంటలకు మీ జీ తెలుగులో ప్రసారం కానుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. అంగరంగ వైభవంగా జరిగిన ఈ కార్యక్రమానికి ఎనర్జిటిక్ యాంకర్స్ సుధీర్, రవి వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన ఈ కార్యక్రమంలో డ్రామా జూనియర్స్ పిల్లలు చిరంజీవి, బాలకృష్ణ గెటప్‌లో వేదికపైకి వచ్చి ప్రముఖ నటి రోజాకు అవార్డు అందించారు. జయప్రద, ఐశ్వర్య రాజేష్, అనిల్ రావిపూడితో కలిసి సంక్రాంతికి వస్తున్నాం సినిమాలోని సీన్స్ని రీక్రియేట్ చేశారు. అమల అక్కినేని రవి, రోజాతో కలిసి డాన్స్ చేయడమే కాకుండా, జంతు సంరక్షణ, నాగార్జున, నాగచైతన్య, అఖిల్ గురించి పలు విషయాలు పంచుకున్నారు. జయసుధకు అభిమానులు ఆటోగ్రాఫ్‌లతో అలంకరించిన చీరను బహుమతిగా ఇచ్చారు. రమ్యకృష్ణ నటించిన ప్రముఖ పాత్రలతో ఓ చక్కని ప్రదర్శన ఇచ్చారు. ఘనంగా జరిగిన ఈ వేడుకలో టాలీవుడ్ ప్రముఖులైన సంయుక్త మీనన్, మీనాక్షి చౌదరి, మురళీ మోహన్, అన్నపూర్ణ, స్వప్న దత్, ప్రియాంక దత్, జీవిత రాజశేఖర్, శివాని రాజశేఖర్, సుమ కనకాల, కోన వెంకట్, నిహారిక కొణిదెల, అనసూయ, డైరెక్టర్ నందిని రెడ్డి, రజిత, ప్రగతితో పాటు మరికొందరు నటీనటులు పాల్గొని సందడి చేశారు.

అకాల వర్షాలతో నష్టపోయిన వారందరినీ ఆదుకోవాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలు గాడుపు,దుమారాలతో ప్రకృతి బీభత్సంతో నష్టపోయిన ప్రజలదరిని అన్నివిధాల ఆదుకోవాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు. ఎన్నో వ్యయ ప్రయాసాలకోర్చి రైతు కూలీలు ఆరుగాలం శ్రమ చేసి రక్తాన్ని చెమటగా మార్చి కష్టించి పండించిన పంటలు అకాల వర్షానికి ధాన్యం తడిసి ముద్దయిపోవడం కొన్ని చోట్ల వరదల్లో కొట్టుకుపోవడం రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. వివిధ కొనుగోలు కేంద్రాల్లో తాడిపత్రిలు,గన్నీ సంచులు ఇవ్వకుండా ఆలస్యం చేయడం వలన కాంటాలు వేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయి కన్నీరుమున్నీరుగా విలపించే దౌర్భాగ్య పరిస్థితి దాపురించిందన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని, నష్టపోయిన రైతంగానికి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వివిధ జిల్లాలలో వ్యవసాయ పనులు, మేకలు కాయడం తదితర పనుల కోసం వెళ్ళినవారు పిడుగులు పడి ప్రాణాలు కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబాలకు రూ.20 లక్షలు ఎక్స్ గ్రేషియో ఇచ్చి ఆదుకోవాలని, పిడుగులు పడి పాడి గేదెలు, పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు మరణించాయని ఆ కుటుంబాల వారికి తగిన విధంగా నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జలమండలిలో ఘనంగా భాగ్యరెడ్డి వర్మ జయంతి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రముఖ సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ జయంతి కార్యక్రమాన్ని గురువారం ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎండీ అశోక్‌రెడ్డి హాజరై భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాటి సమాజంలో పేరుకుపోయిన అసమానతలు, దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ అని పేర్కొన్నారు. బాలికా విద్య కోసం ఆనాడే పరితపించిన మహనీయుడన్నారు. సామాజిక దురాచారాలకు వ్యతిరేకంగా ఆయన రచయితగా, పాత్రికేయుడిగానూ పోరాడారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్లు సుదర్శన్, శ్రీధర్, ఆపరేషన్ డైరెక్టర్-1 అమరేందర్ రెడ్డి, పర్సనల్ డైరెక్టర్ మహ్మద్ అబ్దుల్ ఖాదర్, సీజీఎం, జీఎంలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ సమావేశంలో మూడు అంశాలకు ఆమోదం

విశాలాంధ్ర - హైదరాబాద్ : నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం స్టాండింగ్ కమిటీ సమావేశం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం లోని కమాండ్ కంట్రోల్ రూంలో జరిగింది. కమిటీ సమావేశంలో 14 అంశాలు, 3 టేబుల్ ఐటమ్‌లకు సభ్యులు ఆమోదించినట్లు మేయర్ తెలిపారు.

స్టాండింగ్ కమిటీ ఎజెండా అంశాలు:

సవరించిన రోడ్ డెవలప్మెంట్ ప్రకారం దారు స్సలాం జంక్షన్ నుండి మలకుంట రోడ్డు (ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంప్) వరకు ఓజీహెచ్‌కి వెళ్లే రోడ్ల వెడల్పు 30 మీటర్లు ప్రతిపాదించబడిన సవరించిన రోడ్డు అభివృద్ధి ప్రణాళిక - మాస్టర్ ప్లాన్ రోడ్ వెడల్పును 24 మీటర్ల నుండి 30 మీటర్లకు పెంచడా నికి 102 ఆస్తుల సేకరణకు కమిటీ ఆమోదం చేశారు. పురానాపూల్ నుండి కార్వాన్ సాహు వరకు వయా కమేల ప్రతిపాదిత 18 మీటర్ల నుండి 24 మీటర్ల రోడ్డు అభివృద్ధి ప్రణాళిక కోసం - (278) ఆస్తుల సేకరణకు కమిటీ ఆమోదం తెలిపారు. (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) కింద ఎన్ఎఫ్‌సిఎల్ జంక్షన్ వద్ద మల్టీ లెవల్ ఫ్లైఓవర్ నిర్మాణం కోసం రహదారి అభివృద్ధి ప్రణాళిక-సుల్తాన్-యుఐ-ఉలూమ్ కాలేజ్ ఆఫ్ లా నుండి జలగం వెంగళరావు పార్క్ వరకు ప్రతిపాదించబడిన 30 మీటర్ల వెడల్పునకు 34.50 మీటర్లు రోడ్డు ఏర్పాటుకు (6) ఆస్తుల సేకరణకు కమిటీ ఆమోదం చేసింది. హెచ్ సిటీ ద్వారా టివి-9 జంక్షన్ వద్ద మల్టీ-లెవల్ ఫ్లైఓవర్ నిర్మాణం కోసం రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ 24 మీటర్ల వెడల్పు గల 36 మీటర్ల వరకు వెడల్పు కొరకు (38) ఆస్తుల సేకరణ మరియు 2 స్ట్రెచెస్ మాస్టర్ ప్లాన్ రోడ్డు వెడల్పును పెంచడం కోసం 30 మీటర్ల నుండి 36 మీటర్ల వరకు ఫారెక్స్ ఫారెన్ ఎక్స్చేంజ్ నుండి సుల్తాన్ ఉల్ ఉలూం లా కాలేజీ వరకు 18 మీటర్ల నుండి 24 మీటర్లు వరకు టీవీ9 జంక్షన్ నుండి శ్రీనగర్ కాలనీ వరకు చేపట్టే రోడ్డు వెడల్పు చేయుటకు, బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 ప్లాట్ నెం:16బి, నార్త్ వెనుక ఉన్న జీహెచ్ఎంసీ గార్డెన్ నిర్వహణను రెండు సంవత్సరాల కాలానికి సి.ఎస్.ఆర్ కింద ఖజానా గ్రూప్-ఇండియాతో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ ఎం.ఓ.యు చేయుటకు కమిటీ ఆమోదం చేసింది. స్టోన్ వ్యాలీ, సి బ్లాక్, ఎంట్రన్స్ గేట్, (నార్త్ ఎంట్రీ), బంజారా హిల్స్ రోడ్ నెం.4 ప్రక్కనే ఉన్న పార్క్ అభివృద్ధి, సుందరీకరణ, నిర్వహణను సి.ఎస్.ఆర్ కింద ఒక సంవత్సర కాలానికి ఎడిబుల్స్, ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్‌తో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ ఎం.ఓ.యు చేసుకొనుటకు కమిటీ ఆమోదం తెలిపింది. మాస్టర్ స్పోర్ట్స్ వేర్, సికింద్రాబాద్, జీహెచ్ఎంసీ ఎంప్యానెల్డ్ స్పోర్ట్స్ మెటీరియల్ కాంట్రాక్టర్ (ఎల్ఐ) ద్వారా కోట్‌లను (నామినేషన్ ఆధారంగా) పిలిచి జీహెచ్ఎంసీ క్రికెట్ జట్టు సభ్యులకు వ్యక్తిగతంగా అప్పగించుటకు కమిటీ ఆమోదం చేశారు. 11 చెరువుల పునరుద్ధరణ పనికి నామినేషన్ ప్రాతిపదికన (ఏ) నీరి (సాంకేతిక సలహాదారు) నియామకం. "నీరు, అవక్షేప నాణ్యతను అంచనా వేయడం, నివారణ ప్రణాళిక తయారీ" అనే పద్ధతి ద్వారా.(బి) 04.11.2024న ఆ.సి హౌసింగ్, లేక్స్ ద్వారా నీరితో ఎంఓయూ ముగింపు. (సి.) వర్క్ ఆర్డర్ ప్రసారం రూ.55 లక్షల చెల్లింపు. కమిటీ ఆమోదం చేసింది. "ఇందిరా పార్క్ నుండి వీఎస్టీ మెయిన్ రోడ్ వరకు ఎన్టీఆర్ స్టేడియం జంక్షన్, బాగ్‌లింగంపల్లి జంక్షన్ వరకు 4-లైన్ల ద్వి దిశాత్మక ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం" పనులను మూసివేయ డం, దశ-1 ఫ్లైఓవర్‌లో అయ్యే అదనపు వ్యయాన్ని తీర్చడానికి, ఇది అసలు పరిపాలనా అనుమతి రూ.426.00 కోట్ల ఆమోదం చేశారు. హయత్ నగర్, సర్కిల్-3లోని వార్డు నెం.11లోని నాగోల్ క్రాస్ రోడ్ల నుండి వాటర్ లాగింగ్ పాయింట్ ఆదర్శ్ నగర్, రోడ్ నెం.1 వరకు స్టార్మ్ వాటర్ బాక్స్ డ్రెయిన్ నిర్మాణం అంచనా మొత్తం రూ.275.00 లక్షలు-పరిపాలనా అనుమతికి కమిటీ ఆమోదం చేసింది.

టేబుల్ ఐటమ్స్: కాప్రా సర్కిల్ చర్లపల్లిలో ఇంటి నెంబర్ 1/10/ 28/ /232/2/ఏ నుండి వయా డిమార్ట్ మీదుగా పోచమ్మ కుంట వరకు అక్కడ నుండి కృష్ణ రెడ్డి నగర్ ఆర్చ్ కుషాయిగూడ వరకు రూ. 375 లక్షలతో బాక్స్ డ్రెయిన్ నిర్మాణానికి అనుమతి ఇస్తూ కమిటీ ఆమోదం చేసింది. కాప్రా సర్కిల్, చిన్న చర్లపల్లిలో మోడల్ గ్రేవ్ యార్డ్ హిందూ, ముస్లిం, క్రిస్టియన్ గ్రేవ్ యార్డ్ నిర్మాణాలను రూ.550 లక్షలతో చేపట్టేందుకు కమిటీ ఆమోదం చేసింది. జీహెచ్ఎంసికి చెందిన ఆర్.కే నగర్‌లో ప్లాట్ 38లో గల 400 గజాల భూమి లో సబ్ స్టేషన్ నిర్మాణానికి హబ్సిగూడ సూపరింటెండెం ట్ ఇంజనీర్‌కు అలాట్ చేస్తూ కమిటీ ఆమోదం చేసింది. జీహెచ్ఎంసీ కమీషనర్ ఆర్.వి.కర్ణన్, స్టాండింగ్ కమిటీ సభ్యులు బొంతు శ్రీదేవి, బానోతు సుజాత, సయ్యద్ మిన్హాజుద్దీన్, సమీనా బేగం, అబ్దుల్ వాహెబ్, డా.ఆయేషా హుమేరా, మహమ్మద్ సలీం, మహాలక్ష్మి రామన్ గౌడ్, మహమ్మద్ గౌస్ ఉద్దీన్, సి.ఎస్.రెడ్డి, ఎం.డి బాబా ఫసియుద్దీన్, వి.జగదీశ్వర్ గౌడ్, బూరుగడ్డ పుష్ప, సిసిపి శ్రీనివాస్, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, హేమంత్ కేశవ్ పాటిల్, హేమంత్ సహదేవ్ రావు, అపూర్వ్ చౌహాన్, రవికిరణ్, వెంకన్న, అడిషనల్ కమిషనర్లు స్నేహ శబరిష్, వేణుగోపాల్, యాదగిరి రావు, సెక్రటరీ సత్యనారాయణ, గీతా రాధిక, నళిని పద్మావతి, వేణుగోపాల్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్లు రత్నాకర్, సహదేవ్ రావు, భాస్కర్ రెడ్డి, కోటేశ్వర రావు, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామ్ నాయక్, అకౌంట్ ఎగ్జామినర్ వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

భాగ్యరెడ్డి వర్మను ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలి : కమిషనర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : భాగ్యరెడ్డి వర్మను ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అన్నారు. స్వర్గీయ భాగ్యరెడ్డి వర్మ 137వ జయంతిని పురస్కరించుకొని గురువారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భాగ్యరెడ్డి వర్మ అణగారిన వర్గాల అభ్యున్నతికి ఎనలేని సేవలు చేశారని, బాలికల విద్య కోసం పాఠశాలలు నెలకొల్పిన మహనీయుడు అని అన్నారు. ఆయన బాల్య వివాహాలు అరికట్టడం, బాలికల విద్య, మద్యనిషేధం లాంటి అనేక కార్యక్రమాలపై ప్రజలను చైతన్యవంతం చేశారని, ఆయన సేవలు ప్రజలకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హేమంత్ సహదేవ్ రావు, అడిషనల్ కమిషనర్‌లు వేణు గోపాల్, గీతా రాధిక, యాదగిరిరావు, అడిషనల్ సిసిపి వెంకన్న, అకౌంట్ ఎగ్జామినర్ వెంకటేశ్వర్ రెడ్డి, సిపిఆర్ఓ మహమ్మద్ మూర్తుజా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి స్థలం కేటాయించాలి

విశాలాంధ్ర-దుండిగల్ : మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం జిల్లా కలెక్టర్ గౌతమ్ కి కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి స్థలం కేటాయించవలసిందిగా వారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మాజీ శాసన సభ్యులు మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, కుత్బుల్లాపూర్ నియోజక వర్గం ఇంచార్జ్ కోలన్ హన్మంత్ రెడ్డి, కూకట్ పల్లి నియోజకవర్గ ఇంచార్జి బండి రమేష్, మేడ్చల్ జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, జిల్లా ఆర్టిఏ మెంబర్ తుంకుంట మున్సిపల్ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్ట్ న్యాయమూర్తితో విచారణ జరిపించాలని, వాస్తవ, అవాస్తవాలను శ్వేతపత్రం ద్వారా ప్రజలకు తెలియజేయాలని వామపక్ష నాయకులు మోడి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఛత్తీస్‌ఘఢ్ మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు పలువురు మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌కు వ్యతిరేకంగా సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్, ఎంసిపిఐ(యు), సిపిఐ(ఎంఎల్) లిబరేషన్, సిపిఐ(ఎంఎల్), పార్వర్డ్ బ్లాక్, ఆర్ 10 వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ ఆర్‌టిసి క్రాస్ రోడ్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. మావోయిస్టు కగార్ తక్షణమే నిలిపివేసి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని, ఎన్‌కౌంటర్లు తక్షణమే సుప్రీంకోర్టు న్యాయమూర్తితో న్యాయ విచారణ జరిపించాలని వామపక్ష పార్టీల నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ, ఎస్.వీరయ్య సిపిఐ (ఎం), వేములపల్లి వెంకట్రామయ్య (సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ), కె.జి.రాంచందర్(మాస్ గాదగోని రవి(ఎంసిపిఐ), ప్రసాదన్న సిపిఐ (ఎంఎల్), జానకి రాములు(ఆర్‌సి. హెచ్.మురహరి (ఎస్) ప్రసాద్ (పార్వర్డ్ బ్లాక్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ మాట్లాడుతూ ఒకవైపు పౌర హక్కుల నాయకులపై, మరోవైపు మావోయిస్టులపై హత్యకాండను కొనసాగిస్తున్నారని, ఈ ప్రజా స్వామ్యం దేశంలో కొనసాగుతున్నది ప్రజా పాలన? లేక హిట్లర్ పాలనా? అని ప్రశ్నించారు. దేశ ప్రజలరా పాలకుల అక్రమాలపై ప్రశ్నించే గొంతికలుగా ఉన్న మావోయిస్టులను ఇప్పుడు పొట్టన పెట్టుకుంటున్నట్లు గానే భవిష్యత్‌లో బిజెపి హిందూ మతోన్మాదులకు ఓటు వేయకపోతే కూడ ప్రజలను కాల్చి అంతం చేసే రాజకీయ పరిస్థితి కూడ రావచ్చన్నారు. ఈ బూటకపు ఎన్‌కౌంటర్లను ప్రశ్నించడానికి ప్రజలంతా ముందుకు రావాలని పశ్య పద్మ ప్రజలను కోరారు. ఎస్.వీరయ్య మాట్లాడుతూ అటవిలోని ఖనిజ సంపదను, భూమిని కార్పోరేట్ శక్తులకు దోచి పెట్టేందుకే బిజెపి ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలను ఎన్‌కౌంటర్‌తో అతి కిరాతకంగా కాల్చి చంపుతోందన్నారు. వేములపల్లి వెంకట్రామయ్యతో పలువురు మాట్లాడుతూ తాము శాంతి చర్చలకు సిద్ధమని, 6 నెలల పాటు కాల్పుల విరమణను పాటిస్తున్నామని ప్రకటించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం మాత్రం రాజ్యాగానికి, ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా మావోస్టులను వేటాడి వెంటాడి కాల్చి చంపుతున్నారని, ఈ దమన కాండను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హైదరాబాద్ సమితి సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, బి.స్టాలిన్, నగర సమితి సభ్యులు చెట్టుకింది శ్రీనివాస్, అనిల్ కుమార్, ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, కార్యనిర్వాహక అధ్యక్షులు ఎన్.శ్రీకాంత్, రాష్ట్ర సమితి సభ్యులు సత్యప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతి నిరుపేద సన్నబియ్యం తినాలన్నదే లక్ష్యం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : రాష్ట్రంలోని ప్రతి నిరుపేద సన్నబియ్యంతో అన్నం తినాలన్న లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని చందనగర్ డివిజన్ వేముకుంటా బస్తీలో సన్నబియ్యం లబ్ధిదారులు బి సునీత సుందర్ ఇంటికి రంగారెడ్డి జిల్లా మహిళ డిసిసి అధ్యక్షురాలు జ్యోతి భీమ్ భరత్, జై బాపు జై భీమ్ జై సంవిధన్ అబ్జర్వర్ రమేష్ గుప్త, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి సన్నబియ్యంతో వండిన భోజనం చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారి కుటుంబం యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సన్నబియ్యం ఎలా ఉన్నాయంటూ కుటుంబ సభ్యురాలు శ సునీత ఆరా తీశారు. దొడ్డు బియ్యం పంపిణీ చేసినపుడు అసలు తీసుకునేందుకే ఆసక్తి చూపేవాళ్లం కాదని ఇంటిల్లాలు సమాధానమిచ్చింది. ఇప్పుడు సన్నబియ్యం ఇవ్వడంతో కుటుంబానికి ఉపయోగంగా ఉంటుందని సంతోషం వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణనే అని, అంతేకాదు సన్నాలను ప్రోత్సహిస్తూ రైతలకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇచ్చి ప్రోత్సాహం ఇవ్వడంలో ప్రభుత్వం ముందు వరుసలో నిలిచిందని, గడిచిన సీజన్లో సన్నాలకు రూ.1.199 కోట్ల బోనస్ను రైతుల ఖాతాలో జమ చేసింది. దీంతో ప్రభుత్వ నిర్ణయాల పట్ల రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ లేబర్ సెల్ ఉపాధ్యక్షుడు నల్లా సంజీవ్ రెడ్డి, శేరిలింగంపల్లి మైనార్టీ చైర్మన్ అజీం, మాజీ కౌన్సిలర్ రఘుపతిరెడ్డి నియోజకవర్గ నాయకులు మహిపాల్ యాదవ్, మిరియాల రాఘవరావు, వీరేందర్ గౌడ్, కట్ల శేఖర్ రెడ్డి, ఉరిటి వెంకట్‌రావు, డివిజన్ అధ్యక్షులు అలీ, బాష్పక్ యాదగిరి, మారేలా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి

విశాలాంధ్ర - అమనగల్లు : హనుమాన్ జయంతి సందర్భంగా కడ్తాల మండలంలోని అన్మాస్పల్లి గ్రామం హనుమాన్ నామస్మ రణతో మారుమోగింది. ఈ సందర్భంగా ఆలయంలో డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా కుటుంబ సభ్యులతో కలిసి అన్మాస్పల్లి ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు హెూమాలు, అష్టోత్తర నామాలు, అభిషేకాలు హనుమాన్ చాలీసా పారాయణం సుందరకాండ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గంప వెంకటేష్ గుప్తా మాట్లాడుతూ ఆంజనేయస్వామిని ఆరాధిస్తే సకల పాపాలు తొలగిపోయి శుభాలు కలుగుతాయని దీంతో విముక్తి లభిస్తుందని అన్నారు. హనుమాన్ చాలీసా సుందరకాండ పారాయణాన్ని పఠించి గ్రామమంతా చిన్న పెద్ద తేడా లేకుండా భక్తి పరవశంతో హనుమాన్ పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బాచిరెడ్డి వెంకటరెడ్డి, కొర్పుల లక్ష్మారెడ్డి, మాజీ ఎంపిటిసి లచ్చిరాం నాయక్, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు జోగు వీరయ్య, నాయకులు గంప శ్రీనివాస్ గుప్తా, చాట వెంకటేష్, మురళీకృష్ణ, పర్వతాలు, కేశవులు, భక్తమండలి భజన మండలి నాయకులు మురళి, నారాయణ, కృష్ణ, రామకృష్ణ, ఆలయ అధ్యక్షులు రాజు, బ్రహ్మం, శ్రీను, ఆంజనేయ స్వామి భక్తులు పాల్గొన్నారు.

క్లాస్‌మేట్ 'ఎడ్యుగేమ్స్ ఇన్ఫినిటీ' ప్రారంభం

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : విద్యార్థులలో పదునైన ఆలోచనలు రేకెత్తించడమే లక్ష్యంగా గ్రాండ్ మాస్టర్స్ ప్రజ్ఞానంద, వైశాలి భాగస్వామ్యంతో దేశంలో ప్రముఖ నోటుబుక్, స్టేషనరీ బ్రాండ్ క్లాస్‌మేట్ 'ఎడ్యుగేమ్స్ ఇన్ఫినిటీ'ని ప్రారంభించింది. ఈనెల 24వ తేదీ నుంచి 30 నగరాలలో దీని కోసం ప్రచారం చేయనున్నారు. ఈ ప్రచారంలో గ్రాండ్ మాస్టర్స్ ఇద్దరూ పాల్గొంటున్నారు. ఈ పోటీలో పాల్గొనే వారు హాంగ్‌కాంగ్ డిస్నీల్యాండ్ సందర్శించే అవకాశంతో పాటు ప్రతిరోజూ వీఆర్ హెడ్‌సెట్‌తో సహా ఎన్నో ఉత్తేజకరమైన బహుమతులు గెలుచుకునే అవకాశం కలదు. విద్యార్థులు ప్రతి రోజు ప్రపంచ ప్రఖ్యాత చెస్ గ్రాండ్ మాస్టర్లతో కలిసి ఎడ్యుగేమ్స్ ఇన్ఫినిటీ ఆడవచ్చు. క్లాస్‌మేట్ నోటుబుక్స్‌లోని ప్రజాదరణ పొందిన చివరి పేజీ పజిల్స్ ఆధారంగా ఆడవచ్చు. దీని కోసం వినూత్న గేమిఫైడ్ నోటుబుక్‌ను ప్రారంభించింది. ఈ నోటుబుక్ చివరి పేజీ పజిల్స్‌ను ఆధునికంగా మార్చి, ఇంటరాక్టివ్ గేమ్స్‌గా తీర్చిదిద్దారు. ప్రతి రోజు విద్యార్థులు చివరి పేజీని స్కాన్ చేసి కొత్త గేమ్ ఆడవచ్చు. ఇది విద్యను ఆడుతూ నేర్చుకునే ప్రక్రియగా రూపొందించబడింది. ఇది విద్యార్థులను గేమ్స్, పజిల్స్‌పై దృష్టి పెరిగేలా చేస్తుంది. ఈ సందర్భంగా గ్రాండ్ మాస్టర్ ఆర్ ప్రగ్యానంద మాట్లాడుతూ క్లాస్‌మేట్ 'ఎడ్యుగేమ్స్ ఇన్ఫినిటీ' కేవలం ఆట మాత్రమే కాదని, మన మైండ్‌ను ట్రెయిన్ చేసుకునే సరదా, సమర్థవంతమైన ఒక మార్గమన్నారు. ఈ సందర్భంగా గ్రాండ్ మాస్టర్ ఆర్ వైశాలి మాట్లాడుతూ చిన్నప్పుడు ఇంట్లో పజిల్స్ ఆడుతూ పెరిగామన్నారు. వాటివల్ల మా ఫోకస్, మానసిక స్థైర్యం బాగా పెరిగాయన్నారు. ఈ గ్రాండ్ మాస్టర్స్ తల్లిదండ్రులు మాట్లాడుతూ మా పిల్లల చిన్నప్పుడు ప్రతిరోజూ పజిల్స్, బ్రెయిన్ గేమ్స్ ఆడమని ప్రోత్సహించేవాళ్లం అన్నారు. ఆ అలవాట్లే వాళ్ల మానసిక క్రమశిక్షణను నిర్మించాయనే విషయం ప్రత్యక్షంగా చూశామన్నారు. క్లాస్‌మేట్ 'ఎడ్యుగేమ్స్ ఇన్ఫినిటీ ఆ ప్రయాణాన్ని గుర్తుకు తెస్తుందన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర- బషీర్ బాగ్: టీఎన్జీవోస్ స్కూల్ ఎడ్యుకేషన్ సెంట్రల్ ఫోరం అధ్యక్షులు కెర్ రాజ్‌కుమార్, కార్యదర్శి ఎండి ఫక్రుద్దీన్ అహ్మద్‌లు టీజీ జెఎసి చైర్మన్ మారం జగదీశ్వర్, డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎస్ఎం హుసేని ముజీబ్, టిఎన్జీవో సెంట్రల్ యూనియన్ అసోసియేట్ ప్రెసిడెంట్ కె. వెంకటేశ్వర్లు లను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, బొకేలతో సత్కరించి డిపార్ట్మెంట్‌కు సంబంధించిన దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మిడ్ డే మీల్స్ పోస్టులను (10 అసిస్టెంట్ డైరెక్టర్, 10 సూపరింటెండెంట్, 20 సీనియర్ అసిస్టెంట్) అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ కొరకు, పాత పద్ధతి ప్రకారంగా అర్హులైనటు వంటి మినిస్టీరియల్ సిబ్బందికి జూనియర్ లెక్చరర్, స్కూల్ అసిస్టెంట్ ఎస్జీటీలుగా 10 శాతం కోట ప్రకారంగా పదోన్నతులు కల్పించాలని కోరారు. నూతనంగా ఏర్పడినటువంటి జిల్లాలలో యూనిఫామ్ క్యాడర్ స్ట్రెంత్ నియమించాలని, ఓపెన్ స్కూల్లో సపోర్టింగ్ స్టాఫ్ కల్పించుట కొరకు, ఇతర జోన్లో పనిచేస్తున్నటువంటి సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్ చార్మినార్ జోన్ అక్రమ కేటాయింపుపై వివరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్జీవో స్కూల్ ఎడ్యుకేషన్ సెంట్రల్ ఫోరం అసోసియేట్ ప్రెసిడెంట్ ఏం దేవేందర్, ట్రెజరర్ పవన్‌బాబు, వైస్ ప్రెసిడెంట్లు ఎం భాస్కర్, ఆర్ అశోక్, జాయింట్ సెక్రటరీల రమేష్, సుదర్శన్, శ్రీనివాస్ బాబు, పబ్లిసిటీ సెక్రటరీలు దిలీప్‌కుమార్ యాదవ్, ఫిరోజ్ అరుణ జ్యోతి, గౌసిద్దీన్, గౌతమ్, మహబూబాబాద్ జిల్లా స్కూల్ ఎడ్యుకేషన్ ఫోరం ప్రెసిడెంట్ గణేష్, సెక్రెటరీ ముజాయుద్దీన్, ఉస్మాన్ పాల్గొన్నారు.

మేడిపల్లి మండల కార్యదర్శిగా రచ్చ కిషన్ ఏకగ్రీవ ఎన్నిక

విశాలాంధ్ర - మేడిపల్లి: మేడిపల్లి మండలం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇందిరా నగర్ కాలనీ సంక్షేమ సంఘం భవనంలో గురు వారం ఉదయం సిపిఐ పార్టీ మేడిపల్లి మండల 4వ, మహాసభ నిర్వహిం చడం జరిగినది. ఈ మహాసభ రచ్చ కిషన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథులుగా జిల్లా సహాయ కార్యదర్శి జి దామోదర్ రెడ్డి, ఉమామహేష్ మరియు నియోజకవర్గ కార్యదర్శి తోటపల్లి శంకర్ జిల్లా కార్యవర్గ సభ్యురాలు జె లక్ష్మీలో హాజరవ్వడం జరిగినది. జిల్లా సహాయ కార్యదర్శులు జి దామోదర్ రెడ్డి, ఉమా మహేష్‌లో మాట్లాడుతూ సిపిఐ పార్టీ పేద ప్రజల ప్రక్షాను నిలబడుతూ ప్రజా పోరాటాలు నిర్వహిస్తూ కార్మికులను కర్షకులను వారి హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న మరియు 100 సంవత్సరాలు నిండిన ఏకైక పార్టీగా భారత కమ్యూనిస్టు పార్టీ అని కొనియాడారు. నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి చేసి వేలాది ఎకరాలను పేదలకు పంచిన ఘనత చరిత్ర కమ్యూనిస్టులది అన్నారు. మేడిపల్లి సిపిఐ పార్టీ మండల కార్యదర్శిగా రచ్చ కిషన్, సహాయ కార్యదర్శిగా సిహెచ్ మాధవి, జి నాగరాజు ఎన్నుకోవడం జరిగింది. కౌన్సిల్ సభ్యులుగా జె లక్ష్మి, కే ప్రమీల, మహాలక్ష్మి, దండు రమేష్, మాచర్ల కనకయ్య, భూతం ఐలయ్య, రచ్చ శ్యామ్, నర్సమ్మ, ఉప్పల కొమురయ్య, బాపరాజు, దండు మదర్, భూతం నరేష్, రమతారా, లక్ష్మమ్మ, ఎం విజయ్, నాగమణి, ఎండి అన్వర్, జ్యోతి, సోమయ్య, సైదులు, తమన్నా, మాధవ్, ఏకగ్రీవంగా ఎన్నికవ్వడం జరిగినది.

బాల్య వివాహాలపై అవగాహన కోసమే బాల అదాలత్

విశాలాంధ్ర - హైదరాబాద్ : మారు మూల గ్రామాలలో ఉన్నటువంటి పిల్లలకు బాల్య వివాహాలపై అవగాహన కలిపిస్తు న్యాయం జరిగేలా చూడాలనే ఉద్దేశ్యం తో "బాల అదాలత్" కార్యక్రమాన్ని జిల్లాలో మొట్ట మొదటి సారిగా చేపట్టడం జరుగుతుందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ సీతా దయాకర్ రెడ్డి అన్నారు. గురువారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పిల్లల హక్కుల పరిరక్షణ సమస్యల పరిష్కారానికి "బాల అదాలత్" కార్యక్రమంపై బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధ్యక్షతన సమన్వయ సమావేశం ఏర్పాటు చేయడము జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో పిల్లల సమస్యలు, బాల్య వివాహాలను అరికట్టేందుకు పిల్లలకు వారి తల్లిదండ్రులకుప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసి పూర్తి అవగాహనా కలిపించాల ని, జిల్లలో రెవెన్యూ, పోలీస్, విద్యా, ఆరోగ్య, వెల్ఫేర్, అన్ని శాఖల సమన్వయంతో ముందు కేల్లాలన్నారు. జూన్ నెలలో బాల అదాలత్ కార్యక్రమం ఉంటుందని, అందుకు అందరు అధికారులు ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. పిల్లల హక్కుల పరిరక్షణ సమస్యల పరిష్కారానికి వచ్చే నెలలో మూడో వారంలో నిర్వహించబోయే "బాల అదాలత్ కార్యక్రమం" గురించి కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి వివరించారు. పిల్లలకు ఆరోగ్యం, విద్య ముఖ్యమైనవనీ, వికారాబాద్ జిల్లాలో బాల్య వివాహాలు ఎక్కువగా నమోదు అవుతున్నా యని, వాటి నివారణకు తదుపరి కార్యాచరణ బాల్య వివాహ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ఇక్కడ సమన్వయంతో ఈ కార్యచరణ రూపొందించుకోవాలని, బాలల పరిరక్షణ కమిటీలు బలోపేతం చేయాలని కమిషన్ సూచించారు. కమిషన్ సభ్యులు చందన, సరిత, వచన్ కుమార్, వందనగౌడ్, ప్రేమలత అగర్వాల్, అదనపు కలెక్టర్ సుధీర్, సిడబ్ల్యుసి చైర్మన్ వెంకటేశం, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అధికారులు, జిల్లా బాల పరిరక్షణ విభాగం అధికారులు, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది, సఖి, భరోసా సిబ్బంది, బిఆర్‌బి కోఆర్డినేటర్, సిడిపిఓలు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి వేడుకల్లో గాంధీ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : హనుమాన్ జయంతి పర్వదినంను పురస్కరిం చుకుని మియాపూర్ డివిజన్ పరిధిలోని మియాపూర్ విలేజ్ లోగల శ్రీ హనుమాన్ దేవాలయంలో జరిగిన హనుమాన్ జయంతి వేడుకలలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలందరికి హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను అని, ఎక్కడ శ్రీరాముడు కొలువై ఉంటాడో, ఎక్కడ శ్రీరామ నామం వినిపిస్తుందో.. అక్కడ హనుమంతుడు ఉంటాడు. ఆయనను మించిన భక్తుడు లేడంటూ శ్రీ రామచంద్రుడు ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్న భాగ్యశాలి హనుమంతుడు అని తెలియచేసారు. నాయకులు గంగాధర్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ఓం ప్రకాష్ గౌడ్, కృష్ణ పటేల్ గౌడ్, నాగేశ్వర్ గౌడ్, అశోక్, వెంకటేష్ గౌడ్, రవి గౌడ్, కృష్ణ గౌడ్, వీరేందర్, ప్రవీణ్, మహేందర్ ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్, శివ ముదిరాజ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో నూతనంగా ఏర్పాటు చేసిన బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమంలో భాగంగా కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డితో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ విగ్రహా ఆవిష్కరణ చేసి పూలమాల వేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహంను ఎల్లమ్మబండలో ఆవిష్కరణ చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని, ఆయన జీవితం అసమానం. మొట్టమొదటి బహుజన వీరుడు, బహుజన చక్రవర్తి, బహుజన నాయకుడు అయినా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం అని కొనియాడారు. శతాబ్దాల కిందటే రాచరిక నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పేద ప్రజలను సంఘటితం చేసి రాజకీయ, సామాజిక సమానత్వమే మూల సూత్రంగా గోల్కొండ ఏలిన బహుజన చక్రవర్తి సర్వాయి పాపన్న జీవితం అసమానం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు, కాలనీ వాసులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దోమల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలి

విశాలాంధ్ర, మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని పి.వి.ఎన్ కాలనీలో కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ ఎంటమాలజీ విభాగం సిబ్బందితో కలిసి దోమల నియంత్రణపై పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దోమల వృద్ధిని అరికట్టే విధంగా ఎంటమాలజీ పనితీరు మెరుగుపడాలన్నారు. ముఖ్యంగా లార్వ స్థాయిలోనే దోమల నివారణ జరిగే విధంగా చర్యలుండాలన్నారు. దోమల వృద్ధి ఎక్కడ ఉంటుందో గుర్తించి అక్కడ నివారణ చర్యలు తీసుకున్నట్లైతే దోమలను నియంత్రించవచ్చన్నారు. ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్‌లో ప్రతి గురువారం ఫాగింగ్ చేయనున్నట్లు ఫాగింగ్ సూపర్‌వైజర్ నజీర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మల్లోజుల లేదా తిరుపతి?

మావోయిస్టు పార్టీ అధిపతిపై ఇంటెలిజెన్స్ ఆరా

న్యూఢిల్లీ: మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు మరణంతో... ఆయన వారసుడు ఎవరనే అంశంపై ఇంటెలిజెన్స్ వర్గాలు దృష్టిపెట్టాయి. మావోయిస్టులు చుక్కానీ వంటి నాయకుడిని కోల్పోవడంతో... ఆ స్థానం తీసుకోవడం కొత్తవారికి సవాళ్లతో కూడుకొన్నదే. అయినా రెండు పేర్లపై ఇంటెలిజెన్స్ వర్గాలు దృష్టిపెట్టాయి. వీటిలో తిప్పిరి తిరుపతి అలియాస్ దేవుజీ, మల్లోజుల వేణుగోపాలరావు అలియాస్ సోను పేర్లు తెరపైకి వచ్చాయి. ఇప్పుడు తిరుపతి మావోయిస్టు సెంట్రల్ మిలిటరీ కమిషన్‌కు అధిపతిగా ఉన్నారు. ఇది పార్టీ సాయుధ విభాగం. వేణుగోపాలరావు పార్టీ సైద్ధాంతిక విభాగానికి అధిపతిగా పనిచేస్తున్నట్లు భావిస్తున్నారు. వీరిలో తిరుపతి దళిత వర్గానికి చెందిన వ్యక్తి కాగా... వేణుగోపాలరావు అగ్రకులానికి చెందినవారు. తిరుపతి పగ్గాలు చేపడితే... దళితులతోపాటు ఆదివాసీల్లో పార్టీని బలంగా తీసుకెళ్లేందుకు అవకాశం లభిస్తుందని ఇంటెలిజెన్స్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. పార్టీకి గతంలో నాయకత్వం వహించిన మల్లోజుల కోటేశ్వరరావు, నంబాల కేశవరావుతో పోలిస్తే... వీరిద్దరూ రెండో శ్రేణి నాయకులు. పాతతరం నాయకుల్లో చాలామంది ఇప్పటికే చనిపోయారు. తిరుపతికి 62 ఏళ్లు కాగా... వేణుగోపాలరావుకు 70 సంవత్సరాల వయస్సు. వీరిద్దరూ తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారే. తిరుపతి జగిత్యాలకు చెందినవాడు కాగా... వేణు పెద్దపల్లి వాసి. ఈ నేపథ్యంలో మావోయిస్టులు సాయుధ విభాగం నాయకుడి వైపు మొగ్గుతారా లేదా సైద్ధాంతిక విభాగం నాయకత్వాన్ని ఆమోదిస్తారా అన్నది కీలకమని ఇంటెలిజెన్స్ వర్గాలు భావిస్తున్నాయి. వేణుగోపాల్‌కు పార్టీలో సీనియర్ల మద్దతు ఉన్నట్లు భావిస్తున్నారు. ఆయన పూర్వపు నాయకుడు మల్లోజుల కోటేశ్వరరావు సోదరుడు. ఇప్పటికీ పార్టీలో ఆయనను అతిపెద్ద నాయకుడిగా చూస్తారు. ఆ స్థానాన్ని వేణుగోపాల్ మాత్రమే భర్తీ చేయగలడని అంచనాలున్నాయి. ఇప్పటికే పార్టీలో ఉన్న పాతతరం నాయకులు ప్రభుత్వంతో చర్చల కోసం ఆయుధాలు వదిలి లొంగిపోవడానికి సిద్ధంగా లేరని అధికారులు చెబుతున్నారు. అబూజ్‌మడ్ అడువుల్లో బుధవారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు దళపతి నంబాల కేశవరావ్ అలియాస్ బస్వరాజ్ (70) మరణించారు. ఆయనతో పాటు మావోయిస్టు పత్రిక 'అవామ్-ఇ-జంగ్' ఎడిటోరియల్ బోర్డు సభ్యుడు సజ్జ వెంకటనాగేశ్వరరావు ఎలియాస్ నవీన్ (61), మావోయిస్టు కంపెనీ కాయ్7 కమాండర్ టిప్పు కూడా ఉన్నారు.

ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు యూఏఈ, జపాన్ మద్దతు

న్యూఢిల్లీ: ఉగ్రవాదంపై పోరాటంలో భారత్‌కు యునైటెడ్ అరబ్ ఏమిరేట్ (యూఏఈ), జపాన్ దేశాలు మద్దతు తెలిపాయి. ఆపరేషన్ సిందూర్, ఉగ్రవాదంపై భీకర పోరుకు సంబంధించిన భారత్ వైఖరిని ప్రపంచ దేశాలకు తెలియజేసేందుకు ఏడు ప్రతినిధులు బృందాల విదేశీ పర్యటనలు మొదలయ్యాయి. ఇందులో భాగంగా యూఏఈ, జపాన్ దేశాల్లో బృందాలు పర్యటించాయి. పాకిస్థాన్ దుశ్చర్యలు, ఆపరేషన్ సిందూర్‌పై వివరాలను ఆయా దేశాల నాయకులకు వివరించే పనిలో నిమగ్నమయ్యాయి. ఈ క్రమంలో భారత్‌కు ఆ దేశాల మద్దతు లభించినట్లు రాయబార కార్యాలయాలు వెల్లడించాయి. యూఏఈ మంత్రులు, పార్లమెంటు సభ్యులు, మేధావులతో రెండు సమావేశాల్లో శివసేన ఎంపీ శ్రీకాంత్ షిండే నేతృత్వంలోని బృందం పాల్గొన్నది. ఉగ్ర ముప్పు, ఆపరేషన్ సిందూర్, పాకిస్థాన్‌పై భారత్ చర్యలను వివరించారు. ఉగ్రవాదాన్ని రూపుమాపాల్సిందేనన్న భారత్ వాదనతో యూఏఈ ఏకీభవించింది. అలాగే, జేడీయూ ఎంపీ సంజయ్ ఝా సారథ్య బృందం జపాన్ చేరుకొని అక్కడి నేతలను కలిసింది. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్‌ను జపాన్ విదేశాంగ మంత్రి తకేషి ఇవాయా ప్రశంసించారు. ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు అండగా నిలుస్తామన్నారు.

విదేశాల్లో ఏం మాట్లాడతారో చెప్పాలి: రాజా

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ నేపథ్య పరిణామాలపై వివరాలు తెలిపేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మరోమారు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. అఖిలపక్ష బృందాలకు బ్రీఫింగ్‌పై స్పష్టత లేదన్నారు. విదేశాల్లో ఏం మాట్లాడతారో దేశంలోని రాజకీయ పార్టీలకు తెలియాలని గురువారం ఓ వార్త సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రాజా అన్నారు. విదేశాలకు కేంద్ర బృందాలు వెళ్లడంపై స్పందిస్తూ 'కొన్ని దేశాలకు అఖిలపక్ష బృందాలను పంపాలని కేంద్రం నిర్ణయించింది. సీపీఐ మాత్రం పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని కోరుతోంది' అని అన్నారు. 'ప్రస్తుత పరిస్థితుల అంచనా ఏమిటి? భవిష్యత్ కార్యాచరణ ఏమిటి? ఈ వివరాలన్నింటిని ప్రభుత్వం చెప్పాలి. రాజకీయ పార్టీలతో సంప్రదింపుల్లేవు. కొన్ని బృందాలను విదేశాలకు పంపాలని నిర్ణయించింది. పార్టీలు అంగీకరించాయి కాబట్టి వాళ్లు వెళుతున్నారు కానీ విదేశాల్లో వారు ఏం మాట్లాడతారో ప్రభుత్వం చెప్పాలి. ఇందుకోసం బ్రీఫింగ్ ఇవ్వాలి' అని రాజా అన్నారు.

'స్త్రీనిధి' డిజిటల్ సేవలు

యాప్ ఆవిష్కరించిన మంత్రి శ్రీనివాస్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పేదల జీవనోపాధి మెరుగుదలకు ఇచ్చే రుణాలలో కీలకమైన స్త్రీనిధి-ఆంధ్రప్రదేశ్ డిజిటల్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. లబ్ధిదారులకు ఈ రుణాలు మొబైల్ టెక్నాలజీ, బయోమెట్రిక్ వంటి ఆధునిక సాంకేతిక పద్ధతులలో 48 గంటల్లోగా అందనున్నాయి. ఇందుకోసం స్త్రీనిధి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంయుక్త అధ్వర్యంలో 'స్త్రీనిధి' యాప్ రూపొందింది. విజయవాడలోని సెర్ప్ కార్యాలయంలో గురువారం గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం (ఎస్ఈఆర్‌పీ) మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్త్రీనిధి యాప్‌ను ఆవిష్కరించారు. ఈ యాప్‌తో లబ్దిదారులకు మేలు జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజింగ్ డైరెక్టర్ హరిప్రసాద్, యూనియన్ బ్యాంక్ జీఎం భాస్కర్ రావు, సెర్ప్ సీఈఓ వాకాటి కరుణ పాల్గొన్నారు.

ఉక్కు కార్మికుల సమ్మె నివారణకు ప్రభుత్వం చొరవ

రవీంద్రనాథ్ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: 'విశాఖ ఉక్కు' కార్మికుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని, కార్మికుల సమ్మె నివారణకు చర్యలు చేపట్టాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్లాంట్ అభివృద్ధిని, కార్మికులను మరింత అగాధంలోకి నెడుతోందని, కూటమి ప్రభుత్వం తాము ఆశించిన విధంగా అండగా నిలవడం లేదనే భావన నెలకొందన్నారు. స్టీల్ ప్లాంట్ కార్మికులను నిరవధిక సమ్మెలోకి ప్రభుత్వాలే నెట్టాయని పేర్కొన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ కు కేంద్రం ప్రకటించిన రూ.11,440 కోట్లు ఆర్థిక ప్యాకేజీ వల్ల సంస్థ, కార్మికుల కీలక సమస్యలు పరిష్కారమవుతాయని కార్మికులు భావించారని, ఆంక్షలు పెట్టి జీఎస్టీ, బ్యాంకుల రుణాలు, పాత బకాయిలకు రూ.9,346 కోట్లు జమచేసిందని, ఉద్యోగులు, కార్మికులకు ఎనిమిది నెలలుగా సగం వేతనాలనే చెల్లిస్తోందని వివరించారు. వేలాది మంది కాంట్రాక్ట్ కార్మికులకు జీతాల బకాయిలున్నాయని తెలిపారు. విశాఖ ఉక్కు లాభాల బాట పట్టాలంటే సొంతగనులు కేటాయించాలని, దేశంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు రంగ స్టీల్‌ప్లాంట్లకు సొంత గనులు కేటాయించి... కేవలం విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై మాత్రమే వివక్షత చూపుతోందని తెలిపారు. కేంద్ర ఆదేశాలంటూ యాజమాన్యం కార్మికులను తొలగిస్తోందని, ఇది ఉత్పత్తికి విఘాతం కలిగించే చర్యని, కార్మికుల తొలగింపులను నిలుపుదల చేయాలని కోరారు. పరిశ్రమ లోపల పోలీసులను నియమించి కార్మికులపై నిర్బంధం ప్రయోగిస్తున్నదని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఇంతవరకు పన్నులు, డివిడెండ్ల రూపంలో సుమారు రూ.54వేల కోట్ల ఆదాయం సమకూర్చిందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి ఉక్కు పరిశ్రమ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్: మంత్రి నాదెండ్ల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వినియోగదారులకు ఏ సమయంలోనైనా రేషన్ తీసుకునే విధంగా చౌక ధరల దుకాణాలు అందుబాటులో ఉండాలని పౌర సరఫరాశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. విజయవాడ కానూరు పౌర సరఫరాల శాఖ భవనంలో గురువారం మంత్రి అధ్యక్షతన చౌక దుకాణాల రాష్ట్ర అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం జరిగింది. గత ప్రభుత్వం ఇంటి ఇంటికి బియ్యం అంటూ ఎండీయూ వాహనాలు తీసుకువచ్చి ప్రభుత్వానికి ఆర్థిక భారం మోపిందన్నారు. డోర్ డెలివరీ అన్నారే తప్ప ఆచరణలో అది వీధి రేషన్‌గా మారిందన్నారు. ప్రతినెల ఒకటవ తేదీ నుంచి ఐదో తేదీ లోపు వృద్ధులు, దివ్యాంగులకు రేషన్ వారి ఇంటి వద్దనే అందించాలన్నారు. జూన్ ఒకటో తేదీ నుంచి చౌకధరల దుకాణాల నుంచి రేషన్ సరుకులు అందించాలన్నారు. రేషన్ షాపుల వద్ద సీసీ కెమెరాలు విధిగా ఏర్పాటు చేయాలన్నారు. కార్డుదారులకు వారు కోరిన సమయంలో రేషన్ తీసుకునే వెసులుబాటు రేషన్ దుకాణం ద్వారానే సాధ్యమని గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సాహసోపేతంగా ఎండీయూ వ్యవస్థని రద్దు చేశారని పేర్కొన్నారు. పంపిణీ సక్రమంగా జరగడానికి, మెరుగైన సేవలు అందించడానికి ... వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఒక వాట్సప్ గ్రూప్, మిగిలిన కార్డుదారులకు ఒక వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేయాలని డీలర్లకు సూచించారు. కార్డుదారులకు ఇబ్బందికరంగా వ్యవహరించిన డీలర్లపై కఠినమైన చర్యలు తీసుకొని పంపిణీ బాధ్యతలను వీఆర్‌ఓలకు అప్పగిస్తామని హెచ్చరించారు. కాటాతో సంబంధం లేకుండా ఈపాస్‌లోనే సరుకులు అందే విధంగా ఏర్పాటు చేస్తామని చెప్పారు. కమిషనర్ సౌరబ్ గౌర్, ఆంధ్రప్రదేశ్ రేషన్ డీలర్స్ సంక్షేమ వేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.

కోవిడ్ నివారణ జాగ్రత్తలు తప్పనిసరి

మాస్కులు, శానిటైజర్లు ఉయోగించాలి: ఏపీ ఆరోగ్యశాఖ

విశాలాంధ్ర-విజయవాడ: ప్రపంచవ్యాప్తంగా మరలా కోవిడ్ వ్యాప్తిచెందుతున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ వైద్యారోగ్యశాఖ మార్గదర్శకాలు విడుదల చేసింది. అన్ని రకాల కోవిడ్ నిబంధనలు పాటించాలని ప్రజలకు సూచించింది. తలనొప్పి, జ్వరం, దగ్గు, నీరసం, ఒళ్లు నొప్పులు లాంటి లక్షణాలు ఉంటే వెంటనే దగ్గరలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని కోరింది. మాస్కులు, శానిటైజర్లు తప్పనిసరిగా వాడాలని పేర్కొంది. ప్రార్థన సమావేశాలు, సామాజిక సమావేశాలు, పార్టీలు, ఇతర కార్యక్రమాల వంటివి వాయిదా వేసుకోవాలని కోరింది. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, విమానాశ్రయాలు వంటి వాటిలో కోవిడ్ నిబంధనలు పాటించాలి. ఎక్కువ జనాభా ఉన్న ప్రదేశాల్లో మాస్కులు తప్పనిసరిగా వాడాలి. జ్వరం లేదా చలి, దగ్గు, అలసట, గొంతునొప్పి, రుచి లేదా వాసన కోల్పోవడం వంటి లక్షణాలపై జాగ్రత్తలు తీసుకోవాలి. తలనొప్పి, కండరాలు లేదా శరీర నొప్పులు, ముక్కు కారడం లేదా ముక్కుదిబ్బడ, వికారం, వాంతులు, విరోచనాలు ఉంటే దగ్గరలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలి. ఆరోగ్య కేంద్రాల్లో అన్ని పరీక్ష సౌకర్యాలతో కూడిన 24 గంటలు పని చేసే ల్యాబ్ లు ఉన్నాయని పేర్కొంది. మాస్కులు, పీపీఈ కిట్ త్రిబుల్ లేయర్ మాస్కులను తగిన పరిణామంలో ఉంచుకోవాలని అధికారులకు వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాలు జారీ చేసింది.

ప్రకృతిని పరిరక్షిస్తేనే మానవ మనుగడ

- ప్రతి జిల్లాలో బయో డైవర్సిటీ పార్కు
- అన్ని గ్రామాల్లో పల్లెవనం ఏర్పాటు చేస్తాం
- అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవంలో పవన్ కల్యాణ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్రకృతిని పరిరక్షించుకుంటేనే మానవులు మనుగడ సాగించగలరని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రకృతిని రక్షించుకుంటే, అది మనల్ని రక్షిస్తుందని అన్నారు. జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు ప్రతి జిల్లాలో బయో డైవర్సిటీ పార్కు, ప్రతి గ్రామంలో పల్లె వనం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవ కార్యక్రమంలో పవన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పర్యావరణం అంటే కేవలం మొక్కలకు సంబంధించిన విషయం కాదని, అది మన జీవన శైలని అటవీ పర్యావరణ శాఖ మంత్రి అన్నారు. ప్రకృతిని పరిరక్షించుకుంటేనే పర్యావరణ సమతౌల్యం సాధ్యమన్నారు. 'నేను 8 ఎకరాల పొలంలో దున్నడం మానేసి అక్కడ సహజంగా మొక్కలు పెరిగే ఏర్పాటు చేశాను. జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు నా వంతు కృషి చేస్తున్నాను. సహజంగా పెరిగిన మొక్కల అవసరం మనకు లేకపోవచ్చు కానీ అవి జీవ వైవిధ్యానికి తోడ్పడతాయి. మనమందరం మన పెరట్లో జీవ వైవిధ్యం పెంచేందుకు తోడ్పడాలి. పర్యావరణ పరిరక్షణకు చట్టాలు ఎన్ని తెచ్చినా వ్యక్తిగత శ్రద్ధ లేకపోతే ఉపయోగం ఉండదు' అని పవన్ కల్యాణ్ అన్నారు. తీర ప్రాంతాల్లో సహజ సిద్ధంగా ఏర్పడిన మడ అడవులు సముద్రం దగ్గర ఉంటూ మనల్ని రక్షిస్తాయని తెలిపారు. సునామీలు, తుపాను లాంటి విపత్తులప్పుడు అవి అడ్డుగోడగా నిలుస్తాయన్నారు. మడ అడవులు నాశనం చేసేస్తున్నారని, ప్రకృతి విధ్వంసం ప్రమాదకరమని ఆందోళన వ్యక్తంచేశారు. జీవ వైవిధ్యాన్ని పెంచడం మనందరి బాధ్యతని పవన్ కల్యాణ్ అన్నారు. కార్యక్రమంలో ఏపీ బయో డైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయకుమార్, ఏపీటీఎస్ చైర్మన్ మోహన్ కృష్ణ, బోర్డు మెంబర్ సెక్రెటరీ రామకృష్ణ, అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంతరాము, ఏపీ ఎఫ్‌డీసీ ఎండీ ఖజురియా పాల్గొన్నారు.

వివాహ బహుమతి ఇస్తే తప్పేంటి? డీకే శివకుమార్

బెంగళూరు: దొంగ బంగారం రవాణా కేసులో అరెస్టయిన కన్నడ నటి రన్యారావు కేసు కర్నాటక రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్న నేపథ్యంలో కర్నాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పందించారు. మంత్రి పరమేశ్వర ... రన్యారావుకు వివాహ బహుమతి ఇచ్చినట్లు చెప్పారు. అందులో తప్పేముంది అంటూ ప్రశ్నించారు. మంత్రి చైర్మన్‌గా వ్యవహరిస్తున్న తుమకూరులోని శ్రీ సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో ఈడీ అధికారులు బుధవారం సోదాలు చేపట్టి రాన్యారావుకు, మెడికల్ కాలేజీకి మధ్య ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు గుర్తించగా... గురువారం పరమేశ్వర ఇంటికి డీకే శివకుమార్ వెళ్లారు. వివాదం వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రన్యారావు వివాహానికి హాజరైన పరమేశ్వర... బహుమతి ఇస్తే తప్పేంటి అని ప్రశ్నించారు. ప్రజా జీవితంలో ఉన్నప్పుడు ఎంతోమందిని కలుస్తుంటామని అన్నారు. పెళ్లిళ్లకు హాజరై బహుమతులు ఇస్తుంటామని... అది సహజమేనన్నారు. ఇందులో భాగంగానే రన్యారావు పెళ్లికి వెళ్లి పరమేశ్వర బహుమతి ఇచ్చారని తెలిపారు. కాగా, రన్యారావు కేసులో కర్నాటక హోంమంత్రి జి.పరమేశ్వర మెడకు ఉచ్చు బిగుస్తోంది.

రేషనలైజేషన్‌తో ఉద్యోగులకు తీవ్ర అన్యాయం: భూపతిరాజు

విశాలాంధ్ర-విజయవాడ : రేషనలైజేషన్ ద్వారా గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్‌ఓ), గ్రామ సర్వేయర్ (వీఎస్), గ్రామ రెవెన్యూ సహాయకులకు (వీఆర్‌ఏ) తీవ్ర అన్యాయం జరుగుతుందని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భూపతి రాజు రవీంద్రరాజు అన్నారు. గాంధీనగర్ ప్రెస్ క్లబ్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఆయా శాఖల ఉన్నతాధికారుల ప్రమేయం లేకుండా సిబ్బందిని తగ్గిస్తూ జీఎస్‌డబ్ల్యూఎస్ జీవో 4 జారీ చేయడం దారుణమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సచివాలయాలను జనాభా ప్రాతిపదికన క్లస్టర్ విధానం తీసుకొచ్చి రెండు, మూడు సచివాలయాలను కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేస్తూ, ఒక సచివాలయానికి ఒక వీఆర్‌ఏను లేదా ఒక విలేజ్ సర్వేయర్‌ను కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారన్నారు.ఈ క్లస్టర్ విధానం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 7,500 మంది వీఆర్వో , 4,722 మంది వీఎస్‌లను తగ్గిపోతున్నట్టు ఏ సచివాలయంలోను చూపలేదన్నారు. దీని వలన పదోన్నతులకు అర్హులైన వీఆర్‌ఏలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. అర్హులైన వీఆర్వోలకు పదోన్నతులు కల్పించాలన్నారు. రెవిన్యూ సమస్యల పరిష్కారాలను సర్వేయర్‌లపై రుద్దడం చాలా దారుణమన్నారు. కారణం చెప్పకుండా సిబ్బందిని తగ్గిస్తూ నిర్ణయం తీసుకోవడంతో వీరంతా ఆందోళన చెందుతున్నారన్నారు.

27కల్లా అల్పపీడనం?

రైతులు అప్రమత్తం కావాలి: వాతావరణశాఖ హెచ్చరిక

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో చెదురుమదురుగా వర్షాలు పడ్డాయి. రాగల రోజుల్లోనూ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముంది. గురువారం సాయంత్రానికి పల్నాడు జిల్లా కాశిపాడులో 29.5మిల్లీమీటర్లు, విజయవాడ తూర్పులో 25.5మి.మీ, కర్నూలు జిల్లా దేవనబండలో 22.5మి.మీ, విజయనగరం జిల్లా విజయరాంపురంలో 18మి.మీ, కాగంలో 17మి.మీ వర్షపాతం నమోదైంది. తూర్పు మధ్య అరేబియా సముద్రంలో అల్పపీడనం కొనసాగుతోందని, రాబోయే 36 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ వెల్లడించారు. ఈనెల 27 నాటికి పశ్చిమమధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, తర్వాత రెండు రోజుల్లో బలపడుతుందని, రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. దీని ప్రభావంతో రాష్ట్రంలో మేఘావృతమైన వాతావరణంతో పాటు మోస్తరు వర్షాలు పడనున్నాయి. హోర్డింగులు, చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న గోడలు, భవనాలు దగ్గర నిలబడరాదని, పిడుగులతో కూడిన వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణశాఖ సూచించింది. ఈనెల 23వ తేదీ శుక్రవారం అల్లూరి సీతారామరాజు, పార్వతీపురంమన్యం, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉంది. మిగతా జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడనున్నాయి. 24వ తేదీ శనివారం అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, నెల్లూరు, శ్రీసత్యసాయి, తిరుపతి, చిత్తూరు జిల్లాలో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉంది. మిగతా జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడతాయి.

'నీట్' ప్రీ కౌన్సెలింగ్ ఫీజు వెల్లడించాలి

సీట్లు ఆపేస్తే కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రైవేటు, డీమ్డ్ వర్సిటీలకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: నీట్-పీజీ పరీక్షల నిర్వహణ, సీట్ల కేటాయింపులో పారదర్శకత లోపించడాన్ని సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా పరిగణించింది. అక్రమాలు జరిగితే సంబంధిత వ్యక్తులు, విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకునే యంత్రాంగం ఉండాలని పేర్కొంది. పారదర్శకతకు హామీ ఇవ్వాలంటే నీట్ ప్రీ కౌన్సెలింగ్ ఫీజు వివరాలను అన్ని విశ్వవిద్యాలయాలు తప్పనిసరిగా వెల్లడించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రైవేటు, డీమ్డ్ యూనివర్సిటీలన్నీ ఇందుకు కట్టుబడాలని జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్ మహాదేవన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం స్పష్టంచేసింది. సీట్లు ఆపడంపై విమర్శలు, ప్రవేశాలలో అక్రమాలపై ఆందోళన వేళ సర్వోన్నత న్యాయస్థానం తాజా ఉత్తర్వులకు ప్రాధాన్యత ఏర్పడింది. ప్రవేశాల్లో మెరిట్‌కు సముచిత ప్రాధాన్యత లభించకపోవడంపై విమర్శలు వచ్చాయి. సీట్లు ఆపేయడం ఒక్కటే నేరం కాదు. తద్వారా వ్యవస్థలోని లోపాలు బయటపడతాయి. పారదర్శకత లేకపోవడాన్ని, విధానాలు అసక్రమంగా అమలు కాకపోవడాన్ని ఇది ప్రతిబింబిస్తుంది. రెగ్యులేటరీ సంస్థలు కొన్ని చర్యలు తీసుకున్నాగానీ రియల్ టైమ్ విజిబిలిటీ, యూనిఫామ్ అమలు వంటివి అపరిష్కృతంగానే ఉన్నాయి. పారదర్శకత, సమర్థ వ్యవస్థ సాధన ఏర్పాటునకు సంస్థాగత సమన్వయం, సాంకేతికపరమైన ఆధునికీకరణ, పటిష్ఠ రెగ్యులేటరీ యంత్రాంగం, కేంద్ర-రాష్ట్ర స్థాయి అధికారులు జవాబుదారీగా ఉండటం ముఖ్యం' అని ఏప్రిల్ 29న వెలువరించిన తీర్పులో సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. పీ కౌన్సెలింగ్ ఫీజు వివరాలను తప్పనిసరిగా వెల్లడించాలని, అందులో ట్యూషన్, హాస్టల్, కాషన్ డిపాజిట్, తదితర చార్జీల వివరాలు సమగ్రంగా ఉండాలని ఉత్తర్వుల్లో స్పష్టంచేసింది. జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) పరిధిలో నియంత్రణ కార్యాచరణకు కేంద్రీకృత ఫీజు ఉండాలని సూచించింది. మిగిలిన సీట్ల కోసం కొత్త అభ్యర్థులకు కౌన్సిలింగ్ నిర్వహించే ముందు... మెరుగైన సీట్లు పొందేందుకు అప్పటికే ప్రవేశాలు పొందిన అభ్యర్థులకు రెండవ రౌండ్ తర్వాత అవకాశం ఇవ్వాలని కోర్టు పేర్కొంది. రా స్కోర్లు, జవాబు కీలు ముద్రించాలని, దశలవారీగా నీట్ పీజీ పరీక్షల నిర్వహణ సక్రమంగా, పారదర్శకంగా ఉండాలని ఆదేశించింది. సీట్లు ఆపేస్తే పటిష్ఠ చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టంచేసింది. సెక్యూరిటీ డిపాజిట్ జప్తు, భవిష్యత్‌లో నీట్-పీజీ పరీక్షలకు అనర్హులుగా ప్రకటించడం, అక్రమాలకు పాల్పడే కళాశాలలను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టడం వంటి చర్యలు తీసుకోవాలని సూచించింది. 2018లో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ లక్నోలో వైద్య విద్య&శిక్షణ డైరెక్టర్ జనరల్, యూపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది.

సల్మాన్ ఖాన్‌కు భద్రతా ముప్పు

ముంబై: బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ ఇంట్లోకి ప్రవేశించిన ఇద్దరు దుండగులను పోలీసులు అరెస్టు చేశారు. భారీ భద్రతా ఏర్పాట్లు ఉన్నప్పటికీ గత రెండు రోజుల్లో ఇద్దరు వేర్వేరు వ్యక్తులు సల్మాన్ ఇంట్లోకి చొరబడటానికి ప్రయత్నించారు. వారిద్దరూ భవనంలోకి ప్రవేశించి సల్మాన్ ఫ్లాట్‌కు చేరుకున్నారు. అయితే, పోలీసులు సకాలంలో ఇద్దరినీ అరెస్టు చేశారు. సల్మాన్ ఇంట్లోకి ఇద్దరు వేర్వేరు వ్యక్తులు, వేర్వేరు సమయాల్లో ప్రవేశించారు. వారిని జితేంద్ర కుమార్, ఇషా చబాడియాగా గుర్తించారు. ఇషాను పోలీసులు విచారించగా సల్మాన్ ఆహ్వానం మేరకు తాను వచ్చినట్లు చెప్పింది. అయితే, సల్మాన్ కుటుంబం ఆమె వాదనను ఖండించింది. నిందితురాలు ఇషా చబాడియా 36 ఏళ్ల మోడల్. గురువారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ఆమె సల్మాన్ ఖాన్ భవనం గెలాక్సీ అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించింది. తనకు సల్మాన్ ఖాన్ తెలుసునని, అతని ఆహ్వానం మేరకు ఇక్కడికి వచ్చానని చెప్పి ఇంట్లోకి వెళ్లింది. ఆమె సల్మాన్ ఇంటి తలుపు తట్టగా... ఆయన కుటుంబీకులు తలుపు తెరిచారు. సల్మాన్ పిలిచారని ఆమె చెప్పగా... విశ్వసించలేదు. వెంటనే పోలీసులకు ఫోన్ చేశారు. పోలీసులు ఆమెను పట్టుకుని విచారించారు. కాగా, మే 20న సాయంత్రం 7:15 గంటలకు ఓ వ్యక్తి సల్మాన్ ఇంట్లోకి ప్రవేశించేందుకు యత్నించాడని పోలీసులు వెల్లడించారు. ఆ వ్యక్తిని జితేంద్ర కుమార్ సింగ్‌గా గుర్తించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. జితేంద్ర కుమార్ చత్తీస్‌గఢ్ నివాసి. భారత శిక్షాస్మృతి (ఐపీసీ) సెక్షన్ 329(1) కింద కేసు నమోదు చేసినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. అదేరోజు ఉదయం 09:45 గంటల ప్రాంతంలో గెలాక్సీ అపార్ట్‌మెంట్స్‌లో జితేంద్ర కుమార్ తిరుగుతూ కనిపించాడని సల్మాన్ భద్రతాధికారి తెలిపారు. 'నేను సల్మాన్ ఖాన్‌ను కలవాలనుకుంటున్నాను. కానీ పోలీసులు నన్ను కలవనివ్వలేదు. అందుకే నేను దాక్కోవడానికి ప్రయత్నిస్తున్నాను' అని జితేంద్ర కుమార్ పోలీసులకు తెలిపాడు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.